# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక అక్టోబర్ 2010 ₹ 20/-



Mahatma Gandhi.
1987. A model of the proposed monument in Delhi, by Russian sculptor D.Ryabichev

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
- *Dammapada.*

**సంపుటి 21 అక్టోబర్ 2010 సంచిక 10**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (బుద్ధఘోషుడు)

*సమాలోచక మండలి*
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ
డాక్టర్ జయధీర్ తిరుమల రావు
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు

*సహాయ సంపాదకులు*
కాండ్రేగుల నాగేశ్వర రావు
ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*
వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*
రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20/– సంవత్సరానికి : ₹200/–
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25.00


# ఈ నెల...


మహాత్మగాంధీ – మార్టిన్ లూథర్‌కింగ్ ........................ 3
 – *కాండ్రేగుల నాగేశ్వర రావు*
గాంధీ మార్గానిదే భవిత ........................................ 6
 – *కెన్నెత్ డి. కౌండా*
స్వాతంత్ర్యోద్యమం – అనంత కవిత్వం ........................ 8
 – *దస్తగిరి*
ప్రశ్నే నా జీవితం – తిరుగుబాటే నా బాట.................. 12
 – *వాసిరెడ్డి సీతాదేవి*
సజీవ కల్పనలు – పట్నాయక్ శిల్పాలు ..................... 18
 – *బందిలి రతన్ రాజు*
అందాల జానపదం... ......................................... 22
 – *డా. మర్రెబోయిన జయదేవ్*
యుగాంతం ..................................................... 24
 – *డా. జె. లక్ష్మిరెడ్డి*
రత్నత్రయ సందేశము .......................................... 29
 – *బి.యస్.యల్. హనుమంత రావు*
ఉదగ్ర చేతన ................................................... 32
 – *డా. సి. నారాయణ రెడ్డి*
ఉగ్రకాళి........................................................ 33
 – *గజ్జెల మల్లారెడ్డి*
కృష్ణదేవరాయల తిరుమల సందర్శనలు, దానాలు......... 34
 – *డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి*
పదకవిత – కథాకావ్యాలు .................................... 38
 – *డా. అబ్బూరి గోపాలకృష్ణ*
నా కళా జీవితం ............................................... 40
 – *డా. నటరాజ రామకృష్ణ*
ఇతిహాసంలో కవలలు .......................................... 45
 – *డా. జొన్నలగడ్డ మార్కండేయులు*
ఎరుకల బ్రతుకులు ............................................ 47
 – *కోడావత్ బానునాయక్*
హేతువాదాన్ని ప్రస్తుతించిన తెలుగు కవులు ............... 50
 – *కోరు సుమతీ కిరణ్*
చిలకమర్తి వారి చిలిపి రచనలు ............................. 54
 – *డా. ముక్తేవి భారతి*
దేశీయ నవలా రూపం – 'ఊరు వాడ బతుకు'............ 57
 – *జయధీర్ తిరుమల రావు*
ఎంతవారికైనా – ఇంతిపోరు ................................ 60
 – *మునిమాణిక్యం నరసింహా రావు*
ఘన నిఘంటువు............................................... 62
 – *రవిచంద్ర*


| | | శిల్పి |
|---|---|---|
| *ముఖచిత్రం* | : మంచి కాలం ముందున్నదా? | ఎస్. పట్నాయక్ |
| *మూడవ అట్ట* | : పల్లె జీవులు | ఎస్. పట్నాయక్ |
| *చివరి అట్ట* | : కష్ట జీవులు | ఎస్. పట్నాయక్ |
| *రెండవ అట్ట* | : గాంధీ | రష్యన్ శిల్పి డి. రైబిషేవ్ |

మహాత్మగాంధి గురించి ప్రత్యేకంగా చెప్పవలసింది ఏముంది? ఆయన ఆలోచనా పథాన్ని – ఆయనే నామకరణం చేసిన 'సత్యాగ్రహం' ప్రక్రియను ఆదర్శంగా తీసుకుని తమ దేశాలలో వారి వారి సమస్యలను అధిగమించి – స్వేచ్ఛను సాధించుకోవటానికి ప్రేరణపొందిన వారిలో ప్రథముడు – మార్టిన్ లూథర్‌కింగ్. అమెరికా లాంటి 'స్వేచ్ఛ మా ఊపిరి 'equal opportunity for all' అని ఎలుగెత్తి చాటిన దేశంలో నల్లవారికి జరిగిన అన్యాయాన్ని, అవమానాలను ప్రపంచానికి తెలియచెప్పి గాంధేయ మార్గంలో వారి విముక్తికై పోరాటం సాగించి, ప్రాణాలు కోల్పోయిన 'నల్ల సూర్యునికి' ఆదర్శమైన గాంధి, మన గాంధి పుట్టిన దేశంలో మనం జీవిస్తున్నాం – ఇది గుర్తు పెట్టుకుంటే ఈ ప్రజాస్వామ్యం, ఈ రాజకీయం ఇంతగా దిగజారి పోదుకదా. 'సత్యాగ్రహాన్ని' ఒక యాంత్రిక ప్రక్రియ చెయ్యవద్దని సి.ఆర్. రెడ్డి ఏనాడో హెచ్చరించాడు.

యుద్ధం విధ్వంసమేనని, అహింసే ప్రపంచానికి శాంతిని ప్రసాదిస్తుందని – గాంధీ మార్గాన్ని ఎలుగెత్తి చాటిన కెన్నెత్ కౌండా ప్రసంగం వినండి.

కృష్ణదేవరాయల తిరుమల దర్శనాలు, దానాలు – తరువాత వాటి దుర్వినియోగం చేసిన వారికి దండన ఇవన్ని వెలికి తెచ్చిన వ్యాసం అందిస్తున్నాం.

స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో సాహిత్యం, అన్ని ప్రాంతాలనుంచి వచ్చింది. అనంతపురం నుంచి వెలువడిన కవితాగ్రహం, ప్రబోధం పాఠకులు పరిశీలించవచ్చు.

జానపద గీతాల అందాన్ని, ప్రజల జీవితంలో అవి పెనవేసుకుపోయిన తీరును గమనించండి.

ఎంతటి వారికైనా – 'ఇంటిలోని పోరు ఇంతింత గాదయ' అని వేమన చెప్పినట్లు ఆ వివరం మునిమాణిక్యం వారు తెలియచేసిన తీరు, హాస్యానికి గీటురాయి.

ఈనెల మీకు సత్యనారాయణ పట్నాయక్ శిల్ప చాతుర్యాన్ని ప్రత్యేకంగా అట్ట మీద బొమ్మలుగా అందిస్తున్నాం.

**– సంపాదకులు**



# మహాత్మగాంధీ-మార్టిన్ లూథర్ కింగ్

- కాంద్రేగుల నాగేశ్వర రావు



"సిగ్గు పడవలసినది 12 మిలియన్ల నీగ్రో బానిసలు కారు, వారి యజమానులు." 1929వ సంవత్సరంలో అమెరికాలోని నీగ్రో సంస్థ NAACP (National Association for the Advancement of Colored people) నుద్దేశించి crisis అనబడే వ్యాసంలో గాంధీ వ్రాసిన ముందు మాటలివి. ఆ పత్రికా సంపాదకుడయిన 'Du Bois' నిజమైన మానవత్వంతో గూడిన సౌభ్రాతృత్వం అమెరికాలో రావాలంటే మరో గాంధీ ఇక్కడ జన్మించాలని పేర్కొన్నాడు. అది యాదృచ్ఛికమో లేక అతని వాక్శుద్ధి అటువంటిదో తెలియదు కాని, అదే సంవత్సరంలో మార్టిన్ లూథర్‌కింగ్ జన్మించాడు.

లూథర్‌కింగ్ పెన్సిల్వేనియాలో పట్టభద్రుడై క్రైస్తవ మతాచార్యునిగా జీవితాన్ని ప్రారంభించాడు. తమ జాతీయులు, తెల్లవారినుండి పొందుతున్న అవమానాలు, అవహేళనలూ అతన్ని చింతాగ్రస్తుణ్ణి చేశాయి. బైబిల్ సూక్తులు వ్యర్థం కావు అని తలచి 'పొరుగువారిని ప్రేమించుమన్న' బైబిల్ సూక్తితో సమాదరణ సాధ్యమా? అని ఆలోచిస్తూ ఉండేవాడు. అదే సమయంలో హెూవర్డ్ యూనివర్సిటీలో ఛాన్సలర్‌గా వున్న డా॥ జాన్సన్ అప్పుడే భారతదేశం నుంచి తిరిగి వచ్చాడు. తనకు ఏర్పాటు చేయబడ్డ అభినందన సభలో మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ప్రేమతో, అహింసతో మోకరింపజేసిన గాంధీ గురించి చెప్పిన మాటలు అతనిని ఆశ్చర్యచకితుని చేశాయి.

తన మనస్సులో ఉన్న సరిగ్గా ఇదే అభిప్రాయాలను ఒక వ్యక్తి క్రియాత్మకంగా చేసి చూపించిన విధానం, తాను ఎన్నుకోబోతున్న బాట కూడా అదే కావటంతో, పుస్తకాల షాపుకు వెళ్ళి గాంధీ వ్రాసిన పుస్తకాలు, అతని గురించి ఇతరులు వ్రాసినవి సంపాదించాడు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాడు. తన అంతరంగంలో అస్పష్టంగా సాగుతున్న ఆలోచనలే అందులో యదార్థ ఘటనలుగా రూపుదిద్దు కోవటంతో అతని ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. వెదకబోయినతీగ కాలికి తగిలినట్లయింది. అహింసా ధోరణి సాధ్యమా? అసాధ్యమా? అన్న శంకలను పక్కకు నెట్టి తాను నమ్ముకున్న విధానంపై తిరుగులేని నమ్మకం పెట్టుకొని ఆత్మవిశ్వాసం పెంచుకున్నాడు.

నిజానికి గాంధీ భారతదేశంలో సాగిస్తున్న అహింసా విజయం మార్టిన్ లూథర్‌కింగ్‌కు ముందు అనేక ఆఫ్రో, అమెరికన్ నాయకులను ఆకట్టుకుంది. అట్టివారిలో రాండల్ఫ్, జేమ్స్ ఫార్మర్, బీయార్డ్ రస్టిన్ లాంటి ప్రముఖులున్నారు. వారంతా గాంధీ భారతదేశంలో బ్రిటన్ పాలకులకు వ్యతిరేకంగా తీసుకువస్తున్న శాంతి విప్లవం అమెరికా లాంటి సంపన్న దేశాలలో ఎంతవరకూ సాధ్యపడుతుంది? అంటూ చర్చలతోనే కాలం వెళ్ళబుచ్చారు. గాంధీ సాధించిన

విజయాలను బ్లాక్ ప్రెస్ ఎప్పటికప్పుడు ప్రచురిస్తూ ఉండేది. గాంధీ భావాలు క్రియాత్మక ఆచరణలు నీగ్రోలకు ఉత్ప్రేరకాలుగా పనిచేశాయి.

ఒకసారి గాంధీని అమెరికాకు తీసుకురావాలని ఆలోచించారు. దానిపై Du Bois స్పందిస్తూ గాంధీ లాంటి వ్యక్తిని అతిథిగా ఆహ్వానించే సంస్కారం అమెరికాకు లేదు. మనమే గాంధీ వద్దకు వెళ్దాం అని చెప్పి ముగ్గురు వ్యక్తులను ఎంపిక చేసి గాంధీ వద్దకు పంపారు. వారు పైన పేర్కొనబడిన రాంథల్స్, రస్టిన్, ఫార్మర్లు. వారు గాంధీని కలిసి అమెరికాకు రమ్మనమని ఆహ్వానించారు. గాంధీ వారి అభ్యర్థనను సున్నితంగా తిరస్కరిస్తూ "నేను ఇప్పుడొక ఖరీదయిన ప్రయోగం చేస్తున్నాను. ఇది మధ్యలో ఉంది. ఇందులో విజయం సాధిస్తాననే నమ్మకం వుంది. ఆత్మబలంతో పోరాటం చేస్తున్నాను. దీనిలో విజయం సాధించిన తరువాతనే నేను అమెరికాకు గానీ, ప్రపంచానికి గానీ ఏమైనా చెప్పగలుగుతా" నన్నాడు. నల్లవారి గురించి మాట్లాడుతూ, "న్యాయం మీ పట్ల వుంది. మీరూ మాలానే అహింసను ఆయుధంగా ఉపయోగించండి, విజయం సాధించగల్గుతారు. బహుశా నీగ్రోల ద్వారానే అహింస గొప్పదనం ప్రపంచానికి తెలుస్తుంద"న్నాడు.

అయితే గాంధీని కలసి వచ్చిన, ఈ ముగ్గురూ గాంధీలో ఒక రాజకీయ వేత్తను చూశారు గానీ తత్వవేత్తను చూడలేక పోయారు. గాంధీ విధానం అమెరికాకు యథాతథంగా సాధ్యపడదని నిశ్చయించారు. సామాజిక న్యాయాన్ని మతంలో ఒక భాగంగా ప్రజలందరి చేత గాంధీలా ఒప్పించగల్గటం సాధ్యం కాదని తేల్చేశారు.

మార్టిన్ లూథర్‌కింగ్ మాత్రం అలా భావించలేదు. అది సాధ్యమనే విశ్వాసం మనస్సులో ఎక్కడో వుంది. అయినా సందేహాలనుంచి పూర్తిగా దూరం కాలేక పోయాడు. హిట్లర్ లాంటి నరరూప రాక్షసుని గాంధీ సిద్ధాంతాలతో ఎదుర్కొనటం సాధ్యమయ్యేపనేనా? జాతుల హెచ్చు తగ్గులని ఆ సిద్ధాంత తీవ్ర ప్రభావంతో అందరినీ ఒప్పించగలుగుతుందా? అహింసా సిద్ధాంతంతో చరిత్రలో బానిసత్వమెప్పుడూ నిర్మూలింప బడలేదు కదా? ఇలా ఆలోచించేవాడు.

అమెరికా దేశస్థుడయిన థరో భారతీయ మత గ్రంథాలయిన ఉపనిషత్తులు, భగవద్గీతతో ప్రభావితుడైనాడు. థరో, గాంధీ యొక్క మార్గ నిర్దేశకులలో ఒకడు. గాంధీ టాల్‌స్టాయి రచనలతో కూడా ప్రభావితుడయినాడు. కానీ గాంధీ ఏ ఒక్కరి సిద్ధాంతాన్ని కాక అనేక సిద్ధాంత స్వరూపాలను ఆకళింపు జేసుకొని తనదైన ఒక సిద్ధాంత మార్గాన్ని నిర్దేశించుకున్నాడు. ఆ దారిలోనే రాజీ లేకుండా ప్రయాణం సాగించాడు. ఈ గాంధీ విధానాన్ని పునాదిగా చేసుకుంటూ తనదైన అహింసా మార్గాన్ని ఎన్నుకున్నాడు మార్టిన్ లూథర్‌కింగ్.

"ఇది నల్లవాళ్ళు, తెల్లవాళ్ల మధ్య యుద్ధం కాదు. ఇది న్యాయాన్యాయాల మధ్య జరుగుతున్న పోరాటం. మనం చేస్తున్న ఈ సంఘర్షణ (యుద్ధం కాదు) తెల్లవారి ఆత్మలతో" నంటూ నల్లవారికి నాయకత్వం వహించాడు. 1955 వ సంవత్సరంలో మార్టిన్‌కు గాంధీ సిద్ధాంతాలను తనదైన మార్గంలో నడిపించే అవకాశం Montogomory Bus Boycott ద్వారా వచ్చింది. దానికి నాయకత్వం వహిస్తూ అశేష జనావళిని ఉద్దేశించి "మనం స్వేచ్ఛ సాధించాలంటే, రక్తం కాలువలై ప్రవహించాలి. కానీ ఆ రక్తం మనదేకావాలి" అన్నాడు. ఈ మాటలు ఎందరినో ఆలోచింపజేసింది. ప్రపంచ మేధావులు, జాతి భేదం పక్కకు నెట్టి మార్టిన్‌ను సమర్థించారు. మార్టిన్ విజయం సాధించాడు. అమెరికన్ నీగ్రోలకు విముక్తి ప్రదాత అయ్యాడు.

కాపిటల్‌హిల్ (అమెరికా పార్లమెంటు భవనం) ముందు కింగ్ చేసిన ప్రసంగం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ ప్రసంగం:

*If I am wrong,*
*The Senate is wrong.*
*If I am wrong,*
*the Supreme Court is wrong.*
*If I am wrong,*
*The God is wrong.* అను మాటలతో పూర్తవుతుంది.

1960 నాటికే అతనికి అమెరికన్ గాంధీగా పేరు స్థిరపరచబడింది. దానినొక గొప్ప గౌరవంగా స్వీకరించాడతను. తన ఆలోచనలు మరింత విస్తృత పరచకో బడాలని, తన ఆలోచనలు మరింత పదునెక్కాలని ఆశించి భారతదేశం వచ్చాడు. గాంధీ యొక్క శిష్యులను కలిశారు. వినోబాభావేలోగాని, నెహ్రూలోగాని నిజమైన గాంధీ

వారసత్వాన్ని చూడలేక పోయాడు. "గాంధీ ఇప్పటికీ బ్రతికి వుంటే ఈ పరిస్థితులలో అతను మరొలా ఉండేవాడన్న" నెహ్రూ మాటలు తనను గాయపరచాయన్నాడు.

స్వాతంత్ర పోరాటంలో ముఖ్యపాత్ర తీసుకున్న గాంధీ, స్వాతంత్రదినోత్సవం నాడు ఢిల్లీలో లేకుండా హిందూ, ముస్లిం కొట్లాటలు జరుగుతున్న కలకత్తాలో బస చేశాడు. హింసకు సమాధానంగా, అహింసా మార్గంలో సత్యాగ్రహం చేశాడు. గాంధీ సత్యాగ్రహం జరుపుతున్న కొన్ని రోజులకే పరిస్థితి సద్దుమణిగింది. లార్డ్‌మౌంట్‌బాటన్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్రాసిన లేఖలో "మేము కొన్ని వేలమంది సైనికులను ఈ అల్లర్లు ఆపుజేయడానికి పంపించాము. కానీ అది వాళ్ళెవరివల్లాకాలేదు. నిరాయుధుడైన ఒక వ్యక్తి దీనిని ఆపగలిగాడని" పేర్కొన్నాడు.



గాంధీ జనవరి 30, 1948 సం॥లో ఒక మతోన్మాది చేతిలో హతుడై నాడు. మార్టిన్ లూథర్ కింగ్ మార్చి 29, 1968 వ సం॥లో ఒక జాత్యహంకారి చేతిలో హతుడైనాడు.

టైలర్ బ్రాండ్ అన్న ఒక రాజకీయ విశ్లేషకుడు, తన 'Parting of the Waves' అన్న పుస్తకంలో గాంధీ, మార్టిన్‌ల మధ్య వున్న తేడాలను పేర్కొన్నారు. మార్టిన్ లూథర్ కింగ్, గాంధీ పేరును ప్రతి నీగ్రో ఇల్లూ జపించే ఒక మంత్రంలా మార్చాడు. గాంధీ సిద్ధాంతాలను తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. హింసను, హింస ద్వారా కాక అహింస ద్వారా ఎదుర్కొనవచ్చు అనే సిద్ధాంతాన్ని తనకు నచ్చిన ధోరణిలో ఆలోచించి, అమలు పరిచారు.

Violence అన్న పదానికి వ్యతిరేక పదంగా వాడబడుతున్న Non-Violence, Non injury, Non Coercion అహింస అన్న మాటలను గాంధీ ఇష్టపడేవాడు కాదు. అసలు Violence – హింస అనే పదాలు లేకుండా ప్రేమకు, శాంతిని సూచించే మరో క్రియాపదం కోసం ఆయన అన్వేషించాడు. కొంతరవరకూ సత్యాగ్రహము అనే మాటను ఎక్కువగా వాడేవాడు. మార్టిన్ లూథర్‌కింగ్ సత్యాగ్రహ పదాన్ని ఎప్పుడూ వాడలేదు.

1931వ సం॥లో గాంధీజీ రెండో టేబుల్ కాన్ఫరెన్సుకు వచ్చినపుడు అతి తక్కువ బట్టలు తెచ్చుకున్నాడు. మార్టిన్ లూథర్ కింగ్ ఇండియా వచ్చినపుడు ఆడంబరంగా కనిపించే దుస్తులలో కనిపించేవాడు. ఇందుకుగాను లగేజీ చార్జీలుగా ఎయిర్ పోర్టులో ఎక్కువ మొత్తం చెల్లించాడు. గాంధీ బ్రిటీష్ వారిని అసహ్యించుకోలేదు. వారిని మిత్రుడయిన శత్రువుగా చూశాడు. బ్రిటీష్ వారిపై పరుష పదాలెప్పుడూ వాడలేదు. ఇంత నిబద్ధత మార్టిన్‌లో కనిపించదు.

జైన, బౌద్ధ, క్రైస్తవ, సూఫీ మతాలలోని శాంతి సందేశం గాంధీని ప్రభావితం చేశాయి. గాంధీ లూథర్‌కింగ్‌ను ప్రభావితం చేశాడు. హింస కంటే అహింస, యుద్ధం కంటే శాంతి గొప్పదని మొట్టమొదట సారిగా గాంధీ చెప్పలేదు. ఈ భావధార ప్రపంచ వ్యాప్తంగా, అంతర్లీనంగా ఉంది. బుద్ధుడు, అశోకుని తరువాత దానిని ఆధునిక యుగంలో ఆచరణకు తీసుకొని వచ్చి సఫలీకృతుడయిన వాడు గాంధీ. యుగ యుగాలుగా మానవాళి కలలుగన్న పరిపూర్ణత్వం, జీవన సాఫల్యం శాంతి ద్వారా మాత్రమే సాధ్యమని గాంధీ, లూథర్‌కింగ్‌లు చాటి చెప్పారు.

1986వ సం॥ నుంచి లూథర్ కింగ్ జన్మదినాన్ని U.S. నేషనల్ హాలిడేగా ప్రకటించింది. అతని సమాధిపై వ్రాయబడిన నివాళి:

"Free At Last

Free At Last

Thank God Almighty - I am Free at Last."

మార్టిన్ లూథర్‌కింగ్‌ను హత్యచేసిన వ్యక్తి పేరు James Earl Roy. లూథర్‌కింగ్ కుటుంబసభ్యులతనికి క్షమాభిక్ష పెట్టారు.



# గాంధీ మార్గానిదే భవిత

**- కెన్నెత్ డి. కౌండా**

**కెన్నెత్ డి. కౌండా జాంబియా పూర్వ అధ్యక్షులు. గాంధేయ వాదాన్ని, సత్యాగ్రహాన్ని, అహింసా సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకుని, తన ప్రజలకు, ప్రపంచ నాయకులకూ హింసావాదం వద్దని, యుద్ధం సర్వనాశనం చేస్తుందని మరీ మరీ బోధించాడు. అటువంటి ఆవేశ, ఆవేదనా పూరిత ప్రసంగం ఇది...**

మనం నివసించే ఈ సుందర ప్రపంచపు అభిప్రాయాన్ని మలిచే ప్రముఖులు, నాయకుల మహత్తరమైన మహాసభకు నన్ను ఆహ్వానించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. జాతి వివక్షకు, అణచి వేతకు, సామ్రాజ్యవాదానికి, దుర్భర పేదరికానికి వ్యతిరేక పోరాటంలో మహాత్మాగాంధీ అద్వితీయ సేవలను మననం చేసుకునే శుభసందర్భంలో ఆ ఆనందాన్ని పంచుకునే అవకాశాన్ని నాకు కల్పించారు. ఆయన మన మార్గ దర్శకుడు, ఆయనే లేకపోతే మన దేశాల స్వాతంత్ర్య పోరాటాల చరిత్ర భిన్నమార్గంలో నడిచివుండేది.

అందుచేత చరిత్ర గమనాన్ని మలచటంలో గాంధీజీ వహించిన పాత్రను ప్రపంచ వ్యాప్తంగా వున్న సహృదయులైన స్త్రీ, పురుషులందరు ప్రశంసించడంతో పాటు, ఆయన ప్రవచించిన విలువలకు, అందరికీ న్యాయం చేకూర్చే శాంతి సామరస్యాలతో కూడిన, ప్రపంచాన్ని నిర్మించాలనే, ఆయన ఉన్నత ఆశయ సాధనకు పునరంకితం కావాలి. మానవాళి అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మన ప్రాంతానికి ప్రాధాన్యతను సంతరించి పెట్టాయి. న్యాయంకోసం ఈ మహా దార్శనికుడు చేపట్టిన పోరాటం దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షకు, జాత్యహంకారానికి, అణచివేతకు, విదేశీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రారంభమైంది. అప్పుడే మొగ్గ తొడుగుతున్న స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి ఆజ్యం పోసింది.

అసమానమైన ఆలోచనాపటిమ, నిరాడంబరత, వివేకం కలబోసిన అసాధారణమైన గుణగణాలుగల మహనీయుడు, యుగపురుషుడు, మహాత్మాగాంధీ. న్యాయం, ధర్మం కోసం అలుపులేని నిరంతర పోరాటపటిమ చూపిన మహోన్నత వ్యక్తి. మానవాళి సేవలో ఎంతటి త్యాగానికైనా సర్వదాసిద్ధంగా వుండే నగధీరుడు ఆయన. మానవాళికి చెందిన అంశమేదీ ఆయనకు పరాయిది కాదు. తనదిగానే భావించేవారు. గాంధీజీ జీవన గమనం సత్యాగ్రహ ఉద్యమానికి జన్మనిచ్చింది. ప్రపంచ ప్రజలు హింసాత్మకంగా మారడానికి పరిస్థితులను సృష్టించిన సామ్రాజ్యవాద, అణచివేత, జాత్యహంకార శక్తులకు వ్యతిరేకంగా అహింసాయుతంగా శాంతియుతమైన, నిరోధక శక్తిని పెంపొందించే, ఆయుధం ఈ సత్యాగ్రహం.

నేడు ప్రపంచం అల్లకల్లోలంగా వుంది. అర్థరహితమైన అన్యాయమైన యుద్ధాలు జరుగుతున్నాయి. వీటివల్ల పరిణామాలు తీవ్రంగా వుంటున్నాయి. ఈ పరిస్థితులలో గాంధీజీ ప్రబోధించిన సత్యాగ్రహం అప్పటి కంటె ఇప్పుడు మరింత సవాలుగా నిలుస్తోంది. ప్రపంచం ఒక ప్రమాదకరమైన ప్రదేశంగా మారింది. గాంధీజీ స్ఫూర్తిని, విలువలను పాటించి విచక్షణతో వ్యవహరించే నాయకులు ప్రస్తుతం మనకు కావాలి. అయితే మానవాభివృద్ధిలో ఈ శతాబ్దం ఎంతో ఉత్తేజకరమైనదని చెప్పాలి. 20వ శతాబ్దంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో సాటిలేని అపూర్వమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నూతన సామర్థ్యాలతో 21వ శతాబ్దంలో మరింత ప్రగతి జరుగుతుందనేది నిస్సందేహం. దీనివల్ల మానవులు జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్లు, వైద్య తదితర రంగాల్లో వచ్చిన మార్పులు ప్రపంచ అభివృద్ధి క్రమాన్ని విప్లవాత్మకం చేశాయి. మన ఆలోచనలు, జీవనసరళి, పనితీరులలో పెనుమార్పులను తెచ్చాయి. ఈ అద్భుతమైన విజయాలకు తోడు శాంతియుత పరిస్థితులు నెలకొంటే ఎంత బాగుంటుంది. కానీ అలా జరగటం లేదు. మానవ ప్రవర్తనలో ఏ మాత్రం మార్పులేదు. మొండి వైఖరులు ఎక్కువైనాయి. తమ ప్రతాపం చూపుకోవాలనే ధోరణి పెరిగిపోయింది. ప్రపంచం యావత్తును చెప్పుచేతలలో వుంచుకోవాలనే అధికార కాంక్ష రగిలిపోతోంది. అందుచేతనే ఎంతటి అభ్యున్నతి సాధించినా దేశాల మధ్య శాంతి సుస్థిరతలు, పరస్పర భద్రత, సహకారం అన్నీ కరువైపోయాయి, కలగా మిగిలాయి. మానవాళి అభివృద్ధికి పనికిరావలసిన భారీగా వున్న కోట్లాది అమెరికన్ డాలర్ల ఆర్థిక వనరులను నిరర్థకమైన విధ్వంసక యుద్ధాలకు మళ్లిస్తున్నారు. వీటివల్ల లాభం పొందేది పేద ప్రజలు కాదు. అభివృద్ధి

చెందిన దేశాలలోని ఆయుధ తయారీ దారులు, డీలర్లు. వర్ధమాన దేశాలలోని పేదలు బాధితులుగా మిగులుతున్నారు.

ఘర్షణలకు శాంతియుత పరిష్కారాలను కోరుతూ చేస్తున్న ఐక్యరాజ్య సమితి తీర్మానాలు గానీ, ఇతర అసంఖ్యాకమైన తీర్మానాలుగానీ లెక్కకు అందని అమాయకుల హత్యాకాండను ఆపలేక పోతున్నాయి. శాంతియుత పరిష్కారాలు కాన రావడం లేదు. మానవజీవన ప్రమాణాన్ని మెరుగుపరచడానికి ఉద్దేశించిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గాడితప్పింది. యుద్ధరీతిని మార్చి వేసింది. సంప్రదాయ సిద్ధమైన యుద్ధాలలో పరిమితంగా ప్రాణ నష్టం జరిగేది. కానీ ప్రస్తుతం అనూహ్యమైన శక్తిసామర్థ్యాలు గల ఆయుధాల వాడకం వల్ల అపార వినాశనం కలుగుతోంది. ఉగ్రవాదుల చేతులలో పడిన ఆయుధాలు ఎల్లలు దాటి విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. చొరబాటు కార్యకలాపాలలో ఆత్మాహుతిదాడులు కొత్త శక్తిగా అవతరించాయి. జాతీయ ప్రయోజనాలు, సిద్ధాంతాలు, మతం తదితర అంశాల పేరిట లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. బాధలు పడుతూ జీవచ్ఛవాల్లా  బతుకులు ఈడుస్తున్నారు. సైనిక, అర్థ, బలకావరంతో వున్న యుద్ధ కాముకుల అహంకారాన్ని సంతృప్తి పరచేందుకై చర్చలను తోసి రాజంటున్నారు. మానవాళి సంక్షేమానికి మెరుగులు అద్దవలసిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవ వినాశనానికి మారణాయుధంగా రూపుదాల్చింది.



దుర్భర పేదరికం, అస్థిరత్వం, విప్లవం, ఉగ్రవాదాలకు మూలకారణం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో వచ్చిన అనూహ్యమైన మార్పు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పేదలకు ఒరిగిందేమీ లేదు. దుర్భరమైన వారి సాంఘిక ఆర్థిక పరిస్థితులు ఏ మాత్రం మారలేదు. కెన్యాలోని నైరోబిలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ సాంఘిక వేదిక ప్రపంచంలో అత్యధిక ప్రజానీకం యింకా పేదరికంలో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఆ తర్వాత దావోస్‌లో జరిగిన ప్రపంచ నాయకుల సమావేశంలో కూడా ప్రపంచ వ్యాప్త పేదరిక తగ్గుదల పట్ల చేసిన వాగ్దానాల వైఫల్యంపై మదింపు చేశారు. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంవల్ల కలిగిన అద్భుత ప్రగతి ఇంకా లక్షలాది ప్రజలకు చేరవలసివుంది. ఇంతవరకు వారు ఆ ప్రయోజనాలను పొందలేదు. ప్రపంచంలోని పలుప్రాంతాలలో పేదరికం ఫలితంగా నెలకొన్న దుర్భర సాంఘిక పరిస్థితులు అత్యధిక స్థాయిలో వున్నాయి. ఈ పరిస్థితులు నిరాశా నిస్పృహలకు, ఆగ్రహానికి, ఉగ్రవాదానికి, హింసాకాండకు దారితీసే ప్రమాదం ఉంది. ఘర్షణలు చెలరేగుతాయి. ఏహ్యభావ సిద్ధాంతం పెరిగి, అమాయక ప్రజలు అర్థరహితమైన హత్యలు జరిపే అంతర్జాతీయ ఉగ్రవాదానికి మంచి పట్టు దొరుకుతుంది. దేశాలు, సంస్థలు తమ సిద్ధాంతాలు, స్వప్రయోజన సాధనకై ఉగ్రవాదాన్ని గొప్పగా చేసి చెప్పుకుంటున్నాయి.

అందుచేత సంఘర్షణల పరిష్కారం, పేదరిక నిర్మూలన అనేవి మనముందున్న కీలక అంశాలు. సుస్థిరమైన శాంతి భద్రతలు, సహకారం, అభివృద్ధి సాధనకు ఇవి పునాదుల వంటివి. ఈ పరిష్కార మార్గంలో గాంధీజీ సత్యాగ్రహ సందేశం మనకు అవసరం అవుతుంది. అహింసను వాడుకుని గాంధీజీ అన్యాయానికి వ్యతిరేకంగా అసంఖ్యాకమైన ప్రజలను కూడగట్టారు. ఆయన గెలుపు సాధించారు. ఆయన విజయం ప్రపంచంలో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చింది. అమెరికాలో లూథర్‌కింగ్ జూనియర్ ఈ అహింసనే చేపట్టి గెలిచారు. మేము కూడా జాంబియాలో ఇదే పద్ధతి అవలంబించాం. మేమూ గెలిచాం. అందువల్ల గాంధీజీ విజయం మా విజయంగా మారింది. సత్యాగ్రహ ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తే యుద్ధ కాముకులకు మనం ఈ సంగతి చెప్పే అవకాశం కలుగుతుంది. అయిందేదో అయింది. యుద్ధాలు ఆపండి. చర్చలు మొదలు పెట్టండి. అమాయకుల ప్రాణాలు బలితీసుకోకండి. యుద్ధ క్రీడలు నిలుపుచేసి, శాంతి క్రీడలకు మలుపు చేయండి. నిందలపర్వాన్ని ఆపివేసి, అమాయకుల ప్రాణాలను కాపాడండి. అన్యాయమైన యుద్ధాన్ని ఎంత చక్కగా నడిపినా దానివల్ల విజేత ఎవరి మెప్పును పొందలేరు.

ప్రపంచంవ్యాప్తంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని తిరిగి చేపట్టే సందర్భంగా స్వేచ్ఛ, శాంతి, న్యాయం, అభివృద్ధి పరిరక్షణ కోసం మనమంతా పునరంకితం కావాలి. అభ్యుదయ ప్రభుత్వాలు, పార్లమెంటులు, జాతీయ అంతర్జాతీయ పౌర సమాజ ఉద్యమాలు, సంస్థలు, ఇతరులు అందరితో మనం చేతులు కలుపుదాం. ముక్త కంఠంతో అంతా కలసి యుద్ధం వద్దు అందాం. ఉగ్రవాదం వద్దు అందాం. యుద్ధకాముకత వద్దు అందాం. మారణాయుధాల వ్యాపారం చేసే డీలర్లను వద్దు అందాం. తమ గొప్పను చాటుకోవడానికి యువతీ యువకులను బలిపీఠానికి పంపే ప్రభుత్వ నాయకులను వద్దు అందాం. అణ్వస్త్ర వ్యాప్తిని చేయజాలము. అయితే ఈ సమస్యను సక్రమంగా నిష్పాక్షికంగా పరిష్కరించాలి. లేని పక్షంలో సత్యాగ్రహ ఉద్యమ లక్ష్యాన్ని అది నీరు గారుస్తుంది.

ఇక చివరగా నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. ప్రస్తుతం జరుగుతున్న విధ్వంసకరమైన అధిక మూల్యంతో కూడిన వ్యర్థమైన యుద్ధాలను అంతం చేయాలి. లక్ష్యసాధనలో సైనిక ప్రత్యామ్నాయాలు విఫలమయ్యాయి. అణ్వాయుధాగారాల వల్ల ఏ ఒక్క దేశానికో ప్రపంచంపై ఆధిపత్యం లభించడం జరగని పని. చర్చలు, సంభాషణలే వివాదాలకు పరిష్కారం అనే విషయాన్ని యుద్ధ క్రీడలకు ప్రత్యామ్నాయంగా సూచించాలి. యుద్ధాలలో హతులు, హతాశులు తప్ప విజేతలు అనేవారు ఎవరు వుండరు. 21వ శతాబ్దంలో మానవాళిని వినాశనం నుండి రక్షించేందుకు ప్రపంచం సన్నద్ధం కావాలి. అది మారణాయుధాలతో కాదు, గాంధీ సత్యాగ్రహ ఉద్యమంలో బోధించిన విలువలు, వివేకం అనే ఆయుధాలతోనే ఇది సాధ్యం. మనమంతా ప్రపంచ గ్రామ పౌరులుగా కలసికట్టుగా చేతులు కలుపుదాం. అహింస, ఐక్యతలకు కట్టుబడి వుందాం. యుద్ధానికి స్వస్తి పలుకుదాం. శాంతిని స్థాపిద్దాం.



# స్వాతంత్ర్యోద్యమం - అనంత కవిత్వం

- దస్తగిరి

అనంతపురం జిల్లా సాహిత్యచరిత్ర గురించి దొరికే సమాచారం తక్కువ. అదీ పప్పూరి రామాచార్యుల వారి "సాధన" పత్రిక నుంచే ఎక్కువగా దొరుకుతుంది.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పప్పూరు రామాచార్యులు, విద్వాన్ విశ్వం, చిలుకూరు నారాయణరావు, కల్లూరి వెంకట నారాయణరావు, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, కుంటిమద్ది శేషశర్మ, కలచవీడు శ్రీనివాసాచార్యులు, హెచ్. నారాయణరావు, బత్తలపల్లి నరసింగరాజు, ఎల్లంరాజు నారాయణభట్టు, టి. గురుమూర్తి, పంచాంగం సూరప్ప, జె. గుండప్పరావు, కుంటిమద్ది రాఘవాచార్, తలమర్ల కొల్లప్ప, శౌంఠి శ్రీనివాసమూర్తి, గొట్టిపాటి సుబ్బరాయుడు, టి.వి. రాఘవులు, కె. కృష్ణమూర్తి, కందళం శేషాచార్యులు, ఎ.ఎల్. నరసింహారావు మొదలగు రచయితలున్నారు. ఇందులో కవులు, విమర్శకులున్నారు. కథలు, నాటికలు రాసినవారున్నారు. కల్లూరి వెంకటనారాయణరావు రాసిన 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర', ఎల్లంరాజు నారాయణభట్టు రాసిన 'ఋగ్వేద భాష్యభూమిక', 'వ్యయవిచారం', 'సేవాంజలి' ప్రసిద్ధాలని చెప్తారు. 'సేవాంజలి' అప్పటికే ఇంటర్ మీడియట్‌కు పాఠ్యగ్రంథంగా వుంది.

స్వాతంత్ర్యోద్యమకాలంలోనే దేవులపల్లి కృష్ణశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీ నారాయణ, కొప్పరపు సోదరకవులు అనంతపురం జిల్లాలో పర్యటించి సాహితీప్రేరణలు కలిగించారు.

అనంత రచయితలు దేశభక్తినీ, సామ్రాజ్య వ్యతిరేకతను, యుద్ధవ్యతిరేకతను ప్రజలలో ప్రబోధించారు. ఆంధ్రరాష్ట్ర సాధనకు ప్రోత్సహించారు. అంటరానితనాన్ని, మద్యపానాన్ని వ్యతిరేకించారు. దీనితోపాటు అనంత జీవితాన్ని పట్టి పీడిస్తున్న కరువు, నిరుద్యోగం, చాలని జీతభత్యాలు, ఓటు ప్రాముఖ్యత, ఆరోగ్యంవంటి సమస్యలపైనా స్పందించారు. మూఢ నమ్మకాలను వ్యతిరేకించారు. వరకట్న వ్యతిరేక, కన్యాశుల్క వ్యతిరేక రచనలు చేశారు. స్త్రీ పురుష సమానత్వాన్ని కోరుకున్నారు. ప్రకృతి వర్ణనా చేశారు. పాపాయిలను ఆడించి పాడించారు. వాడుకభాషను సమర్థించారు.

సాహిత్య ప్రయోజనం గురించి 'సాధన' పత్రికలో ఎవరు రాశారో తెలీదుగానీ చిన్నదైనా గొప్పవ్యాసమే వచ్చింది. "కొద్దిజనులకు మనోరంజనము చేసి, రూపాయలు వసూలు చేయనుద్దేశ్యముతో సాహిత్యరచన చేయకూడదు. ఉదర జ్వాలల్లోనున్నవారిని కోట్లకొలది కృషికులను, అసంఖ్యాకులగు కూలీలను ఉపేక్షించి, కుర్చీలపై విశ్రాంతి ననుభవించుచున్న వారి మనఃప్రసన్నతకేర్పడినది కాదు సాహిత్యము.

దేశము చెడియున్న దశలో సాహిత్యకారుని క్షేత్రమేది? స్వార్థాంధులగు ధనికుల సౌధము కాదు. కొరకను గింజలేక, నిలువను నీడలేకయున్న బీదల గుడిసెలయందు కవి భ్రమింపవలెను. వారి కరుణాక్రందనను బీభత్సపరిస్థితిని పరికింపవలెను. మూడుకోట్లమంది, ముప్పొద్దులా గ్రామ్యంలో మాట్లాడుతూవుంటే చెడిపోని భాష పత్రికలో రాస్తేమాత్రం చెడిపోతుందా? జనసామాన్యానికి తెలిసే భాషలో అందరూ మాట్లాడే భాషలో రాయండి" ఇదీ ఆ వ్యాసంలోని కొంతభాగం.

స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి సాహిత్యమంతా కాదు గానీ, కవిత్వాన్నిమాత్రం రేఖామాత్రంగా మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను.

దస్తగిరి, సెల్ : 9848928329

గాంధీగారి కార్యాచరణ ప్రభావం ఎంతశక్తివంతమైందో పురాణప్రతీకలతో వర్ణిస్తూ కుంటిమద్ది శేషశర్మగారు 1939లో "మహాత్ముని మహత్త్వం" అనే శీర్షికతో ఒక ఖండిక రాశారు. గాంధీ దీక్షపూనితే ధరణీచక్రమే దిద్దిరన్ తిరుగుతుందంటాడు. కులపర్వతాలు అల్లాడాయి, సూర్యబింబము తడబడింది, నక్షత్రాలు రాలినాయి అంటాడు. *"హాహారావాలతో హర్తాళ్ళతో రాజకోటయంతయును గగ్గోలుపడియె / విధివిరామము లేక వెనువెంట టెలిఫోను వయరులల్లాడె కంబాలతోటి /... కాదు కూడదనియున్న రాజుగారింతలోనే పట్టువిడనాడి రాజీకివచ్చినారు"* అంటాడు. గాంధీగారు దీక్షవిరమిస్తే *"చెవులకు చల్లనై చిత్తమలరె... తృప్తికలిగెను లోకత్రయమ్మునకు / గాంధీ భారత భూమికే కైకనేత / విజయనాదము దిక్కుల వెలయజేసె"* అంటారు కుంటిమద్దివారు.

బండమీదపల్లె కరణము రామచంద్రరాజుగారు 1936లో దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారిపై ఒక పద్య ఖండిక రాశారు – "బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దైవాంశ మూర్తీభవించిన వ్యక్తి విశ్వదాత" అని ప్రశంసించారు.



కాశీనాథుని నాగేశ్వరరావు

లేపాక్షి నివాసి పంచాంగం సూరప్పగారు "నీచులక పారత దాస్యము సేవచేసి నిస్సారత ఉన్నది" అని బానిసత్వం లోని దేశదుఃస్థితిని "భూదేవి మొర" పేరిట వర్ణించారు. 'ఎన్నడు శౌరివచ్చు? భువి ఎన్నడు అసాధులడంగి పోదురు? ఎన్నడు హర్షభాష్పములు కన్నులవెంట కారు?" అని ఆశతో ఎదురుచూస్తారు కవి.

బాబు రాజేంద్రప్రసాద్ గారు 1935లో అనంతపురంలో "కేశవవిద్యానికేతన్" హరిజన హాస్టలు ప్రారంభించిన సందర్భంగా అనుములకవి స్వాగత పంచరత్నములు సమర్పించినారు.

ఘట్టు వెంకటరమణప్పగారు ఉరవకొండ నివాసి చేనేత పనివారు నలభై ఏండ్ల తన జీవితంలో ఇరవైయేండ్లు దేశసేవలో గడిపినారు. హరిజనోద్యమము నిర్వహించారు. అనేక ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. తిరువాన్కూర్ దేవాలయంలో హరిజనుల ప్రవేశ సందర్భంగా అనంతపురం జిల్లా హరిజన సేవాసంఘం తరపున ప్రతినిధిగా వెళ్లినారు. జిల్లాలో మొదటి హరిజన హాస్టలును ఏర్పాటు చేసినారు. ఐదుకల్లు సదాశివన్‌గారిని కలుపుకొని గ్రామాలు తిరిగి, ధాన్యము వసూలుచేసి, ఆ హాస్టలు నడిపినారు. ఆయన మరణించినప్పుడు టి.వి. రాఘవులు గారు 'స్మృతి' పేరిట సీసపద్యాల ఖండిక రాసినారు. *'దేశమెల్ల తిరిగి చందాలెత్తి హరిజనాశ్రమమును జరిపినావు / దిక్కుమొక్కులేని దీనబాలులను కారుణ్యబుద్ధితో గాచినావు / అంటుదోషము నడుగంట దొక్కుటకునై పదరానియిడుముల బడితివి'* అని ఘట్టు వెంకటరమణప్పగారి ఉద్యమ జీవితాన్ని కీర్తిస్తూ *'మఱచుటెట్టుల నిన్ను మాన్యచరిత?"* అంటారు.

అంటరానితనం అనే అగౌరవంతోపాటు దారిద్ర్య బాధనూ అనుభవిస్తున్న హరిజనుల దుస్థితిని తలమర్ల కొల్లప్పగారు ఇలా వర్ణిస్తారు – *"కుడువనొకపూట కూటికే యెడరుగల్గె దుర్భరులైన దారిద్ర్య తోయరాశి / నెన్ని యాయహోరాత్రంబు లిటుల బుత్తు విన్నియుపవాసముల యందు నెటుల మనుదు? / కూడుకూడో యటంచును కూనలేడ్వం వీరి నిద్రవ్వేభిరము నేవినగలేక / కృంగికృశియించి పోవుదు హృదయమునందు, దుర్భరం బాయెనే దయదోపదాయె!"*

సర్వాంతర్యామి అయిన భగవంతుని దర్శించుకోనీకుండ మత, సంఘ కట్టుబాట్లు అడ్డుపడుతున్నాయని కుంటిమద్ది రాఘవాచారిగారు విలపిస్తారు – *"నీ గుడికి దూరదూరాన నిలిపినారు / ఎట్లురానేరు గుడిలోనికేను సామి?"* అంటారు. *'నీకు నే లోపలకు రాగనిజముగాను / గల్లునే కోపమేమైన కమలనాభ! / లేక నా దృష్టిదోషాన లేచిపోయి / నిల్తువే వేరుచోటుల నీరజాక్ష?"* అని దేవున్నే నిలదీస్తారు. అంతేకాదు *"చిక్కులన్నిటి తెగద్రెంచి స్వేచ్ఛగాను... మైలమడుగులతోడ ఆ మందిరమ్ము / వీడి రమ్మివలకు సామి వేగమునకు / ఉత్తమములలోనె ఇన్నినాళ్ళుండినావు / నీచులందునా వెలయుము నేటి నుంచి"* అని తనవాడకు ఆహ్వానిస్తారు.

"లెండీ, ఉద్ధరించండీ / దిక్కులేకపోయె మాల" అంటూ గాంధీగారు చెప్పినట్లుగ హరిజనోద్ధరణకు పూనుకోవాలని ప్రబోధిస్తారు పామిడి నివాసి జె. గుండప్పగారు. *"గాంధీ యాజ్ఞ నెరవేరాలంటే / మనమందరము ఒకటిక యుంటె / మూల్గుతున్న క్షేమదేవత / మూలమూలకురకదండీ!"* అని ఆశపడతారు.

బత్తలపల్లె నరసింహరాజుగారు – *"మతమురా! ఘనమతమురా! శ్రీ గాంధీమతమె మతమురా! / వారి వీరిని వేరుజేసెడి మతము మతముగాదని తెలియ!"* అని మనుషులను చీల్చకుండ సమైక్యపరిచేదే మతమని నిర్వచిస్తారు.

*"కంటారా! కనుగొంటారా! స్వాతంత్ర్య జ్యోతిని గంటారా! / ఇందునందు బొంది సుఖముల నందులోనే గంటారా!"* అని గాంధీ చెప్పినట్లు చేస్తే సుఖాలు కలిగించే స్వతంత్ర్యదేశం ఆవిర్భవిస్తుందంటారు.

1919 మాంటేంగు సంస్కరణల ఫలితంగా ఎన్నికల వాక్కు ఏర్పడింది. ఓటుహక్కు వచ్చింది. దాంతో ఓటు, బాధా వచ్చింది. 1926లో తన పేరు చెప్పడానికి యిష్టపడని ఒక కవి ఆదితాళంలో "ఓటరు నిర్వేదం" అనే పేరుతో ఒకపాట రాసినారు – *"ఓటు వాళ్ళకిస్తే వీళ్ళక్కోపం / వీళ్ళకిస్తే వాళ్ళక్కోపం"* అని ఓటరుపై వుండే ఒత్తిడిని తెలుపుతారు. "పన్నులు తగ్గిస్తామని ఒకడు / రాజ్యం తెస్తామని ఒకడు / ఉద్యోగాలిప్పిస్తామని ఊరూరక ఆశపెట్టుతారనీ, బావులు, చెరువులు బయలైపోగా, వానలు కురకవ, పంటలు పండక క్షామములో మేము చస్తావుంటే చాలక ఓటని పీక్కుతింటారు." అని ఓట్లకోసం చేసే వాగ్దానాల బండారాన్ని బయటపెడుతు అసలు సమస్యలను ఎవరూ పట్టించుకోరని కోప్పడతారు. అయితే – *"విందు తిండికి లొంగవలదన్నా! ఒక్కపూట తింటే / ముందు ఆకలి తీరదన్నా! విందు తిండికి మోసపోయి / మందభాగ్యులకు ఓటునిచ్చిన అందులోపము దెలిసి / యావల కుంద లాభము లేదు నిజముగా"* అని ఓటును సద్వినియోగము చేయాలని బత్తలపల్లె నరసింగరాజు గారు చైతన్యపరుస్తారు.

'దత్తమండలం' అనే పదాన్ని నిరసిస్తూ – దత్తునందురు నన్ను, దత్తునెట్లగుదు?... ఇచ్చినదెవరో? పుచ్చినదెవరో?' అంటూ 28 గీతపద్యాలను చిలుకూరి నారాయణరావుగారు రాశారు. గురజాడవారి పూర్ణమ్మగేయాన్ని అనుకరిస్తూ ఆయనే ప్రజలకోసం ప్రాణత్యాగం చేసిన బుక్కరాయ సముద్రానికి చెందిన యువతి, ఒక పాపకు తల్లి అయిన ముసలమ్మ జీవిత చరిత్రను 'ముసలమ్మ మరణం' అనే గేయ కావ్యంగా రాశారు.

దోపిడీవల్ల సమాజంలో హెచ్చుతగ్గులు ఏర్పడినాయి. పేద, ధనిక తారతమ్యాలు పీడిస్తున్నాయి. వాటిని తగ్గించి పేదలకింత సాయం చేయమని ఈశ్వరుని వేడుకుంటున్నారు – హిందూపురానికి చెందిన టి. గురుమూర్తిగారు – *"కూటికిన్ గూడుకున్ ప్రజలు కూలి యొనర్చియు చాలకున్నదీ / మేటి ధనాఢ్యులెల్ల నిలమేలిమి బంగరు తూగుటయ్యె లలన్ / సాటిగుండె మాకనుచు సంతసమూఅగ నూగుచుండ నీ / పాటి యధర్మమున్ నిలుప బాల్పడవేలనో దెల్పుమీశ్వరా!'* అంటారు. *"బీదలన్ కొల్లలుగొట్టి నీచులిల కోటలు, మేడలు గట్టడం నీ చల్లని చూపులకు సాక్ష్యం."* అని పేదల పక్షంలో లేదని నిందిస్తారు. *"చచ్చేరవచ్చి తగుమేలు యొనర్పుమ'*ని వేడుకొంటారు.

నిరుద్యోగి బాధను వర్ణిస్తూ లేపాక్షి శొంఠి శ్రీనివాస మూర్తిగారు *"రోగంబు లేకనే రోగిజేతువు / నిరుద్యోగమా తొలగిపొమ్ము / సరివారిలో చౌకజేతువు / నిరుద్యోగమా నా నుండి తొలగిపొమ్ము!"* అంటారు.

రోజంత యిల్లిల్లు తిరిగి, పిల్లల్ని పోగుచేసి, చదువుచెప్పే ఉపాధ్యాయునికి సరైన జీతములేదని ఒక కవి విలపిస్తాడు. స్వేచ్ఛకోసం తల్లడిల్లుతూ అనంతపురం షెల్లీ – బెళ్ళూతి శ్రీనివాసమూర్తిగారు *"ఏను స్వేచ్ఛావిహంగమనే మహీరు / హాగ్రశాఖకా వితతులం దధివసించి / కాలమును బుత్తునో మదిదలంచి వైచు / దారుణ విషాద బంధమున్ తలగెనేడు"* అంటారు.

అనంత కరువు ఆదిమధ్యాంత రహితం. ఈ కరువు పీడ గురించి ఎంత చెప్పినా యింకా చెప్పాల్సింది మిగిలే వుంటుంది. టి. గురుమూర్తిగారు ఆ బాధను యిలా చెప్తారు – *"ఆకసంబు చూచి యాసలు నడుగంట, చూడ్కులు భూమిపై చూపువారు / ఎండిన పంటల యండనె నిలుచుండి, కన్నీరు నవనిపై కార్చువారు / బక్కటెద్దులు గట్టిడొక్కలు గనుపింప, పాతాళగంగ పైకెత్తువారు / భార్యబిడ్డల వీడి బ్రదుకు జీవుడయంచు, పారిపోయెదమని బలుకువారు / ఒక్కపూటకు కూటికి చిక్కకుండ / అన్నమో రామచంద్ర! యని యఱచువారు / నకట మారైతు సోదరులరయ నేడు / క్షామదేవత జిహ్వాగ్రసీమ జిక్కి."*

"ఆస్తులు అప్పులకిచ్చి, అస్థలతో నిల్చి, రైతు సామాన్యము రానురాను యేమి దురవస్థ రాయలసీమలోన, తల్లిపాలిండ్లలో క్షీరధార లేక శిశువు, గాట గ్రాసములేక పశు వు సమయు" అని విలపిస్తారు కడప కసిరెడ్డి వెంకటరెడ్డిగారు. సామ్రాజ్యవాద దోపిడీ, దేశీయ భూస్వామ్యదోపిడీ, కరువు

పీడల బీభత్స దృశ్యచిత్రణమే 'పెన్నేటి పాట' కావ్యం. ఇది రాయలసీమలో మొదటి ఆధునిక, అభ్యుదయ కథాకావ్యం యిది. కసాయి సామ్రాజ్య సైనికుల దౌష్ట్యాన్నుండి స్థానిక తెలుగు మహిళల మానాలను కాపాడటానికి ప్రాణాలొడ్డిన గూళపాళ్యం హంపన్నగారి పోరాటాన్ని తెలియజేసేదే "ఒకనాడు" కావ్యం. ఈ రెండింటి కవి అనంతపురం జిల్లా తరిమెల గ్రామవాసి విద్వాన్ విశ్వంగారు. ఆయన '*మన ఆకలి / ఇదిపోయే మార్గం ఎట్లా? / ఇదెందుకు వచ్చింది?"* అని ప్రశ్నించమంటారు.

సామ్రాజ్య యుద్ధనీతిలోని అవినీతిని, కుయుక్తిని, వినాశకరత్వాన్ని కొద్దిపదాలలో కొండంత అర్థం యిమిడ్చి 'పిచ్చివాడి ప్రశ్న' 1940లో రాసినారు. తరిమెల నాగిరెడ్డి గారు గమనించండి – 'ఒక పిచ్చివెధవ ఒకరోడ్డుపక్కన నిల్చున్నాడొకరోజు. ఒక గొప్పసైన్యము "కవాతు" చేస్తోంది రోడ్డుమీద. "ఎక్కడ నుంచి వస్తున్నారు నాయనా వీళ్ళందరు? అని పక్కనున్న వాణ్ణి అడిగాడు. 'శాంతినగరు నుండి' అన్న సమాధానం వచ్చింది. "ఎక్కడికెడుతున్నారు?" "యుద్ధానికి" "యుద్ధంలో ఏం చేస్తారు?" "శత్రువులను చంపి వాళ్ళ పట్టణాలను నాశనం చేస్తారు." "ఎందుకు?" "శాంతిని స్థాపించేందుకు." "పిచ్చివాడన్నాడు కదా! 'నాకర్థం కాలేదిదంతా. శాంతినుండి వచ్చి యుద్ధం చేయడం ఎందుకు? శాంతి స్థాపించేందుకట! అసలు శాంతినగరంలోనే వుండివుంటే?' ఈ పిచ్చివాడి చొప్పదంటు ప్రశ్నకు సమాధానం వెతుకుతున్నారందరూ."

వస్తుప్రాధాన్యత తప్ప శిల్ప ఆకర్షణ వుండదు. గాఢమైన భావజాల చింతనలు వుండవు గానీ అనంతకవి సామాన్య జన పక్షపాతి. పదిమంది తపనను మరో పదింతల మందికి తెలియజేయాలనే తపన తప్ప పేరు ప్రతిష్ఠలు పొందాలనే యావలేదు. సామ్రాజ్యవాదులను వెళ్ళగొట్టడమే స్వాతంత్ర్యం కాదనీ, దేశీయంగా వుండే భూస్వామికపీడ, మత సాంఘిక కట్టుబాట్ల పీడ వదలించుకోవడం, ప్రతి ఒక్కరూ జీవనోపాధి పొంది జీవితావసరాలు సమకూర్చుకోగలిగి యుండటమే నిజమైన స్వాతంత్ర్యం అని గుర్తించినవాడు అనంతకవి. దాదాపు ఎనభైయేండ్లకిందట అనంత కవి లేవనెత్తిన సమస్యలు – మాయమాటలతో ఓటరును ప్రలోభపెట్టే రాజకీయాలు, కరువు, ఆకలి, అస్పృశ్యత, నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కారం కాకపోగా పరిస్థితి మరింత బాధాకరంగా వుండటం విషాదకరం.

## ప్రేమ ప్రతీకలు...

అనవరత దయావర్ష కరుణా ప్రకర్షా
నాకు విశదమౌతోంది.
ఈ ఆకులపై పసిడి మెరుపుల లయ విన్యాసాలు,
ఆకాశంపై మందగమనం చేస్తున్న మేఘ మాలికలు,
నా నుదిటిపై శీతల స్పర్శానందాన్నిచ్చి చనే వాయు వీచికలు,
ఇవన్నీ నీ ప్రేమ ప్రతీకలే తప్ప అన్యములుకావని,
ఉదయపు పసిడి వెలుగు నా నేత్రాలనిండి పొర్లుతుంది.
ఇదే నా హృదయానికి నీ విచ్చే మేలుకొలుపు సందేశం.
ఊర్ధ్వలోకాలనుంచి నీ కళ్ళు నా కళ్ళలోకి చూస్తున్నాయి.
నా హృదయం మాత్రం నీ చరణ కమలాలను
స్పృశిస్తూ మోకరిల్లింది.


గీతాంజలి 59 : అనువాదం, చిత్రం : జింకా రామారావు



ప్రశ్నే నా జీవితం

# తిరుగుబాటే నాబాట

- వాసిరెడ్డి సీతాదేవి

**వా**సిరెడ్డి సీతాదేవి నలభైకి పైగా నవలలు వ్రాశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారం అయిదు సార్లు అందుకున్నారు. 1999లో రాష్ట్ర ప్రభుత్వం 'ఆత్మగౌరవ పురస్కారం'తో సమ్మానించింది. 'మట్టి మనిషి' నవలను నేషనల్ బుక్ ట్రస్ట్‌వారు 14 భారతీయ భాషల్లోకి అనువదించారు. తరువాత దశాబ్దం తర్వాత సీతాదేవి ప్రచురించిన 'మరీచిక' నవల ప్రభుత్వ నిషేధానికి గురయింది. న్యాయస్థానం తీర్పు మేరకు నిషేధం రద్దయింది.

**గుం**టూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో ఒక మధ్యతరగతి వ్యావసాయిక కుటుంబంలో పుట్టాను. ఆడపిల్లల్ని చదివించే కాలం కాదు. ఐదో తరగతి వరకే చదివాను. ఆడపిల్లలంతా బొమ్మలాటలాడుకునేవాళ్లు. ఎక్కువగా అమ్మా, నాన్న ఆటలాడేవాళ్లు. నన్ను అమ్మగా ఉండమంటే ఒప్పుకునేదాన్ని కాను. నాన్నగా అయితేనే ఉంటాననేదాన్ని. మగపిల్లలు బచ్చాలాటలు, బిళ్లంగోడు, కొతికొమ్మచ్చు లాడేవాళ్లు. అక్కడికిపోయి ఆడేదాన్ని. ఎందుకూ? వీళ్లు ఒప్పుకొనేవాళ్లు కాదు గనక. పొద్దున్నే లేచి ఆటలకు పోయేదాన్ని. మా మామయ్య తెనాలిలో ఉండేవాడు. ఒకసారి వచ్చి చూసి మొట్టికాయవేసి 'ఆడముండవు, మొగపిల్లలతో బచ్చాలాడుతున్నావేమిటి?' అని చివాట్లు పెట్టాడు. అయితే ఒక్క విషయం చెప్పాలి. గొప్ప విషయం. మా అమ్మ మాత్రం నన్నెపుడూ వెనకేసుకొని వచ్చేది. ఎప్పుడూ ఆడా మగా తేడా చూపించలేదు. 'ఏమయిందిరా? ఏమిటి? మొగపిల్లల్తో ఆడుకుంటే తప్పేమిటి?' అనేది. ఆయన తిట్టి నోరు మూయించేవాడు. ఏం చేద్దామనుకుంటున్నావు. ఆడపిల్ల ఇలా బరితెగించిపోతే ఎలాగ? అని. చదువు కోవడానికి అవకాశం లేకపోయినప్పటికి గూడా ఈ వ్యత్యాసాలు చూస్తున్నప్పుడు నాలో ఏవేవో నాకు తెలియని తిరుగుబాటు భావాలు కలిగేవి. ఈ సమాజం మీద తిరగబడాలి. దీని మీద తిరగబడాలి. దాని మీద తిరగబడాలి ఇలా. జీవితమంటే కేవలం ఇదేనా. 12, 13 ఏళ్ళు వచ్చేటప్పటికి చాలా విషయాలమీద సందేహాలేర్పడ్డాయి. బంధువుల్లో చావులు వగయిరా, భయం వేసేది. రాత్రి పడుకొని ఆలోచించేటప్పుడు భయంతో వులిక్కిపడే దాన్ని. మా అమ్మ లేపి కూర్చోపెట్టి భయం పోగొట్టేది. ఎట్లా బతుకుతుందో పిచ్చిది అనేది. ఏం చేయాలో తోచదు. ఎట్లాగో వుండేది. రకరకాల విషయాలు చెప్పుకుంటూ ఉండేవాళ్లు. డబ్బు పోతుందని చెప్పి ఎవరికో ముసలివాళ్ళకిచ్చి పెళ్ళి చేయడం వంటివి.

ఎవరు చెప్పినా పల్లెటూళ్లో జీవితం ఒక్కటేననిపించేది. కేవలం పెళ్లిళ్లు చేసుకోవడం, పిల్లల్ని కనడం, ఆ పిల్లలకు పిల్లలు, ఆ పిల్లలకు పిల్లలు అలా అలా. ఇంతేనా బతుకు నాకు తెలిసిన అందరిదీ ఇదే జీవితం. ఏమీ తేడా లేదు. నాకూ, వీళ్ళకీ ఏమీ తేడా లేదా ఇలాగే బ్రతకాల్సిందేనా? ఇంకో జీవితాన్ని వెతుక్కోకూడదా? నా మీద వ్యక్తుల ప్రభావం

డా. వాసిరెడ్డి సీతాదేవి (1932 - 2007)

గాని, సంఘటనల ప్రభావం ఏమైనా ఉందా అంటే పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు. సాహిత్యపరంగా చూస్తే ప్రేమ్‌చంద్ ప్రభావం కొంత వుండవచ్చు. వ్యక్తులుగా నన్నెవరూ ప్రభావితం చేయలేదు. ఏమీ చెప్పుకోదగ్గ ప్రభావాలు లేవనే నేనంటాను. ఒక్క ప్రభావం మాత్రం ఉంది. జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. మా చేబ్రోలులో టూరింగ్ టాకీసులో యోగి వేమన చిత్రం చూశాను. చిత్రం చూసిన తర్వాత దాదాపు 20 రోజుల పాటు నేనెలా ఉన్నానో. నేను నేను కాదు. ఏదో అయిపోయానని డాక్టరు దగ్గరికే తీసుకుపోయారు. ఆ చిత్రంలో ఒక సంఘటన ఉంది. వేమన సన్యాసి కదా. ఆయన సన్యసించకముందే ఆ ఊళ్ళో ఎవరో ఒకరు చనిపోతారు. వేమన శ్మశానంలో ఒక పుర్రె తీసుకొని ఇదే నా జీవిత సారం అని ఒక పాట పాడతాడు. అప్పటికే జీవితం, చావు, అది చేయాలి, ఇది చేయాలి అని పిచ్చి పిచ్చి ఆలోచనలొస్తున్నాయి నాకు. 'ఇదేనా జీవిత సారం' అనే ఈ పాట నన్ను ఆలోచింపజేసింది. ఆ వేమన, ఆ శ్మశానం, ఆ పాట ఇది శాశ్వతంగా నా మీద ఒక ముద్ర వేసింది.

జీవితమంటే తెలుసుకోవాలి. ఎలా? ఎవరో పెద్దల్ని అడగాలి. సన్యాసుల్నో, పెద్ద మనుషుల్నో, అడిగితే తెలుస్తుందా. ఏమో. పెద్ద పెద్ద వేదాంతులు కూడా చివరికి ఏం తెలుసుకున్నారో. ఏదో తెలుసుకోవాలి. నిరంతర అన్వేషణ. ఇప్పటిదాకా ఈ అన్వేషణలో ఏమన్నా తెలుసుకున్నానా అంటే ఏమీ తెలుసుకోలేకపోయాననే అనుకుంటున్నా. ఏమీ తెలుసుకోలేదనే, అంధకారంలోనే వున్నాననే అనుకుంటున్నాను.

ఇకపోతే ఆ ప్రశ్నలోనుంచే నా జీవితం ప్రారంభమైంది. నలుగురు నడిచిన బాటలో నడవకూడదు. ప్రవాహానికి అనుకూలంగా అందరూ ఈదుతారు. నేను మాత్రం ప్రవాహానికి ఎదురుగా ఈదాలనుకున్నాను. చాలామందికి ఆశ్చర్యంగా ఉంటుంది. పెళ్ళి చేసుకోకుండా ఉండడం. ఇక్కడ మేధావులంతా ఉన్నారు. నా అనుభవమేమిటంటే ఒక ఆడపిల్లగాని, మగపిల్లవాడు గాని, పాతికేళ్ళు వచ్చేదాకా పెళ్ళి గురించి గాని, ఆడా మగా గురించి కాని, సెక్సు గురించి కాని ఆలోచించకుండా మరో ఆలోచనల్లో జీవిస్తూ, ఒంటరితనాన్ని మరచిపోయి ఏదో ఒక పని చేస్తూ, నిమగ్నమై ఉంటూ ఉంటే, పెళ్లికి సంబంధించిన భావాలు రావు. అలా రాకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. కాకపోతే నలుగురూ ఏదో ఒకటి అనుకుంటూంటారు. అనుకుంటే అనుకోనివ్వండి. నేను నవ్వుకుంటాను. నా మార్గంలో నేను నడుస్తాను. అందరూ నడిచే మార్గంలో నడవను.

ఏమీ చదువుకోకుండా అయిదో తరగతి మాత్రమే చదువుకొని, కొంచెం హిందీ నేర్చుకొని, డిక్షనరీ పెట్టుకొని చదివి, విశారద పరీక్ష రాసి – మా వూళ్లో హిందీ టీచరు హొకాయన సహాయం చేశాడు. మద్రాసు వెళ్ళిపోవడం. మద్రాసులో 35 రూ. జీతానికి ఉద్యోగంలో చేరిపోయాను. మా ఇంటిపేరు వాసిరెడ్డి. వాసిరెడ్డి అని వినగానే చాలా ధనవంతులమని అనుకుంటారు. ఒకప్పుడు ధనవంతులమే. కాని మావరకు వచ్చేటప్పటికి అంతా పోయింది. పేదవాళ్ళమయ్యాం. పేదవాళ్లమని చెప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడాల్సిన అవసరం లేదు. బీదతనం పాపమేమీ కాదు. అప్పటికి నాలుగైదెకరాలుండేదేమో. మద్రాసులో మార్వాడీ స్కూల్లో ఉద్యోగం ఇచ్చినాయన 35 రూ॥ల ఉద్యోగం ఇచ్చినందుకు మీ వాళ్లు నన్ను తంతారేమో అని ఉత్తరం రాశారు. పర్వాలేదు లెండి అని అప్పుడు నేను మద్రాసు చేరాను. అంతవరకూ మా పల్లెటూరు తప్ప దగ్గర్లో ఉన్న గుంటూరు, విజయవాడ కూడ చూడలేదు నేను. మద్రాసు సెంట్రల్ స్టేషన్లో దిగాను. పదిహేడో ఏడు నడుస్తోందప్పుడు నాకు. చాలా సన్నగా, బక్కగా ఉండేదాన్ని. పన్నెండో, పదమూడో అన్నట్లుగా కనిపించేదాన్ని. సెంట్రల్ స్టేషన్‌లో అంత పెద్ద స్టేషన్ చూడగానే ఒక్కసారిగా ఏదో కొత్త ప్రపంచం చూసినట్లుగా అయిపోయింది నాకు. ఒక భయం, దుఃఖం కూడా వచ్చేసింది. స్టేషనే ఇట్లా ఉంటే ఊరు ఎంత పెద్దగా ఉంటుందో, ఈ ఊళ్లో మనుషులెలా ఉంటారో, సూట్లు వేసుకునేవాళ్ళు, లుంగీలు కట్టుకున్నవాళ్లు. ఇలా అక్కడే ఏడ్చేశాను కూడా.

ఇక స్కూలుకు వెళ్ళాను. మార్వాడీ పాఠశాల. ఆ స్కూలు పేరేమిటంటే 'సనాతన ధర్మ కన్యా పాఠశాల.' నా కెప్పుడూ కూడా ఎవరూ నాస్తికత్వం బోధించలేదు, హేతువాదం బోధించలేదు. కాని మొదటినుంచీ మా యింట్లో మా అమ్మ కూడా దేవుణ్ణి గురించి చెప్పలేదు. ఎప్పుడూ మొక్కలేదు. ఎందుకంటే ఈ ప్రశ్నలే నన్నడుగుతున్నాయి. ఏమిటి ఇదంతా. ఇలా ఎందుకుంది వగయిరా. సరే ఈ సనాతన ధర్మ కన్యా పాఠశాలకు వెళ్ళాను. ఒక టీచరు, ప్రిన్సిపాల్ దగ్గరికి తీసికెళ్ళారు. ఆయన నన్ను చూసి నవ్వారు. నువ్వు ఇక్కడ

ఎక్కువ రోజులు ఉండవు. నీకు ఉద్యోగం ఇవ్వనన్నాడు. బయటికి వచ్చాను. ఏడ్చేశాను. ఏం చేయాలి. నిశ్చయం చేసుకొని వచ్చాను. మళ్లీ ఎక్కడికి వెళ్లను. ఆ బంధాలన్నీ తెంచుకొని వచ్చేశా. ఎక్కడికి వెళ్లేది. మళ్లీ ఆ టీచరు ఓదార్చి కమిటీ ఛైర్మన్ జగన్నాథ శర్మగారని ఆయన దగ్గరికి తీసుకెళ్లారు. ఆయన ఉద్యోగం ఇచ్చాడు. తర్వాత ఉద్యోగాలు మారుతూ, మారుతూ హిందీ ప్రచార సభలో ఆ వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగం కోసం వెళ్ళాను. తర్వాత హిందీ ప్రచార సభలో ఆ వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగం పోయింది. అది ఎలా పోయిందో నా సాహిత్యం గురించి చెప్పేటప్పుడు చెప్తాను.



చాలా మంది మహానుభావులు గొప్ప గొప్ప వాళ్ళతో పరిచయాలు ఏర్పడ్డాయి. వారి నుంచి జీవితంలో ఎంతో నేర్చుకున్నాను. 1958లో అనుకుంటాను హైదరాబాదు వచ్చినపుడు ఓల్డ్ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో నారాయణరెడ్డి గారిని కలుసుకున్నాను. అంతకుముందు మద్రాసులో దాశరథి, నారాయణరెడ్డి గార్లను చూశాను. వాళ్ళు వచ్చినప్పుడు అక్కడ అందర్నీ పిలిచి ఏదో పార్టీ పెట్టారు. ఇటువంటివి జరిగినప్పుడు ఫోన్ చేసి చెప్పేవాళ్లు. నేను పైకి వస్తానని నారాయణ రెడ్డికి నమ్మకం. తరువాత 58లో నారాయణరెడ్డి గారితో పరిచయం ఏర్పడింది. దాదాపు ముప్పై ఏళ్లుకు పైగా పరిచయం. నా పుస్తకానికి పరిచయం కూడా రాశారు. అలా గొప్ప వాళ్ళనుంచి చాలా నేర్చుకున్నాను.



**దాశరథి**

గవర్నమెంటు ఉద్యోగంలో చేరాను. నాకు వేరే జీవితం లేదు. నా ఉద్యోగమే నా జీవితం. నా సాహిత్యమే నా జీవితం. నేను ఇంతకుముందే చెప్పినట్లు నాజీవితం ప్రశ్నలతోనే మొదలైంది. వాటికి సమాధానం వెతుక్కొనే ప్రయత్నం చేశాను. సమాధానం వెతుక్కుంటూనే ఇంతదూరం వచ్చాను. సమాధానం దొరకలేదు. ఆ ప్రయత్నంలో నుంచే ఒక ఆర్తి. ఏదో చెప్పాలనే ఒక తపన నా చేత సాహిత్యం రాయించింది.

నేను మద్రాసులో ఉన్నప్పుడే ఒకసారి జబ్బు చేసింది. టైఫాయిడ్ అనుకున్నాను. నారాయణరావుగారనే డాక్టరు దగ్గరికి వెళితే టైఫాయిడ్ కాదు మలేరియా అన్నాడు. మందులిచ్చారు. నాకు మాత్రం టైఫాయిడ్ అనే. టైఫాయిడ్ వచ్చింది. ఇక చచ్చిపోతాను అనుకున్నాను. కాగితం కలం తీసుకున్నాను. ఏవో ఆలోచనలు ఇక నేను చచ్చిపోతాను. నేను ఉండను. అదృశ్యమైపోతాను. కాని ఈ కాగితం వుంటుంది. నేను కూర్చున్న ఈ కుర్చీ వుంటుంది. ఈ మంచం వుంటుంది. నేను తప్ప అన్నీ వుంటాయి. అందరూ వుంటారు. నేను రాసిన ఈ కాగితం వుంటుంది. చచ్చిపోయిం తర్వాత ఏమవుతుంది? ఆత్మ అనేది వుందా? చచ్చిపోయిన తర్వాత ఆత్మ అనేది ఉంటే అదేమవుతుంది? మనిషి తనులేని ఈ ప్రపంచాన్ని ఊహించుకోలేడు. అందరూ ఉంటారు. అన్నీ ఉంటాయి. నేను ఉండను అనే భావం మనిషిని ఎక్కువ భయపెడుతుందనుకుంటాను. ఆ విధంగా నేను ఉండను అనే భావం కూడా నన్ను భయపెట్టింది. అందువల్ల నేను అన్నది భౌతికంగా లేకపోయినా కూడా ఏదో రూపంలో వుంటాను అనుకొని మానవుడు కల్పించుకున్న భావనే ఈ ఆత్మ అని నేననుకుంటాను. అప్పుడు ఈ పదిహేడేళ్ళ వయస్సులోనే ఆలోచన వచ్చి జీవితమంటే ఏదో రాద్దామనుకున్నాను. జీవితమంటే ఒక్కొక్కళ్లు, వాళ్ల వాళ్ల అనుభవాన్ని బట్టి అర్థం చేసుకుంటారు. ఈ స్థితిలో ఏదో రాశాను.

అప్పటికి రెండు మూడు నెలల క్రితం కిన్నెర పత్రిక ఎడిటర్ వెంకటాద్రిగారని ఉండేవారు. వారింటికి గొప్ప గొప్ప కవులు, రచయితలంతా వచ్చేవాళ్లు. అది ఒక సరస్వతీ నిలయంగా ఉండేది. రచయితలతో నాకు పరిచయం అక్కడే. ఆయన నన్ను చూడడానికి వచ్చి ఆ కాగితాలన్నీ చూసి ఆశ్చర్యపోయాడు. అది ప్రచురించారు. తరవాత రెండు మూడు సంవత్సరాలు ఏమీ రాయలేదు. నేనింత దూరం ఒంటరిగా ప్రయాణం చేయగలగడానికి కారణం ఆత్మవిశ్వాసం. భయం లేకపోవడం. నిజం చెప్పడానికి భయపడకపోవడం.

నా రెండో కథ 'సాంబయ్య పెళ్లి'. మొదటి కథ హిందీ ప్రచారసభ ఆఫీసులో కూర్చొని ఏదో రాశాను. అది కథ అవునో, కాదో చెప్పేవాళ్లు కూడా లేరప్పుడు. సరే, 'సాంబయ్య పెళ్లి' రాశాను. పోస్టు చేశాను. మూడో వారానికల్లా ప్రభలో పెద్ద అక్షరాల్లో అచ్చయి వచ్చింది. ఆ కథకు స్ఫూర్తి మా వూళ్లో సాంబయ్య అనే వ్యక్తి ఉండేవాడు. చాలా వికారంగా ఉండేవాడు, పిచ్చివాడు కూడాను. అటువంటి వాణ్ణి తీసుకొని

కథ రాస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. అతన్ని స్ఫూర్తిగా తీసుకొని సాంబయ్య పెళ్ళి అన్న కథ రాశాను. తర్వాత రాయడం కొనసాగించాను.

నా మూడో కథ 'బావ' అన్న కథ. మా స్కూల్లో ఈశ్వరి అని ఒక అమ్మాయి ఉండేది. చాలా అందంగా ఉండేది. వైభవంగా ఉండేది. తోటి టీచర్లంతా ఈశ్వరి, ఈశ్వరి అంటూ ఇష్టంగా పిలుస్తూండేవాళ్లు. ఆమె భర్త హఠాత్తుగా చచ్చిపోయాడు. అప్పటిదాకా బాగా ఉన్నవారనుకునేవాళ్లు. భర్త చచ్చిపోయేసరికి ఏమీలేదని తెలిసింది. ఆ భర్తకు చీట్లపేక అలావాటుండేది. అంతా అందులో పోగొట్టుకున్నారు. ఆమె తండ్రి ఇంటికి బెంగుళూరు వెళ్ళిపోయింది. అక్కడ మళ్ళీ పెళ్లి చేసుకోమని బలవంతం చేశారు. నా దగ్గరకి పారిపోయి వచ్చి కొన్నాళ్లు ఆశ్రయం పొందింది. తర్వాత ఏమనుకుందో వెళ్లిపోయింది. అప్పుడు ఆ అమ్మాయి కథనే 'బావ' అన్న కథగా రాశాను. బహుశా అప్పుడు రాసేవాళ్లు తక్కువగా ఉన్నారేమో వెంటనే అచ్చయ్యేవి. అట్లా నాలుగైదు కథలు రాశాను.

మా హాస్టల్లో పద్మ అని ఒకమ్మాయి ఉండేది. ఆ అమ్మాయికి క్లెప్టోమేనియా అనే జబ్బు ఉండేది. మాకు తెలియదు. ఒకసారి మూర్ఛవచ్చి పడిపోతే భయపడి డాక్టరు దగ్గరికి తీసికెళ్ళాం. డాక్టరు ఏమీ భయం లేదని చెప్పి, మామూలు మూర్ఛల జబ్బని చెప్పారు. 'శ్రీనాథరావుతో పరిచయం' అని ఒక కథ రాశాను. అది చాలా మంచి కథ అని ఇంగ్లీషు పత్రికలో వచ్చింది. అప్పుడప్పుడూ ఎవరో ఒకరు వచ్చి పరిచయం చేసుకుంటూ ఉండేవారు. అలాగే అప్పుడు హనుమంతరెడ్డి అని ఒక కాలేజీ స్టూడెంటు వచ్చి కలిశాడు. వాళ్ళ కాలేజీకి ఆహ్వానించాడు. నేను, పద్మ వెళ్ళాం.

అతని విషయం ఆ కాలేజీ స్టూడెంట్లెవరో నాకు చెప్పారు. అప్పుడు 'శ్రీనాథ్‌రావుతో పరిచయం' అనే కథను రాసి, పత్రికకి పంపించాను. మూడు వారాల్లో అచ్చయి వచ్చింది. ఆ హనుమంతరెడ్డి మళ్లీ వచ్చాడు. 'నా మీద కథ రాశావు చూడు ఏం చేస్తానో. నువ్వు హాస్టల్ నుంచి బయటికి ఎట్లా వస్తావో చూస్తాను. కొడతాను' అదీ, ఇదీ అని గొడవ చేశాడు. అతనేమో పరీక్ష పాసయ్యాట్ట. స్టూడెంట్లంతా కాపీకొట్టి పాసయ్యావన్నారట. నేనన్నాను 'నీ గురించి నాకు తెలిసింది ఒకే విషయం. మరి కథలోనివన్నీ నిజమేనా మరి. స్టూడెంట్లు అట్లా అనుకుంటున్నారంటే అవి నిజమే అయ్యుండాలి. ఆ లక్షణాలన్నీ నీలో ఉన్నాయన్న మాట.'

రచయిత నిజంగా రాయదలచుకుంటే ఒకచిన్న విషయం చాలు. రచయిత సైకాలజిస్టు అయి ఉండాలి. ఒక పాయింటు, ఒక మాట, ఒక అలవాటు. ఒక సంఘటన చాలు ఒక వ్యక్తి స్వరూప స్వభావాలను మాటతీరును అంచనా వేయడానికి, అర్థం చేసుకోవడానికి.

'రత్తమ్మ కష్టాలు' అని రాశాను. ఆ రోజుల్లో హిందీ ప్రచారసభ సెక్రటరీని మంత్రి అనేవాళ్లు. ప్రధాన కార్యదర్శి అయితే ప్రధానమంత్రి, విద్యాకార్యదర్శి అయితే విద్యామంత్రి, పరీక్షా కార్యదర్శి పరీక్షామంత్రి. ప్రధానమంత్రి గారికి ఒక భార్య ఉండేది. ఆమె కొంచెం గయ్యాళి. ఏ పని కావాలన్నా మనం ఆమె చుట్టూ తిరిగి సంతోషపెడితే తప్ప పనులు కావు. మా పరీక్షా మంత్రి అప్పుడప్పుడూ అంటూ ఉండేవాడు ఆమెను చూశావా అని. నా కంత ఆసక్తి లేదు. కాని ఎవరితోనో ఒకరితో కలిసి రెండు మూడు సార్లు ఆమెను చూడవలసి వచ్చింది. చూసిం తర్వాత ఆమెమీద కథ రాయాలనిపించింది. కథ రాయాలంటే ఏదో ఒక పాత్రను ఎంచుకోవాలి కదా. పాపం నిజానికి ఆమె కేమీ కష్టాలు లేవు. కాని కొనితెచ్చుకున్న కష్టాలు. తనకు లేని కష్టాలను ఊహించుకొని ఇతరులను కష్టపెట్టే స్వభావం ఇటువంటి పాత్ర తీసుకొని కథ రాశాను.

'శ్రీనాథరావుతో పరిచయం' కథ రాసినప్పుడే నాకు తెలిసింది. మనం కథ రాసినప్పుడు ఏదైనా వ్యక్తి లోపాన్నెత్తి చూపినప్పుడు అది సమాజంలో అటువంటి స్వభావం కలిగిన వ్యక్తుల్ని ఏ విధంగా ఉడుక్కునేలాగ చేస్తుందో, ఏ విధంగా ఆలోచింప చేస్తుందోనని. నిజంగా సాహిత్యానికి ఎంతో ప్రభావం ఉంది. బలం ఉంది.

నాటకాలంటే నాకు ఇష్టం. నాటకాలు చూస్తూండేదాన్ని. ఒకసారి ఒక నాటకంలో వేషం కూడా వేశాను. రచయిత్రిగా పేరు వచ్చిన తర్వాత ఈ నాటకాలేమిటి? కథలన్నా రాయి, నాటకాలన్నా వేసుకో అన్నాడు మా బ్రదర్. వాళ్ళకు ఈ నాటకాలంత ఇష్టంగా ఉండేవి కావు – ముఖ్యంగా స్త్రీలు నాటకాల్లో పడడం. ఒక నాటకం డైరెక్టు చేశాను. మొట్ట మొదట నూతన్‌ప్రసాద్‌ను



నూతన్‌ప్రసాద్

నాటకాల్లోకి తీసుకొచ్చింది నేనే. నూతనప్రసాద్, ఈశ్వరరావు, గోపిని రామారావు మొదలైనవాళ్లు నటించారు. నా నాటకానికి బ్రహ్మానంద రెడ్డిగారు వచ్చారు. మెచ్చుకున్నారు. ఇట్లా నాటకాలలో పడి కొన్నాళ్లు రచనలు చేయలేదు.



బ్రహ్మానందరెడ్డి

అసలు రాసింది చాలదా? ఎందుకు రాయాలి? రచనలతో ప్రయోజనం ఏమిటి? వీటితో ఏమైనా మార్పు తేగలమా? ఇలాంటి ఆలోచనలూ వస్తూండేవి.

గోపీచంద్ లాంటి వారు అడిగేవాళ్లు. ఏమమ్మా మంచి కథలు రాస్తావు అనుకుంటూండేవాళ్లం. ఇక్కడికి వచ్చి రాయటం మాని వేశావేమిటి? రచయిత్రిగా చచ్చిపోయినట్లేనా అని. కథలు చదువుతూ ఉండేదాన్ని. ఉద్యోగం, కొత్తగా వచ్చి ఈ హైదరాబాదులో ఇంతమంది రచయితలు రాస్తున్నారుగా అని.



గోపీచంద్

సరే, నా మొదటి నవల 'వైతరణి' అంటున్నారు చాలామంది. కాని కాదు. అడవిమల్లె. ఒకసారి గోపాల శాస్త్రిగారు ఫోన్ చేశారు. ఆఫీసుకు వచ్చి కలవమన్నారు. వెళ్ళాను. అమ్మా మా డైరెక్టరు మిమ్మల్ని కలవాలన్నారు, రండి అని సిన్హాగారి దగ్గరకు తీసుకువెళ్ళారు. మీరు మాకో నవల రాయాలి. ఆంధ్రప్రదేశ్‌లో సీరియల్‌గా ప్రచురిస్తాం అన్నాడు. అప్పటికి నేను కథలే తప్ప నవల రాయలేదు. సీరియల్స్ చదువుతూ ఉన్నాను. రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి ఉధృతంగా రాస్తున్న రోజులు. నేను రాయగలనా అన్నాను. గోపాలశాస్త్రిగారు మీ పేరు చెప్పారు, ఆమె రాస్తుందో లేదో, రాస్తే మాత్రం బాగా రాస్తుంది అని చెప్పారు. మీరు రాయాలి అన్నారు. అడ్వర్టయిజ్ చేస్తాం అన్నారు. చేశారు. అట్లా రాయవలసి వచ్చింది 'అడవిమల్లె.'

నాతో అన్నవాళ్లు కూడా ఉన్నారు. ఇట్లా మా గురించి బట్టబయలు చేయడం బాగుందా అని. నేను చెప్పాను. ఒక కథ రాసినప్పుడు ఒక వ్యక్తిని తీసుకోవలసి వస్తుంది. కథలో ఉన్న వ్యక్తి ఒక వ్యక్తి కాదు. నలుగురైదుగురు వ్యక్తుల సమాహారం. నలుగురైదుగిరి గుణగణాలు, స్వభావాలు ఒక వ్యక్తిలో చూపిస్తాం. ఆ వ్యక్తి మీరే అనుకోవద్దు అని. ఆమె ఆఫీసులో సెక్రటరీలు, డైరెక్టర్లు ఫైళ్లు పట్టుకొని నిలబడే వాళ్లు. వాళ్లలో నేనూ ఉన్నాననుకోండి. ఆమె నా గుండెల్లో కూర్చొని నా కథరాయి, నా కథ రాయి అని బలవంతం చేసినట్లనిపించేది. ఆమె మాత్రం నాకు నిద్ర పట్టకుండా చేసింది. అదొక్కటి మాత్రమే నేను డైరెక్టుగా పూర్తిగా రాసిన నవల. 1967, 68లో విశాలాంధ్రలో వచ్చింది. అది విశాలాంధ్రలో వస్తున్న కాలంలో ఒంగోలు, గుంటూరులలో కమ్యూనిస్టులంతా ఒక మీటింగు పెట్టి విమర్శించారు. అసలు మన విశాలాంధ్రలో ఈ నవల ప్రచురించడమేమిటి? ఈ నవల చదివిన వాళ్ళెవరైనా మనవెంట వస్తారా? అని గొడవ పెట్టారు. అప్పుడు రామచంద్రారెడ్డి గారనే వారొకరు, మరొకరు డిఫర్ అయ్యారు. 'లేదండి. ఆమె కమ్యూనిస్టు పార్టీని కించపరుస్తూ రాయడం లేదు. ఆమె మార్క్సిస్టు. మార్క్సిస్టు ఐడియాలజీ ఉన్నామె. ముందు చదవండి' అని అన్నారు. ఆ నవల వచ్చిం తర్వాత అప్పుడు చాలామంది పిల్లలకు 'సమత' అని పేరు పెట్టుకున్నారు. ఇప్పుడు నలభై ఏళ్ళ వాళ్లు చాలామంది 'మీ నవల పేరు మాకు పెట్టారండి' అని చెప్పుకుంటూంటారు నన్ను కలిసినప్పుడు.

తర్వాత వైతరణి రాశాను. మన ఇళ్లలో ఉండే సంగతే. తల్లీ దండ్రీ బాగానే ఉంటారు. కొడుకులు పెద్దయిం తర్వాత కోడళ్లు వచ్చిం తర్వాత మారుతుంది. ఏదో ఒకసారి కట్నం ఇచ్చి పంపేసినందువల్ల, ఆస్తిలో భాగం లేనందువల్ల ఆ కట్నం పోతేనో, ఆ రక్షణ లేకపోతేనో ఆ స్త్రీ ఎలా బాధపడుతుంది? అన్నదమ్ములు ఇంటికి వచ్చి ఎలా కష్టపడుతుంది? ఇదంతా ఆలోచించి రాసిన నవల. ఆడపిల్లలకు ఆస్తిలో హక్కు వుండాలి అని నిర్ధారించి రాశాను. డా॥ రంగాచార్యలాంటి వాళ్లు మరీచి కంటే కూడా ఇదే గొప్ప నవల అంటూంటారు.

మరీచిక కూడా ఇలాగే. ఈ కథ మీకందరికీ తెలుసు. యువతరం కథ. నిషేధించారు. ఆ విషయాలన్నీ మీకు తెలుసు. ఇక రాబందులు - రామచిలుకలు నవల కథ. దీన్ని గురించి కొంత చెప్పాలి. నేను ఎలాగ ఇన్‌స్పైర్ అయి కథలు, నవలలు రాశానో చెప్తున్నాను. నేను పంచాయతీ రాజ్ సెటప్ చూస్తూండేదాన్ని. నేనొక ఆఫీసర్ని. చాలామంది నాకింద పనిచేసేవాళ్లు. పంచాయతీ ప్రెసిడెంట్లు పోరాడి ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ అని పేరు మార్పించాను. ఉమన్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ అని డిజిగ్నేషన్ మార్పించాను. అప్పుడు అక్కడి మహిళా సంఘాలు, వాటి గురించి రాశాను. మహిళా

సంఘాలని ఉన్నప్పటికీ కూడా వాటి వెనక మగవాళ్లే ఉంటారు. ఆడవాళ్ళని ముందు పెట్టుకొని మగవాళ్లు రాజ్యం చేస్తున్నారని చెప్పడానికి ఈ నవలలో ప్రయత్నించాను. ఆ ముఖ్య సేవికలంతా ఎలా బాధపడుతున్నారో, ఆ వీడీవోలెలా బాధపడుతున్నారు అని చెప్పి రాసిన దానిమీద చాలా చర్చ నడిచింది. అది సీరియల్‌గా వస్తున్నప్పుడు ఒకసారి నేను సంగారెడ్డి వెళ్ళాను. అక్కడ రామిరెడ్డి అనే ఆయన కలిశాడు. అమ్మా మీరు మా యింటికి డిన్నరుకు రావాలి అని పిలిచాడు. ఎవరీయన అని అడిగితే అక్కడి బీడీఓ ఆయన పంచాయతీ ప్రెసిడెంటు అని చెప్పారు. వెళ్ళాను. వెళ్ళిం తర్వాత ఏంటండీ మీ రాజకీయాలేమిటి? సంగతులేమిటి? మీరేనా రాజ్యం చేస్తుంది అని అడిగాను. అమ్మా రిజైన్ చేసేశానన్నాడు. అదేమిటి మీరు రిజైన్ ఎందుకు చేశారు అన్నాను. అమ్మా మీరే నాతో రిజైన్ చేయించారన్నాడు. అదేమిటన్నాను. 'మమ్మల్ని రాబందుల్ని చేసి రాస్తున్నారు కదమ్మా మీరు? అందుకని. అప్పటికాయనకు రాజకీయాలు తెలియవు. ఏమైనా చేసి ఎవరి నెత్తినైనా చెయ్యో, కాలో పెట్టి పైకి పోవడం తెలియదు. పంచాయతీ ప్రెసిడెంటంటే ఇలా రాబందుల్లాగా పచ్చిమాంసం పీక్కుతింటున్నామా? అట్లా ప్రవర్తిస్తున్నామా? చాలా అనుభవంతో రాస్తున్నారు అని చాలా బాధపడిపోయి రాజీనామా ఇచ్చేశాడు. తర్వాత ఏం చేస్తున్నారంటే ఏదో లాయరుగా ప్రాక్టీసుచేస్తున్నారట. ఎవర్నో ఆయన ఏం చేస్తున్నారని అడిగితే అదేంటమ్మా మీ నవల చదివి ఆయన రాజకీయాలు వదిలి, పక్కదోవ పట్టి పోయాడు కదా ఇంకా లాయరుగానే ప్రాక్టీసు చేస్తున్నాడని చెప్పారు.

అలాగే జనార్దనరెడ్డిగారని వరంగల్ జిల్లా పరిషత్ ఛైర్మన్, వరంగల్లులో నాకు డిన్నర్ ఇచ్చాడు. ఆ పంచాయతీ ప్రెసిడెంట్లందరినీ పిలిచి డిన్నర్ ఇచ్చాడు. డిన్నర్‌లో మాట్లాడుతూ అందర్నీ 'రాబందులు – రామచిలుకలు' నవల చదవమన్నాడు. మనల్ని గురించి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి ఇది పనికి వస్తుందన్నాడు నాకు కృతజ్ఞతలు చెప్పాడు.

మార్క్సిస్టు దృక్పథం ఉన్నప్పుడు రచయితకు సామాజిక వాస్తవం అర్థమవుతుంది. అప్పుడే రచయిత రచన సంపూర్ణమవుతుంది. ప్రజల జీవితాన్ని నిర్ణయించేది రాజకీయాలే అయినప్పుడు ఆ జీవితాన్ని చిత్రించే రచయితకు రాజకీయాలు లేకుండా ఎట్లా ఉంటాయి.

నా రచనలు ఈ మార్క్సిస్టు దృక్పథంనుంచే పుట్టాయి. జీవితం నాకు వేసిన ప్రశ్నల నుంచే పుట్టాయి. నాలో రేకెత్తిన ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవడంలోనే రచయిత్రిగా అభివృద్ధిచెందాను. నా కథలూ, నవలలూ అన్నిటినీ ఈ దృష్టికోణం నుంచే చూడవచ్చు. జనరంజకంగా రాయాలన్న ప్రయత్నం చేయనప్పటికీ, నా రచనల్లోని వాస్తవికత కూడా ప్రజామోదాన్నిపొంది నాకు ఒక విశిష్ట రచయిత్రిగా తెలుగు నవలా రచయితల్లో స్థానాన్ని సంపాదించి పెట్టింది.

జీవితంలో నాలో తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోగలిగానో లేదో నాకు తెలియదు. కాని నిజాయితీగా ప్రయత్నం చేశానని మాత్రం చెప్పగలను. మి

## విలువలు

"ఓసారి సంజీవదేవ్ గారింట దొంగలుపడి పదివేలు విలువచేసే నగలు దోచుకు వెళ్ళారు. పరామర్శ చేయడానికి వచ్చిన వాళ్ళతో చిరునవ్వుతో 'ఫర్వాలేదు. నిజానికి దీనివల్ల మనకేం నష్టం లేదు' అనేవారట.

అదేమిటి అలా అంటారంటే – 'అవునండీ, వారు తీసుకెళ్ళింది అన్నీ నగలే కదా! వాటిని తిరిగి మనం చేయిస్తే కదా మనకు నష్టం వచ్చేది. లేకపోతే దానివల్ల నష్టమేముంది' అని తర్కించేవారు.



సంజీవదేవ్

ఈ వార్త తెలిసిన చలంగారు అరుణాచలం నుండి లేఖ వ్రాస్తూ – దొంగలు పడ్డారా? మీరు చారుదత్తుని లాగా దొంగలు వేసిన కన్నం దగ్గర కూర్చుని వారి హస్త కౌశలాన్ని మెచ్చుకోవడం లేదుకదా! ఏమేం పోయాయి? నగానట్రా అయితే ఫర్వాలేదు. మీ దగ్గర ఉన్న విలువైన పుస్తకాలు, ఉత్తరాలు, చిత్రాలు భద్రంగా ఉన్నాయా?" అంటూ ముగించారు.

సజీవ కల్పనలు

# పట్నాయక్ శిల్పాలు

*- బందిలి రతన్ రాజు*



సత్యనారాయణ పట్నాయక్

శ్రీకాకుళం జిల్లా తెర్లాం స్టేషన్ సమీపాన బాడంగి గ్రామ కరణం చౌదరి కనకరత్నం పట్నాయక్, లక్ష్మీకాంతమ్మ దంపతులకు 1925 డిసెంబర్ 6వ తేదీన చౌదరి సత్యనారాయణ పట్నాయక్ జన్మించారు. ఐదో ఏట నుంచి పలకా బలపం పట్టిన పట్నాయక్ ప్రాథమిక విద్య ఒక చోట స్థిరంగా సాగలేదు. ఊహ తెలిశాక జాతీయోద్యమాలు ఆయన్ని కుదురుగా చదువుకోనివ్వలేదు. మహాత్మాగాంధీ పర్యటనతో స్ఫూర్తిపొందిన దేశభక్తులు ఉద్యమం ముందుకు నడిపించ డానికి తమ నగనట్రతో నిలువుదోపిడీ సమర్పించుకునేవారు. ఆ రోజుల్లో రాజకీయాలు కూడా చాలా ఉన్నతంగా ఉండేవి అనడానికి ఇదొక తార్కాణం. ఆ ఉద్యమాల వెంట పరుగులు తీయడంతో పట్నాయక్ ధ్యాస పక్కకి మళ్ళుతోందని ఇంట్లో అర్థమైపోయింది. చదివింది చాలని 1943లో సర్వేయర్ టెస్టు రాయించి చిక్కాలవలస కరణం బాధ్యతలు అప్పగించారు. ఇష్టం లేకపోయినా పెద్దల మాట మీద గౌరవంతో రోజులు వెళ్ళదీసేవాడు. ఆ రోజుల్లో బ్రిటిష్ కలెక్టర్లు ఏడాదికోసారి నిర్వహించే జమాబందీలో రెవెన్యూ చిట్టాలు, జమా ఖర్చు వివరాలన్నీ సరిచూసుకోవడానికి ఆ ప్రాంతపు గ్రామ కరణాలంతా శ్రీకాకుళంలో 15-20 రోజులు బస చేయాల్సి వచ్చేది. పెద్ద కలెక్టర్ జమాబందీకోసం నిరీక్షిస్తున్న తరుణంలో శ్రీకాకుళం నాగావళి ఏటి ఒడ్డున వెళుతుండగా పోర్ట్రైట్ పెయింటింగ్ పనిలో నిమగ్నమైన కూర్మపు నరసింహాన్ని చూస్తూ ముగ్ధుడై ఉండిపోయాడు. యువకుడి ఆసక్తి గమనించి చిత్రకళ నేర్చుకుంటావా? అని ప్రశ్నించారు. అంతే పట్నాయక్ ముఖంలో చెప్పలేనంత వెలుగు. అప్పట్నుంచీ రోజూ నాగేశ్వర ఫోటోస్టూడియోకి వెళ్ళి కూర్మపు నరసింహం వద్ద ఆయిల్ పెయింటింగ్, ఫోటోగ్రఫీ, డార్క్ రూమ్ అసిస్టెన్సీ.... ఆయన జీవిత గమ్యాన్ని మార్చేశాయి. కళలో పరిణతి చెందిన పట్నాయక్ దూకుడు చూసి తన వద్ద ఇలా ఎన్నేళ్ళు నేర్చుకున్నా ఇంతకంటే మెరుగైన కళ లేదని, మద్రాసు వెళ్ళి గవర్నమెంటు స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేరమని ఆయన సలహా ఇచ్చారు. అప్పట్నుంచీ తన ఆలోచనలన్నీ ఆ దిశగా పయనిస్తున్నా ఇంట్లో ఎవరూ ప్రోత్సహించక పోవడంతో నిరాశా నిస్పృహలతో కాలం వెళ్లదీశారు.

ఆ రోజుల్లో రెవెన్యూ సమన్లంటే చాలా పెద్ద భయం. కలెక్టర్లు గుర్రాలపై తనిఖీ చేయడానికి వచ్చే సందర్భాల్లో అలాంటి తాఖీదులందాయంటే అదో పెద్ద సంచలన వార్త. ఓసారి నరసన్న పేటలో తారసపడ్డ కలెక్టర్‌తో మాటల సందర్భంలో తనకు చిత్రలేఖనంలో అభినివేశం ఉందని పట్నాయక్ చెప్పాడు. తదుపరి విద్య నేర్చుకోవాలంటే ఇంట్లో అనుమతి లభించక ఇష్టం లేకపోయినా కరణీకం వృత్తిలో కొనసాగుతున్నానని మనసులో మాట బైటపెట్టేశాడు. తనవద్ద చనువుగా విషయాన్ని తెలుసుకున్న బ్రిటిష్ కలెక్టర్ కొన్నాళ్లకి తండ్రీ కొడుకులిద్దరికీ రెవెన్యూ సమన్లు పంపేసరికి ఇంట్లో, అలజడి మొదలైంది. కలెక్టర్ గదిలో ప్రవేశించగానే ఇద్దరి చేతుల్లోంచీ సమన్లు తీసుకుని చించి పడేసి ఫ్రెండ్లీగా మాట్లాడి పట్నాయక్ పైచదువులకు ఒప్పించారు. నాన్న అప్పట్లో గరిసెడు ధాన్యం (30 పుట్లు- పుట్టుకి 20 కుంచాలు) అమ్మి విశాఖపట్నం నుంచి మద్రాసు మెయిల్‌లో ఎక్కించిన సంగతులు తల్చుకుని పట్నాయక్ ఆనంద బాష్పాలు రాల్చారు.

అలా 1950లో మద్రాస్ గవర్నమెంటు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. అప్పటికే

బందిలి రతన్ రాజు, సెల్ : 9490263115

1946, 47సం॥లలో మద్రాసు ప్రభుత్వం నిర్వహించిన ఫ్రీ హ్యాండ్ ఔట్‌లైన్ అండ్ మోడల్ డ్రాయింగ్ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన పట్నాయక్ ప్రతిభకు మెచ్చి ఆరేళ్ల పోస్టు గ్రాడ్యుయేషన్ (మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) కోర్సులో సరాసరి రెండో ఏడాదికి ప్రవేశం కల్పించారు. అప్పటి ప్రిన్స్‌పాల్ దేవీ ప్రసాద్‌రాయ్ చౌదరి చేయి తిరిగిన శిల్పకారుడు. శిక్షణా కాలంలో దేవీరాయ్ స్టూడియోలో శిల్పాలు నిర్మించే పద్ధతులు, ఆయన ఏకాగ్రత, పనిముట్లను పట్టుకునే విధానం, శిల్పాలకు సోయగాలద్దే తీరు పరికించి చూసే అరుదైన అవకాశం పొందిన విద్యార్థుల్లో తానూ ఒకడినని పట్నాయక్ సగర్వంగా చెప్పుకుంటారు. విద్యార్థి దశలోనే ఫ్రెంచ్ ఇంప్రెషనిస్టుల ప్రభావం పట్నాయక్‌పై పడింది. సిగాఫ్, వ్యాన్, రూబెన్స్, రెమ్ బ్రాంట్ వంటి నిపుణుల్ని అనుకరించారు. పెయింటింగ్‌లో తన గురువు కేసిఎస్ పణిక్కర్ శైలికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఐదు, ఆరు సంవత్సరాల్లో బాగా ఆకర్షితుడయ్యానని ఆయన చెబుతారు. దృశ్యమార్గంలో మనసును గాఢంగా ప్రభావితం చేయగల నైపుణ్యానికి చిత్రలేఖనంకంటే శిల్ప నిర్మాణమే సరైన మార్గమని పట్నాయక్ ఉద్దేశం. అందుకే 1974 తర్వాత బ్రాంజ్ (కంచు), వుడ్ (కొయ్య), క్లే (బంకమన్ను), టెర్రకోట మాధ్యమాలో తన సొంత బాణీ ఏర్పరచుకుని ఆ దిశగా అద్భుతాలు ఆవిష్కరించాడు.



తాను రూపొందించే ప్రతిమల ఊహా చిత్రం ముందే పట్నాయక్ మదిలో గూడుకట్టుకునే ఉంటుంది. అది తుది మెరుగులు దిద్దుకున్నాక తీరిగ్గా పరిశీలిస్తే.... ఔనూ ఇది ఫలానా వాళ్లు కదూ అని ఆ ఊరివారు ఇట్టే పసిగట్టేస్తారు. అందుకు తగ్గట్టుగానే ఆయా కళాకృతుల పేర్లూ ఆయన శైలికి అతికినట్టు సరిపోతాయి. పనిలో విశ్రాంతిలో, జగడాల్లో, భయాందోళనల్లో ఆయా పల్లెటూరి అమాయక జనాల మూడ్స్ అన్నీ ఏనాడో మదినిండా మూటగట్టుకున్నారాయన. అవసరాన్ని బట్టి సందర్భానుగుణంగా ఒక్కో ఆకారాన్నీ మూర్తీభవించేదాకా పట్నాయక్ దీక్షలో మునిగిపోతారు. చేపట్టిన ప్రాజెక్టు అనుకున్నంత బాగా వచ్చిన క్షణాల్లో ఆ ముఖంలో ఆనందానికి కొలమానం లేదు. చెవి దుద్దులు, ముక్కు బేసర, నుదుటి ముడతలు, ముంజేతి కడియాలు, మెళ్లో తామీలు, చొక్కాగుండీలు, మూతి వంకర్లు, వేలి కనుపులతో సహా ప్రతి అవయవ నిర్మాణం, ఆభరణ సౌందర్యం ఆయన ఆచి తూచి పొందుపరుస్తారు. ఆయా సందర్భాల్లో తాను తీర్చిదిద్దబోయే చిత్తరువుల కోసం రోల్ మోడళ్లను వెతుక్కుంటారు. కొన్ని గంటల పాటు వారి మూర్తిమత్వాన్ని అచ్చంగా ఆవిష్కరించే క్రమంలో మాటా మంతీ కలుపుతూ... తన పని తాను చేసుకుంటూ పోతారు. తన ముందున్న వ్యక్తి మహా వేదాంతి కావచ్చు.... వీధి బిచ్చగత్తె కావచ్చు... ఎవరయినా సరే వారి మనస్తత్వానికి సరిపడేట్టు విసుగు పుట్టించకుండా మాట్లాడే నేర్పు, చిత్రనిర్మాణం పూర్తి చేసే ఓర్పు, సహనం పట్నాయక్ విజయానికి మూల ధాతువులుగా చెప్పుకోవాలి.

**కాంస్య ప్రతిమల్లో నైపుణ్యం :**

కంచుపోత విగ్రహాల, ప్రతిమల తయారీలో పట్నాయక్ చేయని ప్రయోగమంటూ లేదంటే అతిశయోక్తి కాదు. సొంతంగా ఫౌండ్రీ ఏర్పరచుకొని, స్వయంగా కంచు కరగదీసి, కావాల్సిన ఆకృతి పోత పోస్తారు. కాంస్య ప్రతిమల్ని రూపొందించడంలో చాలామంది శిల్పకారులు ఉపయోగించే పద్ధతి మైనం పోగెట్టే ప్రక్రియ. శిలా విగ్రహాలు రూపొందించడంలో 1. భారతీయ సంప్రదాయ పోత విగ్రహాలు 2. ఇటాలియన్ విధానం 3. షెల్ కాస్టింగ్ (ముడిసరుకులు దొరక్క పోవడంతో ఆయనెప్పుడూ ఈ విధానం అనుసరించలేదట). ఈ మూడింటిలో ఇటాలియన్ల పద్ధతే ఎక్కువ మంది అనుసరిస్తారు. ఇందులో నాలుగు దశలుంటాయి. ముందుగా కావాల్సిన ఆకారాన్ని మన్నుతో చేసుకోవాలి. ఆ తర్వాత ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌గా మలచుకుంటారు. మైనపు ముద్దతో కావాల్సిన ఆకృతి మాతృక చేసి దీన్నుంచి అసలు సిసలు శిల తయారు చేసుకుంటారు. నాలుగో దశలో మైనాన్ని కరిగించి ఆస్థానంలో కరగదీసిన లోహాన్ని అచ్చుచేస్తారు. ఈ దశలో ఎక్కడైనా మైనం

ముద్ద కరగకుండా మిగిలిపోయినా, బుడగలేర్పడినా విగ్రహం ఆకారం అనుకున్నట్టుగా రాదు. ఈ పోత విగ్రహం ఎలా తయారైందో చూడాలంటే విగ్రహ పరిమాణాన్ని బట్టి 28-48 గంటల వరకూ పడుతుంది. అప్పుడుగానీ శిల్పి ముఖంలో ఆనందం కనిపించదు.

**కొన్ని కాంస్య ప్రతిమల గురించి :**

జీవన సంఘర్షణ, సామాజిక స్థితిగతులు, బీదల పాట్లు విపులంగా కనిపిస్తాయి. చెరిగిన జుత్తు సగం మాసిన గెడ్డం, నోట్లో బీడీ... దీర్ఘాలోచనతో రచ్చ బండమీద కూర్చున్న సగటు మనిషికి జీవన చిత్రణ 'తవిటయ్య'లో కనిపిస్తుంది. చెరో పక్క చనుబాలు కుడిచే కవలపిల్లలు, ముస్తాబైన అందాల నాయిక, మరులుగొలిపే శృంగారనాయిక, తల్లీ బిడ్డల అనురాగ బంధానికి ప్రతీకగా 'మదర్ అండ్ చైల్డ్' గ్రామీణ జానపద కళాకారుడి చిత్రం 'మ్యూజీషియన్' చూస్తూ ఉండి పోవాల్సిందే.

**కుటుంబానికిదే వారసత్వ సంపద :**

ఈ కళాతపస్వి మితభాషి. మాట్లాడేది ఏదైనా స్పష్టంగా, సూటిగా వెల్లడించడం ఆయన నైజం. ఆయన భార్య శ్యామల 1945లో పట్నాయక్‌ను పరిణయమాడేనాటికి ఆమె వయస్సు 11 ఏళ్లు. తన పూర్వీకుల్లో చిత్రకళ నేర్పడం. ఎవరికీ లేక పోయికా తర్వాతి తరాల్లో ఆయన ప్రభావం బాగానే పని చేసింది. చంద్రశేఖర్, విజయభూషణ్, శాంతి స్వరూప్, రవిశంకర్ ఈ దంపతులకు వంశాంకురాలు. అంతా మంచి ఉద్యోగాల్లో స్థిరపడి కుటుంబ జీవనం సాగిస్తున్నారు. పట్నాయక్ అఖరి కుమారుడు రవిశంకర్ తండ్రి బాటలోనే, చిత్రకళా రంగాన్ని జీవన వాహికగా చేసుకొని ఆంధ్రా విశ్వ కళాపరిషత్ లలితకళల విభాగాధిపతిగా సేవలందిస్తున్నారు. ఈయన సతీమణి సంధ్యాశంకర్ కూడా ఆధునిక సరళిలో తనదైన ఒరవడి సృష్టించుకుని మంచి చిత్రాలే రచిస్తున్నారు. పిల్లలు ఎవరికి వారు విడిగా ఉంటున్నా ఎంవీపి కాలనీలోని పట్నాయక్ దంపతుల్ని సందర్శించి ఉమ్మడి కుటుంబంలోని మాధుర్యాన్ని చవిచూస్తున్నారు.

**జీవన సోపానాలు :**

శిల్పకళలో అనల్పమైన ఖ్యాతిగడించిన పట్నాయక్ దేశం గర్వించదగ్గ కళాకారుల్లో ఒకరు. మద్రాసు, కలకత్తా, ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహా నగరాల్లో వందలాది ప్రదర్శనల ద్వారా పట్నాయక్ శైలి కళా ప్రపంచానికి ఆరు దశాబ్దాలుగా సుపరిచితం. ఈయన శిల్పాలు నేషనల్ ఆర్ట్ గ్యాలరీ (మద్రాసు), గవర్నమెంటు మ్యూజియం (మద్రాసు), లలితకళా అకాడెమీ (హైదరాబాద్), మ్యాక్స్‌మిల్లర్ భవన్ (ఢిల్లీ) ఫోర్డ్ ఫౌండేషన్ ఆఫీస్ (న్యూఢిల్లీ), హైదరాబాద్ రాజ్‌భవన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, అమెరికా, జపాన్‌వంటి దేశాల్లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు అలంకారాలుగా మారాయి. 1955 నుంచి 2002 వరకూ దేశవిదేశాల్లో దాదాపు అన్ని ప్రముఖ పట్టణాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ 1980లో పట్నాయక్ శిల్పాలు, చిత్రలేఖనాలపై మోనోగ్రాఫ్ ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడెమీ అధ్యక్షునిగా (1977-82), స్కల్ప్చర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) సంయుక్త కార్యదర్శిగా (1976) వివిధ జాతీయ సంస్థలకు 2004 వరకూ ఆయన సేవలందించారు. 1952లో మైసూరు దసరా ఎగ్జిబిషన్ నిర్వాహకుల నుంచి పురస్కారం పొందారు. 1975 కొయ్యశిల్పాలను తీర్చిదిద్దినందుకు 'కాంపోజిషన్' అవార్డు, 1977లో కాంస్యవిగ్రహాల రూపకల్పనలో 'బటర్‌ఫ్లై' అవార్డు, 1978లో తుఫాను దృశ్యాలను చిత్రించినందుకు ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ పట్నాయక్‌ను సత్కరించింది. సెమినార్లు, రేడియో, టీవి, పత్రికలు, మేగజైన్లలో ఇంటర్వ్యూలు, గౌరవ పురస్కారాలు, ఎగ్జిబిషన్లు, ప్రముఖుల ప్రశంసలు పట్నాయక్ జీవితంలో కోకొల్లలు. సర్ సీపీ బ్రౌన్ అకాడెమీ ప్రచురించనున్న బయోగ్రఫీ కోసం జ్ఞాపకాలను పదిలపరచే పనిలో ఆయన ప్రస్తుతం తలమునకలై ఉన్నారు. చిత్రలేఖనంలో ప్యాలెట్ నైఫ్‌తో రంగులద్ది త్రిడీ ఎఫెక్ట్ తీసుకొచ్చే సంప్రదాయాన్ని శిల్పరచనలోకి చొప్పించారాయన.

**ఆయనతో మాటామంతి....**

**ప్ర: ఖద్దరు వస్త్రధారణ... గాంధేయవాదంపై అభిమానమా?**

**జ:** మద్రాసులో చదువుకునే రోజుల్లో ప్యాంటు, షర్టు, టక్, టై... పట్నవాసంలో మిళితమైపోయాను. ఐనా పెయింటింగ్ విషయానికొచ్చేసరికి పల్లెజ్ఞాపకాల్లో పులకించేవాడ్ని. పోస్ట్ డిప్లొమా పూర్తయ్యాక పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం దగ్గర పెంటపాడులో 1955-62 మధ్యకాలంలో ప్రభుత్వ ప్రాథమిక శిక్షణా కళాశాలలో పనిచేశాను. బి.ఇడి. టీచర్లు, డిఈవోలు అక్కడ మూడేసి నెలల శిక్షణకు వచ్చేవారు. 'రూరల్‌లైఫ్-డిగ్నిటీ ఆఫ్ లేబర్' అనే

అంశంమీద గాంధేయ విద్యావిధానంలో శిక్షణ తరగతులుండేవి. అందులో క్రాఫ్ట్, వుడ్‌వర్క్, వీలింగ్, లెదర్‌వర్క్ అన్నీ నేర్పించేవాళ్ళం. అక్కడ మా ప్రిన్సిపాల్ వెంకటస్వామి గారు పిలిచి ఇది గాంధేయ పద్ధతిలో ఉపాధ్యాయులకు విద్యనేర్పే సంస్థ. మీ డ్రస్ ఇక్కడి పద్ధతులకు భిన్నంగా ఉంది. మార్చుకోండని సూచన చేశారు. అప్పట్నుంచీ ఖద్దరు పంచె, లాల్చీ, శేర్వాణి, వెయిస్ట్ కోట్ వేసుకోవడం మొదలుపెట్టాను. ఇహ నా తరహాయే మారిపోయింది. అప్పట్నుంచీ అదే వస్త్రధారణ కొనసాగిస్తున్నా. అన్నట్టు మన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి అక్కడ నా స్టూడెంటు.

**ప్ర: గాంధేయ వాదాన్ని...సిద్ధాంతాలను పాటిస్తున్నారా?**

**జ:** బాల్యదశలోనే స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ నుంచి స్ఫూర్తి పొందాను. ఉద్యోగరిత్యా పెంటపాడులో గాంధేయ విధానాలు బాగా అలవాటు చేసుకున్నాను. చరఖా తిప్పేవాడ్ని. నూలు ఒడికేవాడ్ని. ఇప్పుడంటే ఓపికలేదు కానీ చాలాకాలం నా చెప్పులు నేనే కుట్టుకునేవాణ్ణి. విజయవాడలో గాంధీ శతజయంతి కాలంలో చాలా పెయింటింగ్స్, స్కల్ప్‌చర్స్ వేశాను. అప్పటి మన విద్యాశాఖా మంత్రి మండలి వెంకట కృష్ణారావు నా కళను ఎంతగానో అభిమానించి తన స్వస్థలం కృష్ణాజిల్లా అవనిగడ్డలో నాచేత శిల్పాలు, చిత్రాలు చేయించుకుని దాచుకున్నారు. విద్యాబోధనలో భాగంగా విద్యార్థుల్నీ గ్రామాలకు తీసుకెళ్లి వీధులు శుభ్రం చేయించడం, వాళ్ల జీవితాలను దగ్గరగా పరిశీలించడం, చిత్రాలు గీసి వెన్వెంటనే వారికివ్వడం...అబ్బో...దటీజ్ గోల్డెన్ ఏజ్ ఆఫ్ మై ఆర్ట్ డెవలప్‌మెంట్.



**ప్ర: శిల్పరచనలో సొంత బాణీ ఏర్పరచుకున్న క్రమం గురించి వివరిస్తారా?**

**జ:** పెయింటింగ్స్‌లో ఆయిల్ పెయింటింగ్స్ ఎక్కువగా చేశాను. ప్యాలెట్ నైఫ్‌తో పోర్ట్రైట్స్ నా స్పెషలైజేషన్. ఇందులో త్రీ డైమెన్షన్, రఫ్‌నెస్ భలే వస్తాయి. సేమ్ ట్రీట్‌మెంట్ ఉపయోగించి ఫోర్ డైమెన్షన్‌తో ఆల్‌రౌండ్ ఎఫెక్ట్ తీసుకొస్తే... అనే ఆలోచన తట్టింది. ఫోక్ మీడియం ద్వారా ఎందుకలా ప్రయత్నించకూడదని మొదలుపెట్టాను. స్కల్ప్‌చర్లు అందునా బ్రాంజ్ మీడియం ద్వారా విశిష్టతలు చాటుకున్న వాళ్లు చాలా తక్కువ. నామట్టుకు నేనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ దిశగా అస్త్రాలు పదును పెట్టుకుని కృషి మొదలుపెట్టాను. ఎవరైనా సూచనలు చెబితే ఆలకిస్తాను. కానీ మనస్సాక్షినే అనుసరిస్తాను. 1974లో పెయింటింగ్స్‌పై శ్రద్ధ తగ్గించి బ్రాంజ్ శిల్పాలపై దృష్టి మరల్చాను. ఆ రోజుల్లో మద్రాసు, ముంబాయి, ఢిల్లీలలో మాత్రమే బ్రాంజ్ స్కల్ప్‌చర్ తయారుచేసే నిపుణులుండేవారు. 1962 నుంచి 1983లో రిటైరయ్యేవరకూ గుంటూరు కేంద్రంగా దేశం గర్వించదగ్గ శిల్పాలెన్నో తయారుచేశాను. ఇహ ఖర్చు సంగతంటారా? నిజానికిది చాలా ఖరీదైన వ్యసనంలాంటిదే. నాకున్న పరిజ్ఞానానికి దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడినుంచో ఖరీదైన ఆర్డర్లొచ్చేవి. ఉద్యోగంలో వచ్చే ఆదాయం కుటుంబ జీవనానికి సరిపోయేది. అదనంగా ఆర్డర్లద్వారా వచ్చే సొమ్ముతో ప్రయోగాలకు అవసరమైన ముడిసరుకులు కొనుగోలు చేసేవాణ్ణి. కాస్టింగ్, ఫౌండ్రీ అన్నీ పెద్ద ఆర్డర్లలో కొట్టుకుపోయేవి. అందువల్ల అది ఖరీదైన కళే అయినా కొనసాగించ గలిగాను. మరోటిచేస్తే నాకు ఈ స్థాయి వచ్చేదికాదు.

**ప్ర: జీవితాశయం?**

**జ:** విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో 2010 మే నెలల్లో ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతులమీదుగా 'పట్నాయక్ ఆర్ట్ గ్యాలరీ' ప్రారంభించారు. ప్రారంభం నుంచీ నేను చేసిన వర్క్స్ ఇక్కడ పదిలంగా వున్నాయి. నా స్టూడియో, ఆర్ట్‌గ్యాలరీ కమర్షియల్ కాదు. ఇదొక పర్మినెంట్ మ్యూజియంలా చేయాలని నా ఉద్దేశం. నేనేపనిచేసినా నా పిల్లలకూ ఇష్టమే. నా ఆశయాన్ని వాళ్లూ కొనసాగిస్తారు. తమిళనాట చోళమండలంలో కొన్ని ఎకరాల విస్తీర్ణంలో మన దేశవాళీ కళల దేవాలయం ఒకటుంది. తెలుగు నేలపై అలాంటిది చూడాలనుకోవడం అత్యాశేనేమో. విశాఖలో కాపులుప్పాడ దగ్గర ఆర్ట్‌విలేజి ఆంధ్రుల ఆరంభ శూరత్వాన్ని ఎత్తిచూపుతోంది. మి



# అందాల జానపదం...

- మర్రెబోయిన జయదేవ్

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం, జానపద భాష, జానపద కళలు, జానపద వస్తు సంస్కృతి, జానపద సాంఘిక ఆచారాలు అనే ఐదు విభాగాలున్నాయి. వీటిలో మొదటిదైన జానపద సాహిత్యం ప్రధానమైనది. మొన్న మొన్నటి వరకు జానపద సాహిత్యం ఒక్కటే జానపద విజ్ఞానంగా జానపద విజ్ఞానవేత్తల దృష్టిలో చలామణి అయింది. ఏ భాషలోనైనా మొట్టమొదటి జానపద సాహిత్యమే ఉద్భవిస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొని శిష్ట సాహిత్యం పుడుతుంది. శిష్ట సాహిత్యం పండితులకు మాత్రమే అర్థమౌతుంది. దాన్ని పండితులైన వారు మాత్రమే ఆదరిస్తారు. అంటే అది పరిమిత ప్రజాదరణ కలది. జానపద సాహిత్యం జానపదులచేత, జానపదులకోసం జానపదుల భాషలో సృష్టించబడింది. ఇది చాలా సులభశైలిలో ఉండడంవల్ల అందరికీ తేలికగా అర్థమవుతుంది. అందువల్ల జానపద సాహిత్యం అపరిమిత ప్రజాదరణ కలది.

జానపద సాహిత్యంలోని వస్తువు సామాన్య ప్రజలకు బాగా తెలిసినదిగా ఉంటుంది. ఈ సాహిత్యంలో జానపదుల జీవితం, వారి ఆశయాలు, వేడుకలు, వినోదాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కష్ట నిష్టూరాలు మొదలైనవి చెప్పబడతాయి. జానపద రచయిత వస్తువు కోసం పెద్దగా కష్టపడడు. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలను ఇతివృత్తంగా చేసుకొని సాహిత్యాన్ని సృష్టిస్తాడు. ఒక్కొక్కసారి జానపద రచయిత పురాణాల్లోని విషయాన్ని కథా వస్తువుగా చేసుకొని గేయాన్ని గాని, కథాగేయాన్ని గాని, వచన కథలను గాని చెప్పినప్పటికీ అందులో చాలా వరకు జానపదుల ఆచార వ్యవహారాలు, జానపద మనస్తత్వ చిత్రణ, జానపద వాతావరణ చిత్రణ మొదలైనవి ఉంటాయి. రాముడు, కృష్ణుడు, శివుడు మొదలైన పురాణ పాత్రల పేర్లు మాత్రమే ఉంటాయి. ఈ పాత్రల ప్రవర్తన మాత్రం జానపదుల ప్రవర్తనలాగే వుంటుంది. జానపద సాహిత్యానికి ఎలాంటి నియమాలు వర్తించవు.

## స్త్రీల గేయాలు:

గృహస్థాశ్రమంలో స్త్రీకి చాలా ప్రాధాన్యత ఉంది. అందువల్లనే మనవారు భార్యను 'గృహిణి' అన్నారు. గృహిణి అంటే గృహం కలది అని అర్థం. అంటే ఇంటికి ఆమే యజమానురాలు. భర్తను, గృహస్థుడు అన్నారు. అంటే గృహంలో ఉండేవాడు అని అర్థం. గృహంలో అనేకమంది మనుషులతోపాటు పిల్లి, కుక్క మొదలైన జంతువులు కూడా ఉంటాయి. గృహస్థుడు గృహంలో ఉండే అన్నింటిలో ఒకడు మాత్రమే. చెప్పేదేమంటే గృహంలో గృహిణికి ఉన్న ప్రాధాన్యత గృహస్థునికి లేదు. ఇంట్లో పిల్లల ఆలనా పాలనా, వారిని పెంచి పెద్ద చేయడం, వారికి విద్యా బుద్ధులు చెప్పడం, పెళ్ళి పేరంటాళ్ళు చేయడం, పండగలు, పబ్బాలు, నోములు, వ్రతాలు మొదలైనవి స్త్రీలే చేస్తారు. పురుషులు పై కార్యక్రమాలకు అవసరమైన వస్తువులను తెస్తారు. ఆ కార్యక్రమాలను నిర్వహించేది మాత్రం స్త్రీలే. పైన చెప్పిన ఎన్నిరకాల కార్యక్రమాలను స్త్రీలు నిర్వహిస్తూ ఉంటారో వాటన్నింటికీ సంబంధించిన జానపదగేయాలు మనకు ఉన్నాయి. వాటన్నింటిని స్త్రీలు పాడుతూ ఉంటారు.

తల్లి తన కొడుకును రాముడిగా భావిస్తే 'రామా లాలి మేఘశ్యామా లాలీ, తామరసనయన దశరథ తనయ లాలి'

డా. మర్రెబోయిన జయదేవ్, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం

అని పాడుకుంటుంది. కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్లుగా తల్లికి తన సంతానం ఎంతో అందంగా కనిపిస్తుంది. ఒక తల్లి తన కూతురు అందచందాలను ఇలా ప్రశంసిస్తూ వుంది.

*"పాపాయి కన్నులు కలువరేకుల్లు*
*పాపాయి జులపాలు పట్టుకుచ్చుల్లు*
*పాపాయి దంతాలు మంచి ముత్యాలు*
*పాపాయి చేతులు పొట్లకాయల్లు*
*పాపాయి పలుకులు పంచదార చిలుకలు*
*పాపాయి చిన్నెలు బాలకృష్ణుని వన్నెలు"*

స్త్రీ జీవితంలో వివాహం చాలా ముఖ్యమైన ఘట్టం. దీన్ని ఆధారంగా చేసుకొని అనేక రకాల ఆచారాలు ఏర్పడ్డాయి. వివాహం పెళ్ళి చూపులతో ప్రారంభమవుతుంది. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కూతురును మరొకరికి ఇచ్చి పెళ్ళి చేసేటప్పుడు తల్లిదండ్రులు వరుణ్ణి గురించి, అతని తల్లిదండ్రుల గురించి, వారి ఆస్తిపాస్తుల గురించి అనేక రకమైన విచారణలు చేసి ఆ తరువాత తమ అమ్మాయిని వారింటికి ఇస్తామని కబురు పంపిస్తారు. ఈ క్రింది గేయంలో దంపతులు తమ కూతురుకు వచ్చిన సంబంధం గురించి ఇలా చెప్పుకుంటున్నారు.

*"అల్ల వూరే వారు పిల్ల నడిగేరు*
*పిల్ల వానికి రూపురేఖలున్నాయి*
*ఏటేట పండేటి భూములున్నాయి*
*ఊరి పొలిమేరలో తోటలున్నాయి*
*చుట్టు కొల్లారంపు మిద్దెలున్నాయి*
*కుట్టివానికి మంచి సేద్యమున్నాది*
*మన పిల్లకూ తగ్గ ఈడు జోడేను*
*కన్నె నిస్తామని కబురంపుదాము"*

వివాహ కార్యక్రమంలో పెళ్ళి చూపులు ప్రారంభం అనుకుంటే అంపకాలు ముగింపుగా చెప్పవచ్చు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కూతురికి పెళ్ళి చేసి మొదటిసారిగా అత్తవారింటికి పంపించేటప్పుడు తల్లిదండ్రులు పడేబాధ మాటల్లో చెప్పనలవి కానిది. ఈ సందర్భంలో తల్లి తన కూతురుకు ఆమె అత్తవారింట్లో నడుచుకోవలసిన విధానాన్ని గురించి హితబోధ చేస్తుంది. ఎలాంటి తప్పు చేసినా తల్లి పెంపకాన్ని తప్పు పడతారు. అందువల్లనే తల్లి అంపకాల సమయంలో కూతురుకు హితబోధ చేస్తుంది. ఆ హితబోధను జానపద కవి చిన్న చిన్న తెలుగు పదాల్లో ఎంతో అందంగా ఇలా గేయరూపంలో రాశాడు.

*"సెలవిస్తి మాయమ్మ సెలవిచ్చినాము*
*చెలగి మీ అత్తింట్లొ బుద్ధి గలిగుండు*
*ఎవ్వరేమాడిన ఎదురాడకమ్మ*
*వీధిలో నిలుచుండి కురులిప్పకమ్మా*
*పలుమారు పలుదెరచి నవ్వబోకమ్మా*
*పరమాత్మతో గూడి వెలుగు మాయమ్మా*
*వార్ని గాదని పూలు ముడువ బోకమ్మా*
*పెద్దల గుర్తెరిగి నడువు మాయమ్మా*
*ఆకలి వుంటేను అడుగ బోకమ్మా*
*అత్తగారితో పోరు చేయబోకమ్మా*
*నాతోటి జేసిన మంకుపోరెల్ల*
*ఎరుగని అత్తింట్లొ చేయబోకమ్మా"*

ఆ తరువాత తల్లి తన కూతురు చేతిని వియ్యపురాలి చేతిలో బెట్టి తన కూతురును ఆమెకు అప్పగిస్తూ తన కూతురును కోడలుగా కాకుండా కూతురుగా చూచుకోమని ఎంతో వినయంగా బ్రతిమాలే ధోరణిలో చెబుతుంది. ఈ విషయాన్ని జానపద కవి ఈ కింది గేయంలో ఎంతో చక్కగా ఇలా వివరించారు.

*"ఈ బాల యెరుగదు ఏమియునైన*
*మీ బాలలో నొక బాలగా చూడు*
*బొమ్మరిండ్లని యాడు బుద్ధెరుగదమ్మా*
*మెల్లగా నేర్పుతో పని నేర్పవమ్మా*
*ఆకలెరిగి అన్నంబు పెట్టినదాక*
*అడుగ నేరదు నీవు అడిగి పెట్టమ్మా*
*కోడలు మీసొమ్ము కొడుకు మీ సొమ్ము*
*ఆడువారిని గన్న అలుసింతెనమ్మా*
*సిరివంటి కోడలు మరుడంటి కొడుకు*
*మగువరో నీ భాగ్య మహిమేమమ్మా"*

జానపదుల అమాయకత్వము, ఆర్ద్రత, సమాజ జీవనంలో వారి నిబద్ధత సరళ హృదయులకు ఎంతో ఆనందాన్ని, ఆలోచనను కలిగిస్తాయనడంలో సందేహం లేదు. జానపద సాహిత్యం సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రతిబింబిస్తుంది.

***(పై గేయాలు తెలుగు జానపద గేయ సాహిత్యంలోనివి)***



## 2002 సంవత్సర సరస్వతీ సమ్మాన్ స్వీకారోపన్యాసం

# యుగాంతం

**- మహేశ్ ఎల్‌కుంచ్వర్**

**కే.**కే బిర్లా ఫౌండేషన్ నా రచన 'యుగాంత్'ను సరస్వతీ సమ్మాన్‌కు యోగ్యమైందిగా భావించడాన్ని నేను ఎంతో గౌరవాస్పదమైన విషయంగా భావిస్తున్నాను. జాతీయస్థాయిలో ఖ్యాతి పొందిన గొప్ప పండితుల, సాహిత్యకారుల పరిషత్తు ద్వారా అఖిల భారత స్థాయిలో సన్మానం పొందడం నాలో వినమ్రతాభావాన్ని నింపుతూంది. కృతజ్ఞతాపూర్వకంగా నేనీ పురస్కారం స్వీకరిస్తున్నాను.

తరచుగా నన్ను అడుగుతూ ఉంటారు, 'మీరెందుకు రాస్తారు?' అని. విని నాకు ఆశ్చర్యం కలుగుతుంది. మనుషులు పాటలు ఎందుకు పాడతారు? పొలం ఎందుకు దున్నుతారు? బట్టలు ఎందుకు నేస్తారు? జవాబు ఇవ్వవలసి వస్తే ఈ సరళమైన ప్రశ్నకు అంతే సరళమైన జవాబు ఇవ్వగలను. మొదటిది రాయడంలో నాకు ఆనందం కలుగుతుంది. రెండోది ఈ ఒక్క పనే కొంత బాగా చేయడం నాకు వచ్చు. ఇది నా స్వంత అభిప్రాయం మాత్రమే. నా విమర్శకుల అభిప్రాయం వేరేగా ఉండవచ్చు. దాదాపు నలభై సంవత్సరాల మునుపు ఈ ఆనందాన్ని నేను కనుగొన్నాను. అప్పటి నుంచి రాస్తున్నాను, రచన చేయడం వల్ల కలిగే ఆనందమూ పొందుతున్నాను. పత్రికల సమీక్షలు, ఇంటర్వ్యూలు, ఇవన్నీ అద్భుతంగా ఉంటాయి. వీటిని పొందడం బాగుంటుంది, వీటిపట్ల కృతజ్ఞతాభావం కూడా కలుగుతుంది. ఇవి రచయిత తన బాధ్యతను గుర్తించేలా చేస్తాయి. కానీ, ఇవి అతనికి ప్రేరణా శక్తులుగా తప్పక ఉంటాయి, అని చెప్పలేం. ఇవన్నీ బాహ్య తత్వాలు, మాయలాంటివి. మనం జాగ్రత్తగా ఉండకపోతే ఇవి సృజనయాత్రలో ఆటంకాలుగా మారవచ్చు. నిజానికి సృజన యాత్ర ఒక అంతర్లోక యాత్ర. బాహ్య అంశాల గురించి చెప్పుకుంటే, ఇవి నా ఆలోచనా సరళిని ఎలా ప్రభావితం చేయడం మొదలు పెట్టాయి, అనే విషయం, కొంత నా అతిశయాన్ని మీరు క్షమిస్తే ఇవి నా సృజన ప్రేరణల మూలాలనే ఎలా తొలిచివేశాయి, అనే విషయం, కొంత చెప్పాలనుకుంటున్నాను. 60వ దశకంలో నేను రాయడం మొదలు పెట్టినప్పుడు 'నిబద్ధత' గురించిన చర్చ ప్రతిచోటా వినపడేది. ఒక సామాజిక ఉద్దేశ్యం పట్ల, లేదా ఒక రాజకీయ భావాలపట్ల నిబద్ధతనే ఒక కళాకారుని, లేదా ఒక వ్యక్తి నిజాయితీని అంచనా వేయడానికి ఆధారంగా భావించేవారు. మీరు ప్రకటనా పూర్వకంగా ఏదో ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యంతో చేరి ఉన్నట్లు గనక భావించబడకపోతే వెంటనే మిమ్మల్ని ప్రతిక్రియవాది (Reactionary) గా ముద్రవేయడం జరిగేది. మీరు ఎంత గట్టిగా అరిచి చెప్తే మీ నిబద్ధత అంత దృఢమైందిగా భావించబడేది. ఈ విషయం నాకు బొత్తిగా అర్థం అయ్యేది కాదు. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో చిక్కుకుపోయిన మనుషుల అంతరంగ జీవితం గురించి నేను రాస్తూ ఉండేవాణ్ణి. అదంతా భావనాత్మకమైంది, మనస్తత్వ సంబంధమైంది. రాజకీయాలతో దానికి పెద్దగా సంబంధం ఉండేది కాదు. అది చూసి నా మిత్రులు నా రచనలను ప్రతిక్రియావాద రచనలుగా తేల్చి చెప్పారు. వాళ్ళు నాలో ఒక అపరాధ భావాన్ని నింపడానికి చేయవలసినంతా చేశారు. అయితే నేను మారలేదు. దాంతో నాకు నష్టమే కలిగింది. ఎందరో స్నేహితులను పోగొట్టుకున్నాను. వాళ్ళు రచనలకు సంబంధించి హెచ్చు-తగ్గు అనే తరగతులను ఎందుకు ఏర్పరుస్తున్నారో, ఇంతవరకు నాకు అర్థం కాలేదు. ముఖ్యంగా నా విషయంలో, అంటే రంగస్థలం విషయంలో. ఒక రకమైన రచన ఇతర రచనల కంటే ఎక్కువ నైతికమైందిగా, ఎక్కువ

ఆంగ్లం నుంచి అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి, సెల్ : 09811589430

సరియైందిగా, ఎక్కువ న్యాయసంగతమైందిగా ఎందుకు ఉంటుంది, అనేది నేను అర్థం చేసుకోలేని విషయం. రచన ఎన్నో విధులను నిర్వహించాలి. ఎన్నో స్థాయిల్లో ఎన్నో రకాల మనుషుల ఎన్నో అవసరాలను, ఆకాంక్షలను అది తీర్చవలసి ఉంటుంది. ఏదో ఒక భావాలు ఉన్న నాటకం రాసేవాళ్ళతో నాకు ఎలాంటి వివాదం లేదు. నాకు వాళ్ళ నాటకాలు నచ్చేవి. నేను వాళ్ళను ప్రశంసించేవాణ్ణి కూడా. తమ ఆదర్శాల పట్ల అచంచల విశ్వాసం కలిగి ఉండే రచయితల పట్ల నా మనసులో మొదటినుంచి గొప్ప ఆదరభావం ఉంటూ వచ్చింది, ఇప్పుడు కూడా ఉంది. అయితే అలా రాయడం రచయితకు ఎలాంటి హద్దులు విధిస్తుంది, అనేది ఒక కళాకారుడుగా నేను చూడగలిగాను. ఎందుచేతనంటే భావాల సంబంధమైన ప్రతి రచనకు నిర్ధారిత లక్ష్యం ఒకటి ఉంటుంది. ఆ లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత వాళ్ళు చెప్పవలసింది ఇక ఏమీ ఉండదు. ఒక కళాకారుడుగా అది నాకు చాలా అసంతృప్తికరంగా తోచింది. నిజానికి నేను ఎప్పుడు కూడా ఏ భావాన్నీ పూర్తిగా స్వీకరించలేక పోయాను. కొన్నిసార్లు కొన్ని భావాలకంటే ఏదో ఒక భావానికి దగ్గరగా ఉన్నట్లు నాకనిపించడం మాత్రం జరిగింది. భావాలు కొన్ని-కొన్ని సమయాల్లో సమాజానికి కొంత నివారణ తప్పక కలిగిస్తాయని నేను గట్టిగా నమ్ముతాను. అయితే వీటన్నిటికంటే పెద్దది, శాశ్వతమైంది ఒకటుంది అదే జీవితం. జీవితం అనే ఈ పెద్ద గొడుగు క్రింద సమస్తమూ వచ్చేస్తుంది.

జీవితం విభిన్న యథార్థాలను, అస్తిత్వం యొక్క అనేక స్థాయిలను చూపుతుంది. వాటిలో బాహ్య యథార్థం ఒకటి. అది నిరంతరం తన రంగును, రూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. అది క్షణికమైంది, నశ్వరమైంది. ఈ యథార్థంలోని ఏదో ఒక అంశం ప్రతి నిమిషం సంభవిస్తూ ఉంటుంది, మరుక్షణంలో మాయమై పోతూనూ ఉంటుంది. భవతి, భవతి, భవతి. ఇదే ఈ యథార్థం యొక్క ప్రకృతి. అందువల్లనే ఇది భవం. ఎందుకోగాని, ఒక రచయితగా ఈ యథార్థం నన్ను ఆకర్షించదు. ఈ యథార్థాన్ని అధిగమించి ఈ యథార్థం క్రింద ప్రవహించే మరింత శాశ్వతమైన, చిరంతనమైన యథార్థపు అంతర్ధారను చేరుకోవాలని నా కోరిక. ఈ యథార్థం ఉండేది మానవుని మెదడులో. ఇది బౌద్ధిక క్రియాశీలత కాదు. రచయిత ఇక్కడ సామాన్య మానవ బుద్ధి యొక్క నియంత్రణకు, పరిధికి వెలుపల ఉండేటువంటి, నిర్వచనానికి లొంగనటువంటి శబ్దాతీతమైన మానవ అనుభవ క్షేత్రంలోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తాడు. ఇలాంటి రచనల కేంద్రంలో ఆకారంలేని జనసాధారణం ఉండరు. వ్యక్తి ఉంటాడు. ఈ వ్యక్తే సృష్టికంతా ప్రతినిధిగా ఉంటాడు.

కొంత కాలం దాకా నేను మజామజాగా రాసుకుంటూ వెళ్ళాను. ఏమీ ఆలోచించకుండా కూడా. ఆ తర్వాతనే రచన చేయడం చాలా బాధ్యతతో కూడిన పని అని నాకనిపించింది. రచన చేయడం అంటే నిరంతరం మనలను వికసింప చేసుకుంటూ పోవడమనీ, మనం నిర్ధారించుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామనే సంతృప్తి ఎప్పుడూ పొందకూడదని మెల్లమెల్లగా తెలుసుకున్నాను. మీ నుంచి మీరు చాలా ఎక్కువగా డిమాండు చేస్తూ, ఆ డిమాండ్‌ను పూర్తి చేయలేని స్థితిలో ఉన్నప్పుడు మరింత గట్టిగా ప్రయత్నించి మీ మనోక్షితిజాన్ని విస్తరింప చేసుకోవడంలోనే నిజమైన సరదా, ఆనందం ఉండేవి, ఇప్పుడూ ఉన్నాయి. నేను రంగస్థలం కోసం రాస్తూ ఉండినందువల్ల నా సమస్య మరింత క్లిష్టమై పోయింది. నాటకంలో మీరు రాసే భాషకు, (visual space, దృశ్యమాన స్థలంలో ఉండేది) మాట్లాడే మాటకు (auditory space, శ్రవణ సంబంధి ఐన స్థలంలో ఉండేది) మధ్య ఉన్న తేడాను కూడా గమనించ వలసి ఉంటుంది. మీకు నాటకంతో ఎలాంటి సంబంధం ఉన్నా, ఇక్కడ space అంటే ఏమిటి అనేది మీకు తెలుస్తుంది. రంగస్థలంలో నింపడానికి రెండు 'స్పేసులు' ఉంటాయి. ఈ రెండూ భౌతిక వాస్తవాలే. ఒకటి దృశ్యాలతో నింపవలసిన స్టేజి పైని ఖాళీ స్థలం. రెండోది అక్కడ జరిగే సంఘటనలకు అర్థం ఇస్తూ శ్రవణ సంబంధి స్థలాన్ని నింపే ఒక భాషను సృష్టించడం. నేను 'సృష్టించడం' అనే పదం ఆలోచించే వాడాను. ఎందుచేతనంటే సూసాన్ సోంటాగ్ చెప్పినట్లు కళాసృష్టిలో ఉపయోగించే ఉపకరణాలన్నిటిలో అన్నిటికంటే కలుషితమైన, అన్నిటికంటే అశుద్ధమైన, అన్నిటికంటే ఎక్కువ నీరసించి పోయిన ఉపకరణం భాష. చరిత్ర క్రమంలో వచ్చి చేరిపోయిన అనేక అర్థాల భారం వల్ల భాష ఒక రకమైన ద్వంద్వార్థాలు కలిగి ఉండే స్థితిని చేరుకుంది. నాటకకర్త భాషను ప్రయోగించేప్పుడు రెండు పరస్పర విరుద్ధ అర్థ పరిధులతో తలపడుతూంటాడు. ఒకటి అతని స్వంత అర్థం. అంటే, అతడు పదాల ద్వారా ఏ అర్థం అందించాలనుకుంటాడు (లేక అందించకూడదను కుంటాడు), అనేది. రెండోది ప్రేక్షకులు వాటినుంచి ఏ అర్థం

గ్రహిస్తారు, అనేది. ఒక నాటకం ప్రదర్శింపబడినప్పుడు అది పూర్తిగా అనపేక్షితమైన, భిన్నమైన అర్థాలను సంతరించుకొని ఉపపాఠాన్ని (subtext) ను వెలుగులోకి తెస్తుంది. నేర్పరి అయిన నాటక కర్త మెలకువతో ఈ ఉపపాఠాన్ని, లేక ఉపపాఠాలను సృష్టిస్తాడు. అతడు భాషను ఇతర రకాలైన కథనాత్మక రచనలకంటే భిన్నమైన పద్ధతిలో ప్రయోగించే యోగ్యతను వికసింప చేసుకోవలసి ఉంటుంది. భాష భ్రమాత్మకంగా మారిపోయి ఉన్నప్పుడు 'మౌన మూలప్రతి' (silent script) లేక 'నిశ్శబ్దమైన మూలప్రతి'ని సృష్టించుకోవడమే తెలివైన పని. ఈ 'మౌన మూలప్రతే' ఉపపాఠం. నిశ్శబ్దాల్లో, ఖాళీ 'Space' లో లిఖిత పాఠంలో చెప్పకుండా వదలిపెట్టిన విషయాల్లో ఉండే ఈ ఉపపాఠమే నిజమైన నాటకం. ఒక మంచి నాటకకర్త నిస్సారమైన, అసంపూర్ణమైన, క్రమబద్ధం కాని సంభాషణలనుపయోగించి కూడా అర్థభరితమైన 'ఉపపాఠాన్ని' సృష్టించగలుగుతాడు. లిఖిత పాఠం క్రింద స్పందిస్తూ సుషుప్తావస్థలో పడి ఉన్న ఉపపాఠాన్ని గుర్తించడం, దానికి పుష్టి కలిగించడం, కొత్తదనంతో ప్రవేశపెట్టిన సైగల భాష సహాయంతో నటుల ద్వారా దానికి ప్రాణం పోయడం, వీటన్నింటికి సంబంధించిన విలక్షణ అనుభూతి కేవలం నాటకకర్తలకే దక్కుతుంది.

ఫ్రాస్ట్ అన్నాడు "కవిత ఆనందంతో మొదలవుతుంది, వివేకంతో ముగుస్తుంది" అని. రచన చేయడంలో ఆనందం నాకు ఇంకా కలుగుతూనే ఉంది. అయితే వివేకం ఎంత వచ్చిందో, నాకు తెలియదు. వివేక క్షితిజం రోజురోజుకు మరింత-మరింత వెనక్కి వెళ్ళిపోతున్నట్లనిపిస్తూంది. జీవితంలో కనీసం ఒక క్షణంపాటైనా, కనీసం ఒకసారైనా దాన్ని స్పర్శించగలగాలని మాత్రమే మనం కోరుకోగలం.

మరోసారి కే.కే. బిర్లా ఫౌండేషన్‌కు, చయన పరిషత్తు సభ్యులకు, మిత్రులు మీ అందరికి నా ధన్యవాదాలు.

**జీవితం, సాహిత్యం:**

శ్రీ మహేశ్ ఎల్‌కుంచ్వర్‌కు ఆయన నాటకం 'యుగాంత్'కు గాను 2002 సంవత్సర సరస్వతీ సమ్మాన్ ప్రదానం చేయడం జరిగింది. మరాఠీ రచనకు ఈ పురస్కారం లభించడం ఇది రెండోసారి. యాధృచ్ఛికంగా ఈ సారి కూడా ఈ భాషలోని నాటకాన్నే అందుకు ఎపికం చేయడం జరిగింది. 1993 సంవత్సరానికి ఇచ్చిన మూడవ సరస్వతీ సమ్మాన్ శ్రీ విజయ్ తెండుల్కర్ నాటకం 'కన్యాదాన్'కు ఇవ్వడం జరిగింది. మరాఠీ రంగస్థలానికి మన దేశంలో విశిష్ట స్థానం ఉందనేది నిర్వివాదాంశం. దీని బలమైన సంప్రదాయం శ్రేష్ఠ నాటకకర్తలను అందించింది. ఎల్‌కుంచ్వర్ ఈ రంగస్థలంతో సంబంధం ఉన్నవాడే కాదు, తన కృషితో దాన్ని లోతుగా ప్రభావితం చేసిన వాడు కూడా.

ఎల్‌కుంచ్వర్ 30 సంవత్సరాల కంటే ఎక్కువకాలం నుంచి నాటకాలు రాస్తున్నారు. ప్రసిద్ధ మరాఠీ సాహిత్య పత్రిక 'సత్యకథ'లో 1970లో ఆయన మొదటి ఏకాంకిక 'సుల్తాన్' వెలువడింది. అందులోని మౌలికత, శిల్పం సాహిత్య జగత్తును ఆశ్చర్యపరచాయి. శ్రీమతి విజయ మెహతాకు చెందిన 'రంగాయన్' అనే నాటక మండలి ఇతర నాటకాలతో పాటు దీన్ని ప్రదర్శించినప్పుడు సాహిత్యంలో, నాటకరచనలో ఒక కొత్త ప్రతిభ ఆవిర్భవించిందని అందరికీ తెలిసి వచ్చింది. 1987లో 'వాడా చిరేబందీ' అనే నాటకం ఆయన్ను జాతీయ స్థాయిలో ప్రతిష్ఠించింది. ఆ తర్వాత ఈ నాటకం సరస్వతీ సమ్మాన్ పొందిన 'యుగాంత్' అనే నాటకత్రయంలో భాగమయింది.

'యుగాంత్' మూడు నాటకాల గొలుసు. ప్రతి నాటకం వేరుగా ఉన్నట్లున్నా, సంపూర్ణంగా ఉంటుంది. 'యుగాంత్' ఒక గ్రామీణ భూస్వామ్య కుటుంబానికి చెందిన మూడు-నాలుగు తరాల కథ. ఒకప్పుడు సంపన్నమై ప్రభావం కలిగిన ఈ కుటుంబం మెల్లమెల్లగా పేదరికంలోకి జారుకుంటుంది. ఈ నాటకం ఈ కుటుంబ సభ్యుల సుఖదుఃఖాల కథ చెప్పడమే కాక దేశంలో గత 50-60 సంవత్సరాల్లో మారిన పరిస్థితులకు ప్రతినిధులుగా కూడా వారిని చిత్రిస్తుంది. సమాజంలో, కుటుంబంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులను, అందులో మారుతున్న స్త్రీ పరిస్థితిని, ఈ నాటకం గొప్ప మానవతా దృష్టితో మన ముందుంచుతుంది. నాటకం చివర ఎల్‌కుంచ్వర్ మనం ఏ దిశలో వేగంగా సాగి పోతున్నాము, అనే దాన్ని కూడా అర్థమయ్యేట్లు చేస్తారు. 'యుగాంత్' తన నిజాయితీతో, సంవేదనతో మన జీవితంలోని మంచిని, చెడును వెలుగులోకి తెచ్చే పూర్తి భారతీయ నాటకం. ఇందులోని కుటుంబం మానవ ప్రకృతి, మనషుల్లోని వేర్పాటు ప్రవృత్తి, నగరీకరణ, విలువల క్షీణత, ఆధునికత వల్ల కలుగుతున్న ప్రమాదాలు, వీటితో వచ్చిన సమస్యలు, వీటన్నింటినీ ఎదుర్కుంటూ మనుగడ సాగిస్తుంది.

## మహేశ్ ఎల్కుంచ్వర్‌తో రానా నాయర్ ముఖాముఖి

**రానా నాయర్ :** *నాటక కర్త మహేశ్, వ్యక్తి మహేశ్‌ను మా పాఠకులకు ఎలా పరిచయం చేస్తాడు?*

**మహేశ్ :** నేనొక చెప్పుకోదగ్గ స్తోమత కలిగిన భూస్వామ్య కుటుంబంలో పుట్టాను. నాలుగేళ్ళ వయసులో నా తల్లిదండ్రులను, నా ఊరిని, ప్రాంతాన్ని వదిలి నేను పెరిగి పెద్దయి చివరిదాకా జీవించిన పట్టణ జీవితంలోకి వెళ్ళవలసి వచ్చింది. నా మూలాలనుంచి విచ్ఛిన్నమైన నేను బాల్యంలో చాలా ఒంటరి జీవితం గడపవలసి వచ్చింది. బహుశా, అలాంటి ఒకానొక స్థితిలో నాతో నేను మాట్లాడడం మొదలు పెట్టి ఉంటాను. నాకు తల్లిని, తండ్రిని నేనే అయ్యాను. ఇప్పుడు వెనుకకు దృష్టి మళ్ళించి చూసి  అందులోనే నా నాటక రచన మూలాలు ఉన్నాయని చెప్పగలను. అంటే, నీ ప్రపంచాన్ని నీవే సృష్టించుకొనే, అందులో నీకు తెలిసిన లేక నీవు తెలుసుకోగోరిన పాత్రలను నింపుకొనే శక్తిలోనే ఈ రచనా మూలాలుంటాయి. ఇది మినహాయిస్తే నా బాల్యం సామాన్యంగానే గడిచింది. సైన్సులో, లెక్కల్లో బలహీనంగా ఉండడంవల్ల పొట్టపోసుకోడానికి రిక్షా లాగవలసి రావచ్చని అనేవారు. చాలా కాలం దాకా నన్ను నేను ఏ యోగ్యత లేనివాణ్ణిని, వ్యర్థుణ్ణిని, అనుకుంటూ ఉండేవాణ్ణి. ఆ భావన నన్ను కించపరచేది, అవమానపరచేది. అది నాలో ఇతరుల పైన దాడిచేసే గుణాన్ని నింపింది. ముఖ్యంగా నేను పెరుగుతున్న రోజుల్లో, అప్పట్లో కోపంతో నా భృకుటి ఎల్లప్పుడు ముడిపడే ఉండేది. అది ఎంతగా ఉండిందంటే ఇతరులు నా దగ్గరకు వచ్చి మాట్లాడడానికి బయపడేవారు. నాటకకర్తగా నేను కొంత సఫలత పొందిన తర్వాతగానీ ఇదంతా మారడం మొదలు కాలేదు. కొందరు ప్రజలు నా నాటకాలు చూస్తున్నారు, అనే భావన నాలో కొంత సౌమ్యత, సాత్వికత రావడానికి సహాయపడింది.

**రానా నాయర్ :** *నాటకం పట్ల ఆసక్తి ఒక శాంతించని ఆవేశం స్థాయికి చేరేంతగా మీలో ఎప్పుడు, ఎలా కలిగింది?*

**మహేశ్ :** కాలేజి చదువుకోసం నాగపూర్ వచ్చే వరకు నేను ఒక్క నాటకం కూడా చూడలేదు. అయితే నాకు సినిమాల పిచ్చి మాత్రం విపరీతంగా ఉండేది. అది కూడా మెట్రిక్ తర్వాత మొదలైంది. నేను సినిమాలు చూడడం, సంగీతం వినడం నిషిద్ధంగా భావించే కుటుంబం నుండి వచ్చిన వాణ్ణి. మెట్రిక్ తర్వాత నేను చాటుమాటుగా సినిమాలకు వెళ్ళడం మొదలు పెట్టాను. ఆ ప్రపంచంలో నాకు ఎంతో సాంత్వన, దానికి మించి సంతోషం లభించింది. అది పాటలతో, ఉల్లాసంతో నిండిన, దుఃఖం, దైన్యంలేని ప్రపంచం. అందులో ఎక్కడైనా బాధ, కష్టం ఉంటే అవి కూడా కళాస్పర్శతో రమణీయంగా తోచేవి. అలాంటి కల్పనా లోకంలో ఉండి పోవాలని ఎప్పుడూ కోరుకునే వాణ్ణి.

**రానా నాయర్ :** *మరి నాటకంతో మీ ప్రేమ వ్యవహారం ఎలా మొదలైంది?*

**మహేశ్ :** అందులో ఒక ప్రణాళికాబద్ధమైన ఆలోచనకంటే, యాదృచ్ఛికతే ఎక్కువగా ఉందని చెప్పాలి. కాలేజీ విద్యార్థిగా కూడా నాటకరంగంతో నాకు పెద్దగా పరిచయం లేదు. ఏవో కొన్ని వ్యాపార ప్రధానమైన నాటకాలు మాత్రం చూసి ఉంటాను అంతే. 1964లో ఎప్పుడో ఒక మిత్రునితో ఒక సినిమా చూడడానికి వెళ్ళాను. సినిమాకు టికెట్లు దొరకనందువల్ల మిత్రుడు అక్కడే ప్రదర్శింపబడుతున్న నాటకం చూద్దాం పద, అన్నాడు. మునుపు రెండు నాటకాలు చూశాము కదా. ఏముంది అందులో? ఎందుకులే, అని అతని సలహాను కొట్టిపడేశాను. తర్వాత అతని ఒత్తిడిపైన నాటకానికి వెళ్ళాను. విజయ మెహతా దర్శకత్వం చేసిన విజయ తెందుల్కర్ నాటక ప్రదర్శన జరుగుతూంది. కొద్ది నిముషాల్లోనే ఇది ఏదో కొత్తగానూ, వేరుగానూ, ఉత్తేజకరంగానూ ఉందే, అని నాకనిపించింది. సంభ్రమాశ్చర్యాలు నన్ను లోగొన్నాయి. నాలోని ఏవో తలుపులు తెరుచుకున్న అనుభూతి నాకు కలిగింది. స్టేజి మీద జరుగుతున్నదాన్నంతా ఆ రోజు పూర్తిగా అర్థం చేసుకోలేక పోయినందువల్ల ఆ మరుసటి రోజు కూడా ఆ నాటకం చూడడానికి  వెళ్ళాను. ఈ సారి దాన్ని సమాలోచనాత్మక దృష్టితో చూశాను. అందులో కొన్ని నమూనాలు, మూసలు, నిర్మాణాలు ఎలా ఉన్నాయి. నాటక రచయిత తాను చెప్పదలచుకున్న  అంశాన్ని ఎలా చెప్తున్నాడు. అనే వాటిని గమనించే ప్రయత్నం చేశాను. ఆ రోజే తెందుల్కర్ నాటకాలన్నీ చదవాలని నిర్ణయించుకున్నాను కూడా. ఒక సంవత్సరం పూర్తిగా నేను అనేక రకాల నాటకాలు తప్ప మరేమీ చదవలేదు. ఆ తర్వాత నేనే స్వయంగా ఒక నాటకం రాయాలని నిర్ణయించుకున్నాను. అది తెందుల్కర్‌కు నాసిరకం నకలు, అని మిత్రులన్నారు. అందువల్ల నేను దాన్ని చించిపారేశాను. ఇక నేను

రాయదలచుకున్న నాటకమే రాయాలని, తెందుల్కర్నుగానీ, మరెవరినిగాని అనుకరించకూడదనీ నిర్ణయించుకున్నాను. ఈ విధంగా 'సుల్తాన్' నాటకం వచ్చింది. అది ఒక మంచి నాటకమని నాకు అనిపించలేదు. అయితే ఒక మిత్రుడు 'సత్యకథ' (ప్రసిద్ధ మరాఠీ పత్రిక, ఇప్పుడు ప్రచురింపబడడం లేదు) కు పంపించాడు. అందులో అది మొదటి సారిగా అచ్చయింది. ఈ విధంగా 1970వ దశకం ఆరంభంలో కూడా నాటకరంగంలో పరమ సమ్మాన్య వ్యక్తిగా భావించబడుతూ ఉండిన విజయమెహతా దృష్టికి అది రావడం తటస్థించింది. 1969లో ఆమే ఈ నాటకాన్ని ప్రదర్శించే కోరిక వెలిబుచ్చినప్పుడు పులకించి పోయాను. ఆనందోత్కంఠితునడినయ్యాను. అంతేకాదు. గొప్పగా ఉబ్బిపోయాను కూడా. ఆ నాటకం గనక ఏదో ఒక మామూలు పత్రికలో ప్రచురింపబడి ఉంటే, నా నాటకాలు ప్రదర్శింపబడకుండానే ఉండి పోయేవేమో. ఈ విధంగా ఈ సంతోషకరమైన యాదృచ్ఛిక సంఘటన నన్నొక నాటక రచయితను చేసింది.

***రానా నాయర్:*** *'సుల్తాన్' ను, మీ మరికొన్ని తొలి నాటకాలను యథార్థవాద దృష్టితో రాసిన నాటకాలని అనవచ్చా?*

**మహేశ్ :** కాదు. 'సుల్తాన్' యథార్థవాద దృష్టితో రాసిన నాటకం కాదు. దాన్ని మీరు కావాలంటే ప్రతీకాత్మకమైన, లేక అంతకు మించి ఒక expressionist (బాహ్య వాస్తవికతను కాక ఆంతరంగిక అనుభూతిని నిరూపించాలనే వాదానికి సంబంధించిన) నాటకమని చెప్పవచ్చు. నా మొదటి నాలుగు నాటకాలు ఇలానే ఉన్నాయి. బహుశా ఈ కాలమే నేను ఇతర పాశ్చాత్య నాటక రచయితలతో పాటు స్ట్రిండ్ బెర్గ్, చెఖొవ్, లోర్కా, సార్త్రే, కామూల ప్రభావం గ్రహించి రచనలు చేసిన కాలమై ఉంటుంది. నేనెంత నిరోధించినా, ఈ ప్రభావాలన్నీ నా తొలి రచనల్లోకి దిగిపోయాయి. 'హోలీ' నేను రాసిన మొదటి యథార్థవాద నాటకం. 'హోలీ'కి ముందు నా నుడికారాన్నీ, నా రచనా విధానాన్నీ కనుగొనేందుకు నేను తడవులాడుకుంటూనే ఉండినాను. 'హోలీ' నాకు కావలసిన ఆత్మవిశ్వాసం ఇచ్చింది.

***రానా నాయర్ :*** *మీ నాటకానికి ఆలోచనా బీజం మీకెక్కడ దొరుకుతుంది? ఒక నాటకం మీ మెదడులో ఎలా రూపుదాల్చడం ఆరంభిస్తుంది?*

**మహేశ్ :** ఇది నాకు బోధపడని విషయం. అది ఎలా జరుగుతుందో నాకు తెలియదు. అన్ని సందర్భాల్లోనూ ఒక రకమైన ఆకారం, ఒక బింబం దాని ప్రక్రియను ప్రారంభింప జేస్తుంది. చివరకు అది ఒక నాటకంగా రూపొందుతుందా లేదా అనేది అప్పుడు తెలియక పోయినా కూడా. ఈ మధ్యలో వచ్చిన నా నాటకాల్లో ఒక దాన్ని గురించి చెప్తాను. నేను రవీంద్ర సంగీతం వింటూ ఉన్నాను. దేవుణ్ణో, మృత్యువునో, లేక రెండింటినో సంబోధిస్తూ రాసిన చాలా అందమైన పాట, అందులోని రెండు పంక్తులు నా మనసుకు గట్టిగా హత్తుకుపోయాయి. మరుసటి రోజే నేను మృత్యుముఖానికి చేరుకున్న ఒక మనిషి జీవితాన్ని గురించి నాటకం రాయడానికి కూర్చున్నాను. నన్ను నమ్మండి. నేను మొదలు పెట్టినప్పుడు అందులో ఎన్ని పాత్రలుంటాయో, ఆ పరిస్థితి చివరకు ఏ రూపం దాలుస్తుందో, నాకు తెలియదు. 'విరాసత్' కూడా అలాగే సత్యదేవ్ దూబేతో మాట్లాడుతూ కూర్చున్నప్పుడు నాకు స్ఫురించింది. స్వంత ట్రాక్టరు ఒకటి ఉన్నా, దాన్ని ఎప్పుడు ఉపయోగించని ఒక భూస్వామ్య కుటుంబాన్ని గురించి ఆయన చెప్పాడు. క్రమంగా ఆ ట్రాక్టరు ఇంటి ముంగిటనే ఉంటూ జీర్ణించిపోయింది. దానితో పాటు ఆ కుటుంబం కూడా. ఈ విషయమే 'విరాసత్' రాయడానికి ప్రేరేపించింది.

***రానా నాయర్ :*** *భారతదేశంలోని సమకాలీన నాటకరంగ స్థితిగతులు మీకు ఉత్సాహకరంగా కనిపిస్తాయా?*

**మహేశ్ :** అవును. పరిస్థితి చాలా గతిశీలంగా, ఆశావహంగా ఉందనే చెప్పాలి. కొత్త పార్శ్వాలను అన్వేషించడం జరుగుతూంది. కొత్తమార్గాలు, దృశ్యాలు ఆవిష్కరింప బడుతున్నాయి. హఠాత్తుగా మనకు మణిపూర్లో రతన్ దయమ్ కనిపిస్తున్నారు. చండీగఢ్లో నీలమ్ మాన్‌సింగ్ కనిపిస్తున్నారు. బెంగుళూరులో జయశ్రీ కనిపిస్తున్నారు. తిరువనంతపురంలో ఫణిక్కర్ కనిపిస్తున్నారు. భోపాల్లో బంసీకౌల్ కనిపిస్తున్నారు. ఇదంతా కలిసిన నాటకరంగం అద్భుతంగా ఉంటుంది. పూర్తిగా భిన్నంగా కూడా ఉంటుంది. ఇది గొప్ప నాటకీయమైన దృశ్యం. వీళ్ళంతా ఈ ప్రాంతీయ కేంద్రాల్లో చేస్తున్న ప్రయోగాలు తప్పనిసరిగా పరస్పరం బలాన్నిస్తూ సాగిపోతాయి. సమకాలీన నాటకరంగం మరోసారి ఉన్నతి దిశగా సాగడం ఆరంభించింది. త్వరలో ఒక పునరుజ్జీవనమే జరగబోతూందేమో ఎవరు చెప్పగలరు?

# రత్నత్రయ సందేశము



- బి.యస్.యల్. హనుమంత రావు

మానవునిలో అంతర్గతంగా ఉండే హేతువు నుండే 'మతం' ఉద్భవించింది. ప్రకృతి వైపరిత్యాల తాకిడి నుండి రక్షించుకోవటానికి ఆదిమానవుని మేధ తాపత్రయపడింది. వైపరిత్యాల కారణాలను పరిశీలించి రక్షణకై శోధించిన మానవ సామర్థ్యం మతాన్ని రూపొందించింది. భూమిపై మానవుని సుఖజీవనానికి ఉద్దేశించిన అద్భుత సృష్టే మతం. కాలక్రమంలో అన్ని వ్యవస్థలకు పట్టినచీడ మతానికి కూడ సోకింది. మతము ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసికొని పీడించే స్వార్థపరుల సొత్తు అయింది. ప్రజాజీవితాన్ని సుగమము, సుఖమయము చేయవలసిన సాధనం పీడించి అణగద్రొక్కే పాశవిక ఆయుధంగా రూపాంతరం చెందింది. అటువంటి పరిస్థితులు తలెత్తినప్పుడల్లా జొరాస్టరు, గౌతమ బుద్ధుడు, జీసను క్రీస్తు, మహమ్మదు, శంకరాచార్యుడు మున్నగు ప్రవక్తలు ఉద్భవించి, తమదైన పంథాలో మార్గనిర్దేశకులైనారు. సుఖము, ఉదాత్తము అయిన జీవన విధానాన్ని రూపొందించి మతాన్ని పునరుద్ధరించారు.

ప్రపంచంలో అతి ప్రాచీనము ఉదాత్తము అయిన మతాలలో 'బౌద్ధం' ఒకటి. ప్రగతి దిశలో సంఘాన్ని నడిపించే తాత్విక చింతన బౌద్ధం. నిజానికి బౌద్ధం 'జీవిత దర్శనం', బౌద్ధధర్మ ప్రవక్త అయిన గౌతమ బుద్ధుడు క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో జీవించాడు. అప్పుడు భారత జనజీవితం అతలాకుతలంగా ఉంది. నైతికంగా, సామాజికంగా పతనావస్థలో ఉంది; జాతి వైషమ్యాలు సామాజిక అసమానతలు సంఘాన్ని పీడిస్తున్నాయి. రాజకీయంగా, ఆర్థికంగా సంక్లిష్ట పరిస్థితి నెదుర్కొంటున్నది. మతం బలిపీఠం అయింది; మూఢ విశ్వాసాలకు భయంకరమైన ఊహలకు ఆటపట్టయింది. క్రూరమైన ఆలోచనలకు, ఆచరణకు వ్యతిరేకంగా స్పష్టంగా నిర్దుష్టంగా బుద్ధుడు తన గళాన్ని విప్పాడు. మానవ జీవితాన్ని సంపూర్ణంగా పునర్వ్యవస్థీకరించే హేతుబద్ధమైన జీవన విధానాన్ని జాతిముందుంచాడు. అప్పటికి లభ్యమైన తాత్విక చింతనను – అనుభవాలను సమన్వయించి సమకాలీన సమస్యలకు సమాధానంగా దర్శనంగా రూపొందించాడు. అన్ని గొప్ప మతాలకు పట్టిన దుర్గతే బౌద్ధానికి కూడా పట్టింది. కాలక్రమంలో బుద్ధుని ఉపదేశాలకు వక్రభాష్యాలు వెలిసినాయి. అతని మౌలిక ఉపదేశాలకు బౌద్ధులు, బౌద్ధులు కానివారు కూడ అన్యాయం చేశారు. దురాశాపరులైన పూజారులు, నీతి బాహ్యులైన రాజులు, రాజకీయవేత్తలు ఈ నాటకంలో ప్రధాన దుష్ట పాత్రధారులు. ఉదా: మధ్య ఆసియాలోని భయంకర రక్త పిపాసుడైన చెంఘీజ్‌ఖాన్ కూడా బౌద్ధమతస్థుడే అనే స్థాయికి ఈ నాటకం చేరింది. అవధులు లేని ప్రేమ, కరుణల మతమైన బౌద్ధానికి ఇంతకు మించిన అన్యాయం ఉండదు! తరువాత కాలంలోని బౌద్ధమత వ్యతిరేకులు తథాగతుని గురించి, బౌద్ధమతాన్ని గురించి దుష్ప్రచారం చేశారు. 'బుద్ధిహీనుని', 'మందబుద్ధిని' బుద్ధ శబ్దానికి పర్యాయ పదాలుగా వాడారు. జ్ఞానం బుద్ధిహీనతగాను, అజ్ఞానం బ్రహానందంగాను, గుర్తించటం ఎంతటి ఆశ్చర్యకరమైన పరివర్తన! దురాశపరులు, స్వార్థపరులు సుఖసౌఖ్యాలతో తులతూగటానికి సామాన్య జనులు అజ్ఞానం అంధకారంలో ఉండటం అవసరం. బుద్ధుడు ప్రజల అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానవంతులను చేయాలని ప్రయత్నించాడు. దీనితో అవకాశవాదులు స్థానం కోల్పోయారు. అందుచేతనే బుద్ధునిపై, బౌద్ధమతంపై వారి ఆగ్రహం, దుష్ప్రచారం.

---

*బి.యస్.ఎల్. హనుమంతరావు (1924 -1993), ప్రఖ్యాత చరిత్ర కారులు, విశ్లేషకులు.*

బుద్ధుని జీవితమూ, ఆయన జీవితంలోని విశిష్ట సంఘటనలు అందరికీ తెలిసినవే. కాని ఒక ముఖ్యమైన విషయంపై అందరూ మరింత అవగాహనతో దృష్టి కేంద్రీకరించాలని నా అభిప్రాయము. అది బుద్ధుని మహాభినిష్క్రమణ – పదవీ త్యాగం. నేటి రాజకీయ వేత్తలు ప్రజాసేవ చేయటానికి అధికారాన్ని ఆశిస్తున్నారు. హస్తగతం చేసికోవాలని అన్ని మార్గాలు త్రొక్కుతున్నారు. జ్ఞాని అయిన సిద్ధార్థునికి అధికార పరిధులు తెలుసు. మానవసేవకై సింహాసనాన్ని త్యజించాడు. నిజంగా ప్రజాసేవాతత్పరతే నేటి రాజకీయవేత్తల ఆశయమైతే గౌతమ బుద్ధుని జీవితం నుండి ఈ ఉత్తమ పాఠాన్ని నేర్వటం చాల అవసరం ("అధికారం అవినీతికి మార్గం. సర్వాధికారం సర్వత్రా అవినీతినే మిగులుస్తుంది" – అని ఆక్టన్ ప్రభువు అంటాడు. సుమతీ శతక కారుడు అధికార వ్యాధి పీడితుడు, బధిరుడు, అంధుడు అవుతాడని పేర్కొంటాడు).

గౌతమ బుద్ధుడు ఆచరణ బద్ధుడైన దార్శనికుడు. మానవాళి తక్షణ అవసరాలపై దృష్టి కేంద్రీకరించాడు. తన దర్శనంలో తర్క వితర్కాలకు, వితండవాదనకు తావు ఇవ్వలేదు. బౌద్ధం నీతిశాస్త్రం, తర్కశాస్త్రం, మనోవిజ్ఞానాల సమన్వయ ఫలితంగా ఆవిర్భవించిన దర్శనము అని రాధాకృష్ణ పండితుడు పేర్కొన్నాడు. నిజమైన దర్శనానికి అంతిమ లక్ష్యం 'మరణము కాదు – ప్రాణము'. 'భగవంతుడు కాదు – మానవుడు' అని బుద్ధుడు గుర్తించాడు. 'మజ్జిమనికాయ'లో బుద్ధుడు మాలుంక్య పుత్రునికి ఇలా చెబుతాడు. 'సృష్టి, పరలోకము, దైవము, నిత్యము (eternal) మున్నగు సమస్యలన్నిటికీ వివరణలు లభించినప్పటికీ ప్రపంచంలో దుఃఖము, బాధ, వృద్ధాప్యము, నిస్పృహ, మరణము మున్నగు సమస్యల పరిష్కారం లభించదు. విషబాణ పీడితునికి బాణాన్ని తీసివేసి బాధోపశమన చర్యలతో చికిత్స చేయటమే వైద్య నిపుణుని కర్తవ్యము. ఆ వ్యక్తి పేరు, కులము, మున్నగు వివరాలతో కాలహరణము చేయతగదు. అదే విధముగా నిజమైన దార్శనికుడు దుఃఖము, బాధల నుండి మానవుని విముక్తుని చేయాలి."

బుద్ధుడు ఎంత యథార్థవాదో అంత ఆశావాది. మానవుని భవిష్యత్తుపై అతనికి ఎంతో నమ్మకం. మానవుని ఋజువర్తనపై అతనికి అచంచల విశ్వాసం. దళారి అయిన పూజారి అవసరం లేకుండా, శిక్షించబడతాననే భయం లేకుండా, ఏ బహుమతినీ ఆశించకుండా తన నిర్వాణాన్ని మానవుడు సాధించుకోగలడని బుద్ధుడు చెప్పాడు. తన భవిష్యత్తు నిర్దేశకుడు వ్యక్తేనని చెబుతూ ప్రపంచాన్ని చెదలా పీడిస్తున్న దుఃఖానికి, బాధకు కారణాన్ని నివారణను కనుగొన్నాడు. అయితే దుఃఖానికి హేతువేమిటి? మానవుడు బాధనుండి నివృత్తి ఎందుకు పొందలేక పోతున్నాడు? బుద్ధుడు పలాయనవాది కాదు. ప్రపంచాన్ని ఆవరించి ఉన్న దుఃఖము, బాధ 'మిథ్య' అని తన పృచ్ఛకులను తలాయించలేదు. సత్యాన్వేషి కనుక మానవజీవితంలోని వికారాలను నగ్న సత్యాలుగా గుర్తించాడు. కారణాలను లోతుగా శోధించి పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు. అతని సమాధానం 'అవిద్య' (అజ్ఞానం) అన్ని చెడులకు, పాపాలకు కారణం. అజ్ఞానాన్ని జయించటమే పరిష్కారం.

బుద్ధుడు హేతువాది. కార్యానికి కారణం ఉంటుంది. చర్యకు ప్రతిచర్య ఉంటుందన్న గ్రహింపు గలవాడు. ఋజువర్తనతో మంచికార్యాలను ఆచరించటం ద్వారా మానవుడు జీవన స్థాయిని పెంచుకోగలడు; లక్ష్యాన్ని చేరగలడు; బాధ నుండి విముక్తుడు కాగలడు అని చెప్పాడు. వ్యక్తి ఔన్నత్యానికి చాలా సులువైన నైతిక సూత్రాలను, అష్టాంగ మార్గాన్ని బోధించాడు. అష్టాంగ మార్గాన్ని క్లుప్తంగా శీలము, సమాధి, ప్రజ్ఞ అను మూడు ప్రధాన సూత్రాలుగా పేర్కొనవచ్చు. శరీర వాంఛలను అదుపులో ఉంచటం (శీలము), మనో చాంచల్యాన్ని అదుపు చేయటం (సమాధి) ద్వారా మానవుడు జ్ఞానాన్ని (ప్రజ్ఞ) పొందగలడు. ప్రజ్ఞావంతుడు కావటమే అజ్ఞానాన్ని (అవిద్య) జయించటం. అట్టి మానవుడే 'అర్హతుడు' అంటే నిర్వాణాన్ని పొందిన వాడు. నిర్వాణాన్ని పొందిన వ్యక్తి అన్ని కర్మల నుండి విముక్తుడు అవుతాడు. అద్వయాన్ని గ్రహించిన ఆనందస్థాయియే నిర్వాణము. అన్ని ప్రాణులను బంధించే మౌలిక సూత్రం 'జీవము'. జీవము అవిభాజ్యము. ఆ గ్రహింపే అద్వయము. అప్పుడే మానవుడు ఇతర ప్రాణులతో తాదాత్మ్యం పొందగలడు. ఆ మానసిక స్థితే 'కరుణ' పెల్లుబకటానికి కారణం అవుతుంది. కరుణ న్యాయాలకెల్లా న్యాయం. మానవజాతి మనుగడకు కరుణే ఆధారము.

బౌద్ధమతం అంధ విశ్వాసాలతో విద్వేషాలతో కూడిన మార్గం కాదు; ప్రేమ, జ్ఞానం నిండిన మార్గం. ఆత్మత్యాగము, ఆత్మన్యూనత దాని లక్ష్యం కాదు. వ్యక్తిత్వ వికాసము,

ఔన్నత్యము దాని లక్ష్యం. ఆ ఉన్నత మార్గాన్ని అనుసరించి అంతిమ లక్ష్యమైన నిర్వాణాన్ని పొందటానికి కులము, వర్ణము, ఏ మతము, వృత్తి ప్రతిబంధకాలు కావు. ఇతర మతాలపై అసహనము, విద్వేషము బౌద్ధమతంలో లేవు. మ్లేచ్ఛ , కాఫర్ మతవిరోధి–ద్వేషి వంటి పదాలు బౌద్ధ నిఘంటువులో లేవు.

తాను నిర్దేశించిన మార్గము చాల కఠినమైనదని బుద్ధునికి తెలుసు (సుత్తనిపాత) విజయానికి అడ్డదారులు, దొడ్డిదారులు, డొంకదారులుండవని బుద్ధుని ఉపదేశము. అదే సమయంలో తాను చూపిన మార్గవిషయమై అతడు మొండిపట్టు కలవాడు కాదు. తన శిష్యగణాన్ని బుద్ధుడు ''అధికారంతో ఆదేశించిన దానిని తు.చ. తప్పక ఆచరించవలసిన పనిలేదు" అని హెచ్చరించాడు (ఆధునిక విజ్ఞానశాస్త్ర పితగా గుర్తించబడిన బేకన్ కూడ ఇలాంటి హెచ్చరికనే చేశాడు). "స్వర్ణకారుడు బంగారాన్ని కొలిమిలో వేసి నాణ్యాన్ని నిర్ధారించినట్లు ఏ ప్రవచనాన్నయినా మీ అనుభవమనే కొలిమిలో వేసి చూడండి. మీకు సమాజానికి ఉపయోగపడుతుంది అనే నమ్మిక కలిగినప్పుడు మాత్రమే ఆ ప్రవచనాన్ని నమ్మండి" అన్నాడు. కల్లబొల్లి ఊహలతో ఎవరూ స్వచ్ఛతను పొందలేరు అని 'సుత్తనిపాత'లో వివరిస్తాడు. చివరి ప్రవచనమైన 'మహా పరినిబ్బానసుత్త'లో బుద్ధుడు ఇలా చెబుతాడు: 'మీ నిర్వాణాన్ని మీరే నేర్పుగా, సున్నితంగా రూపొందించుకోండి. ఇతరుల సహాయ సహకారాలు ఆశించవద్దు. ఓ భిక్షులారా! మీ జ్ఞానజ్యోతిని మీరే వెలిగించుకోండి." ఏ కాలంలోనూ, ఏ మతప్రవక్త ఇంతటి హేతుబద్ధమైన ప్రవచనాన్ని వెలువరించలేదు.

బౌద్ధదార్శనికతనంతటినీ 'రత్నత్రయా'ల రూపంలో వెల్లడించవచ్చు.

*బుద్ధం శరణం గచ్ఛామి*
*ధమ్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి*

"నేను దళారులైన పూజారులను ఆశ్రయించను. అంధ విశ్వాసాలకు బందీని కాను. జ్ఞానమును, జ్ఞానవంతుల శరణు జొచ్చెదను."

''నేను క్రతువుల, యజ్ఞాలను ఆచరించను; న్యాయానికెల్లా న్యాయమైన ధర్మానికి సర్వవ్యాపిత కరుణకు విధేయుడనై ఉంటాను."

"నేను ప్రార్థనలకై దేవాలయాలకు పోను. తపస్సుకై అరణ్యములు చేరను. నా సహచర మానవుల సంఘటిత శక్తిని శరణు వేడెదను. తాదాత్మ్యత పొందెదను."

ఈ విధంగా బుద్ధుడు హేతువు, జ్ఞానాల ప్రాధాన్యతను గుర్తించాడు, వివరించాడు. మూఢవిశ్వాసము, అజ్ఞానము, భయము అనే ఊబి నుండి నైతికతను ఉద్ధరించాడు. స్వర్గము దైవముల నుండి నిజజీవితాలవైపు మానవుని దృష్టి మళ్ళించాడు. స్వశక్తిపై మానవునికి నమ్మకం కలిగించాడు. జీవితాన్ని పున్నర్మించుకోవటానికి అవకాశం కల్పించాడు. ఋజువైన, ఉన్నతమైన జీవితంపై ఆశను రేకెత్తించాడు. సుఖమయ జీవితాన్ని సాటి మానవులతో పంచుకునే నైతిక సామర్థ్యాన్ని పెంపొందించాడు.

2,500 సంవత్సరం నాటి దర్శనమైనప్పటికీ, 'రత్నత్రయం' ప్రతిపాదించిన జీవన విధానం ఆధునిక మానవుని ఆశలు, ఆశయాలకు అనువుగా తీర్చిదిద్దబడింది. 1. బౌద్ధం ప్రజాస్వామిక విలువలున్న దర్శనం. సమతా సమాజాన్ని ప్రతిపాదించింది. ధనిక – పేద, ఉన్నత–అధమ, మతస్థులు – మతద్వేషులు. Trusted-Trustees, Thesis-Antithesis అనే కృత్రిమ విభజనలకు అందులో తావులేదు. వ్యక్తిని దైవానికో, ఆర్థిక వ్యవస్థకో బానిసను చేయదు. వ్యక్తిత్వ వికాసమే దాని ప్రాతిపదిక. 2. హేతువు విజ్ఞాన శాస్త్రము బౌద్ధానికి పునాదులు. అసంబద్ధ ప్రమాణాలతో కూడిన వాఙ్మయాన్ని తృణీకరించింది. హేతువు, అనుభవము జీవితానికి మార్గదర్శకంగా పేర్కొంది. ప్రగతిపై విశ్వాసాన్ని కలిగించింది. 3. బౌద్ధం ఏకైకము, అవిభాజ్యము అయిన మానవ బంధాన్ని ధ్రువపరిచింది. మానవతా దృక్పథాన్ని స్పష్టం చేసింది. 4. దాని నుండి ఉద్భవించిన 'కరుణ' క్లిష్టమైన ప్రపంచ శాంతి సమస్యను తొలిగిస్తుంది.

రత్నత్రయం ప్రతిపాదించిన జీవన విధానం జ్ఞానం, హేతువు, ప్రేమ, కరుణ, శాంతితో కూడి ఉన్నది. అజ్ఞానం, మూర్ఖత్వం, అంధ విశ్వాసం, ద్వేషాలకు అందులో తావులేదు. రత్నత్రయ మార్గం మానవ జాతికి నాగరిక జీవన విధానాన్ని ప్రతిపాదిస్తుంది. అందుకే ప్రస్తుత పరిస్థితులలో మానవాళి శ్రేయస్సుకు పురోగతికి, మరే యితర జీవన విధానానికన్నా రత్నత్రయ మార్గం అనుసరణీయం.



# ఉదగ్ర చేతన

అది ఎక్కడుంది?
ఎక్కడో కాదు ఇక్కడే.
నీ చుట్టు పక్కనే నీలోనే.
అది నీ చూపుల్ని
తప్పించుకుపోతున్నట్టు అనిపించినా
నీతోనే వుంటుంది
నీ నీడలా వుంటూనే నిన్ను తన గుప్పిట్లో
పొదుగుకుంటుంది.
నువ్వు తీసుకునే శ్వాసలో అల్లుకుపోయి
నీ ఒంటినిండా వ్యాపిస్తుంది.
నిశ్శబ్దంగా వున్న నీ ఆలోచనల తీగలను
మెత్తమెత్తగా మీటుతూ
ఝుంకృతుల కృతులను రూపొందిస్తుంది.
గగనాన్ని తన దోసిట్లో తీసుకొచ్చి
నీకు కానుకగా అర్పిస్తుంది.
ఉత్సుకత ఉద్గమిస్తే అది
సూర్యకిరణాల మీద స్వారీ చేస్తూ
విశ్వమంతా స్వచ్ఛంద విహారం చేస్తుంది.
మోజు పుడితే చంద్రబింబాన్ని
చేత పట్టుకుని బంతిలా ఎగరేస్తుంది.
ఇంతకూ ఎవరది?
అది ఏ లౌకిక శక్తీ కాదు
ఏ దైవిక నియుక్తీ కాదు.
నీలో నిండి వున్న అగోచర చేతన.
బహుముఖీన ప్రచలనం దానిది.
మెల్లగా సాగినా
కల్లోలిత తరంగంలా చెలరేగినా
అది కోరుకునేది నీ నిరంతర ప్రగతినే.
ఏ రూపంలో వున్నా
ఎవరికైనా
అలాంటి ఉదగ్రచేతన
ప్రతిక్షణ వాంఛనీయ ప్రబల సాధన.

**డా. సి. నారాయణరెడ్డి**

# ఉగ్రకాళి



చుక్కలాకాశాన
నక్కి దాక్కున్నాయి
కారుమబ్బులు రెచ్చి
గోరాడుతున్నాయి
గాఢాంధకారమ్ము
కమ్మిజడిపిస్తోంది
గర్జించి ఉన్మత్త
ఘనఘోరలయ ఝంఝు
శతలక్ష జీవులను
సంహార మొనరించి
వేళ్ళతో పెకలించి
వృక్షాల పడదోసి

దారులను నిరవరో
ధములుగా మార్చేసె
నీలాలనింగిపై
అలలెత్తి చెలరేగి
ఉద్వేల జలరాశి
ఉర్రూతలూగింది
అన్ని దిక్కులనుంచి
అశుభ సంకేతాలు
మట్టుబెట్టగ భువిని
చుట్టుముడుతున్నాయి
వేలరూపాలతో
విలయతాండవ కేళి

ఉగ్రకాళీ మాత
హుంకరిస్తున్నాది
రాజనని! రాజనని!
రావె జగదంబికా!
బీభత్స మూర్తివై
మృత్యు నిశ్వాసివై
పదఘట్టనల జగతి
కదలి గడగడ లాడ
సర్వ విధ్వంసినీ
సమయాధి దేవతా
రాజనని! రాజనని!
రా ఉగ్రకాళికా!

మూలం : **స్వామివివేకానంద**
అనువాదం : **గజ్జెల మల్లారెడ్డి**




# కృష్ణదేవరాయల తిరుమల సందర్శనలు, దానాలు

*- దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి*

కృష్ణదేవరాయల పట్టాభిషేకం జరిగి 500 సం॥లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు జరుగుతోన్న ఏడాది ఇది. ఈ సందర్భంగా తిరుమల వెంకటేశ్వరుని సందర్శనకు కృష్ణరాయలు ఎందుకు వచ్చాడు, ఎప్పుడు వచ్చాడు, ఎవరెవరితో వచ్చాడు, ఎలాంటి దానాలు చేశాడు, ఎవరెవరు దానాలు చేశారు, ఆలయం ఆభరణాలు ఎలా నిర్వహించబడేవి, ఈ వివరాలన్నీ ఎందులో ఉన్నాయి అనే విషయాలు తెలుసుకోవాలంటే ఈ వ్యాసం చదవాల్సిందే.

కృష్ణదేవరాయలకు సింహాసనం అధిష్టించడంలో సమస్యలు ఏర్పడడం, విజయనగర ప్రధానమంత్రి సాళువ తిమ్మరుసు అందులో సహాయపడడం, బహుమనీలతో రాయచూరు యుద్ధం చేయాల్సి రావడం, ఒరిస్సా గజపతులతో మూడు దశల్లో యుద్ధాలు చేయాల్సి రావడం, కంచి పరిసర శంభువరాయుళ్ళతో సమస్య, మైసూరు గాంగులతో సమస్య, పోర్చుగీసు వారితో సంబంధాల సర్దుబాటు, కుమారుడు తిరుమల మహారాయలు జన్మించిన ఆనందం, ఎనిమిదేండ్లకే కుమారుడు మరణించడం, తన అనారోగ్యం, తన ఘనకార్యాలన్నింటికీ కారణమైన శ్రీ వేంకటేశునికి కృతజ్ఞతలు తెల్పడంకై సందర్శించాలని, అది తన విధి, ధర్మమని భావించడం, అన్నింటికీ మించి శ్రీ వేంకటేశునిపై గల భక్తి, అన్నీ కలసి కృష్ణరాయలు తిరుమలేశుని సందర్శించేట్లు చేశాయి. ఈ భక్తే ఈతడిని ఉపవాసాలు ఉండేట్లు, ఆముక్తమాల్యదను శ్రీ వేంకటేశునికి అంకితం ఇచ్చేట్లు చేసింది.

కృష్ణరాయలు ఏడు పర్యాయాలు తిరుమలేశుని సందర్శించాడు. క్రీ.శ. 1513లో మూడు పర్యాయాలు, ఆ తరువాత క్రీ.శ. 1514లో 1517లో, 1518లో, 1521లో సందర్శించాడు. ప్రతి సందర్శన కాలంలోనూ తిరుమలేశునికి విరివిగా దానాలు చేశాడు. అంతేగాక క్రీ.శ. 1515, 1524 సం॥లో తిరుమలకు రాకుండానే దానాలు చేశాడు. ఈతని రాణులు చిన్నాదేవి, తిరుమలదేవిలు కూడా దానం చేశారు. వీరి మంత్రులు, అధికారులూ దానాలు చేశారు.

వీరితోబాటు జీయర్లు, మేధావులు, ఏకాంగులు, వ్యాపారులు సామాన్యులు, స్త్రీలు కూడా దానాలు చేశారు. చిన్నాదేవి, తిరుమలదేవి, రాజపురోహితుడు యజ్ఞ నారాయణ దీక్షితర్, ఆతని తండ్రి రంగదీక్షితర్, శాసనాలు చెక్కే శ్రీపతి, ఊడిగం సేవకుడు బంగారు మల్లరాసు రాయలతోబాటు తిరుమలకు వచ్చేవారు.

కృష్ణరాయలు తిరుమలలో చేసిన దానాల గురించి, ఇతర ఘనకార్యాల గురించి ఆలయ, ఆభరణాల నిర్వహణ గురించి అచట శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇవి ప్రధానంగా క్రీ.శ. 1513-1521 మధ్యకాలానికి చెందినవి. క్రీ.శ. 1524, 1527, 1530ల నాటి శాసనాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇవన్నీ తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో, నందినాగరిలోను వున్నాయి. భక్తులు చూడడంకై ఇన్ని భాషల్లో చెక్కబడ్డాయి. గిండి బసవరాయలు గాని, బంగారు మల్లరాసు గాని వీటి లేఖకులుగా తెలుస్తోంది. ఆలయానికి శాశ్వత వనరులు

డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, సెల్ : 9849584324

సమకూర్చడమే దానాల లక్ష్యంగా ఉండేది. ఈ వనరుల నుండే ఆలయ సేవలకు చెల్లింపులు ఉండేవి (పాత ఆలయాల పునరుద్ధరణ, రాజగోపురాల నిర్మాణం కూడా దానాల లక్ష్యంగా ఉండేది). దానాలలో ఆభరణాలు, ఇతర బహుమానాలు, గ్రామాలు, ప్రాంతీయ పన్నుల ఆదాయంలో భాగం, ప్రజోపయోగ కార్యాలైన ఆలయ భూములకు కాలువలు త్రవ్వడం, చెరువులు నిర్మించడం వంటివి, నిత్యాన్నదాన కార్యక్రమాలు వంటివి కూడా లక్ష్యాలుగా ఉండేవి.

ఇక, నాటి తిరుమల ఆలయ నిర్వహణ, నీతినియమాలు, సత్ప్రవర్తన, దైవచింతన గలవారు, లాభాపేక్ష లేని, సత్కార్యాలు చేసే సన్మార్గులు, తిరుపతి ప్రాంత వైష్ణవ బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులైన సత్తాద వైష్ణవులు (అప్పటికి హిందూమతంలోని వైష్ణవ, శైవ తెగ భావాలు ఇంకా పూర్తిగా అదృశ్యం కాలేదు), అందునా ప్రధానంగా ఎలాంటి బాదరబందీలు లేని, ఆర్థిక ప్రలోభాలకు లొంగే అవసరంలేని ఏకాంగులు (ఏకాకిలు) అనబడిన ఒంటరి సన్యాసులు (సేవాతత్వం గలవారు), లేదా వివాహితులు, లేదా రెండు రకాలవారి ఆధీనంలో ఆలయం నిర్వహించబడేది. ఇలాంటి వారిలోనే ఆలయ నిర్వహణ జరగాలని పూర్వం రామానుజాచార్యులు నిర్దేశించినట్లు నాడు నమ్మేవారు. అయితే, ఆలయంలో పెద్ద తప్పిదం జరిగిందని ఫిర్యాదు వచ్చినప్పుడు, లేక ఇతర మార్గాల ద్వారా ప్రభుత్వ దృష్టికి వచ్చినప్పుడు ఆలయ విషయాల్లో ప్రభుత్వం కల్పించుకొనేది. ఆలయం, ఆభరణాలు, అన్నదాన రామానుజకూటాల నిర్వహణ విషయాలు ప్రభుత్వం ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండేది. ఆలయ నిర్వహణ విషయంలో ప్రభుత్వం ప్రత్యక్షంగా కల్పించుకోకపోయినా ఆభరణాలు, రామానుజకూటాల నిర్వహణలకై ప్రభుత్వమే నియామకం చేసేది. ఉదాహరణకు కృష్ణరాయల అన్న విజయనగర పాలకుడైన సాళువ వీర నరసింహరాయలు తన ఆచార్యుడైన కందాడై రామానుజ అయ్యంగార్‌నే ఆలయ ఆభరణాల నిర్వహణకు, రామానుజకూటాల నిర్వహణకు నియమించాడు. ఈతని కాలంలోనే ఆలయ పూజారి (నంబి) సిర్రప్పయ్యన్



దేవేరులతో రాయలు

కుటుంబీకులు ఆలయ ఆభరణాల్ని దొంగిలించగా వీరనరసింహరాయలు అతనిని కఠినంగా శిక్షించడమేగాక, తిరుమల – తిరుపతిలలో ఆతనికి గల రెండు గృహాల్ని, ఇంటి స్థలాలను ఆలయానికి స్వాధీనపరచాడు, ఆ కుటుంబీకులు పూజా సేవల నుండి బహిష్కరించబడ్డారు (కొన్నితరాల తరువాతే ఈ కుటింబీకులు మరలా ఆలయసేవకులుగా తీసుకోబడ్డారు). కృష్ణరాయలు (క్రీ.శ. 1509–1529) అధికారానికి వచ్చాక సిర్రప్పయన్ ఇందు జాగాల స్థానంలో మఠాల నిర్మాణంకై మాధ్వ ఆధ్యాత్మిక గురువు శ్రీమత్ వ్యాసతీర్థ శ్రీపాద ఉదయర్‌కు ఆలయ స్థానత్తర్ ద్వారా వీటిని ఇవ్వడం జరిగింది.

ఇక తిరుమలేశునికి ఇవ్వబడిన దానాల్లో కృష్ణరాయలు, ఆతని ఇరువురు రాణులివి ప్రధానమైనవి. ఇవిగాక ఆతని మంత్రులు, అధికారులు, వారితోబాటు జీయర్లు, మేధావులు ఏకాంగులు, వ్యాపారులు, సామాన్యులు, స్త్రీలుకూడా దానాలు చేశారు.

క్రీ.శ. 1513 ఫిబ్రవరి 10వ తేదీన తిరుమలేశుని తొలిసారి సందర్శించినప్పుడు కృష్ణరాయలు దానంచేసిన వాటిలో 1. 3,308 వన్నెల బరువుగల నవరత్న కిరీటం (తొమ్మిది రంగుల రత్నకిరీటం), 2. 1,555 వన్నెలు గల ఒమ్మెచ్చు 3. 1,076 వన్నెల కుందనం, 4. ముత్యాలు (తెలుపు, నీలం), మాణిక్యం, నీలం రాయి పొదగబడిన 225 వన్నెల త్రిసరం (మూడు తీగల నెక్లెస్) (అడ్డిగలతో బాటు) 5. 61 వన్నెల పతకం (పెండెంట్) 6. కర్పూర హారతికై 25 వెండి పళ్ళేలు ఉన్నాయి. 7. ఇక రాత్రి ఏకాంత సేవ సమయంలో భగవంతునికి పాలు ఇవ్వడంకై చిన్నాదేవి ఇచ్చిన 374 వన్నెల కప్పు, 7. అలాగే రాత్రి ఏకాంతసేవ సమయంలో భగవంతునికి పాలు ఇవ్వడంకై తిరుమలదేవి ఇచ్చిన మరో కప్పు కూడా ఉన్నాయి. పరిపాలనలో స్థిరత్వం ఏర్పడి, విజయయాత్రలకు అనుకూలత ఏర్పడిన దశలో ఈ దానాలు చేయబడినట్లు తెలుస్తోంది.

క్రీ.శ. 1513 మే 2వ తేదీన రెండవసారి సందర్శించినపుడు దానం చేసిన వాటిలో 1. తిరుమల

ఉత్సవ కాలాల్లో ఊరేగింపుగా తీసుకెళ్ళబడే శ్రీ వేంకటేశ్వర, శ్రీదేవి, భూదేవి (నాచియార్లు)ల చిన్నసైజు లోహపు విగ్రహాలుకై (ఉత్సవ మూర్తులు) ముత్యాలు, పాత వజ్రాలు, కెంపులు (ముదురు ఎరుపు), పిల్లి కళ్ళు, ఇంద్రనీలాలతో కూడిన 380 వన్నెలుగల 3 చిన్న కిరీటాలు, 2. ఐదు వజ్రాలు, పచ్చలు (ఆకుపచ్చరంగు), కెంపులు, పాత వజ్రాలు, రత్నాలు, బంగారు తీగలు, పదునేడు అడ్డిగలుతో కూడిన 66 వన్నెలు ఉదూధర ఆభరణం, 3. వజ్రాలు, కెంపులు, ఇంద్రనీలాలు గల కత్తి ఒర (షీత్), కఠారి (ఖడ్గం), చిన్న ముత్యాలు, పెద్ద ముత్యాలు, కెంపులతో కూడిన కత్తి ఒరకు బిగించిన సరాలు (టాసెల్), మొత్తం 326 వన్నెలు అందులో కెంపులు, వజ్రాలు, పచ్చలు మాత్రమే 165 వన్నెలు, 4. పైభాగంలో కెంపులు పొదిగిన 132 వన్నెలు గల నిచ్చల కఠారి ఒర, 5. నిత్యం వాడకంకై ముత్యాలు సరాలతో కూడిన చిన్న ఖడ్గం, 6. కెంపు, ముత్యాలు, వజ్రాలుగల ఖడ్గం ఒర, 7. వజ్రాలు, కెంపులు, పచ్చలు మొదలైనవిగల 87 వన్నెల పతకం, 8. ముత్యాలు, కెంపులు, ఇంద్రనీలం, పాత వజ్రాలు పొదిగిన 573 వన్నెలుగల ఒక జత భుజకీర్తులు (వంకీలు), 9. రోజువారీ వాడకంకై 198 వన్నెలు, భుజకీర్తి, 10. రోజువారీ వాడకంకై మరో రెండు భుజకీర్తులు 11. 17 అడ్డిగలు గల బంగారు తీగ, 12. ముత్యాలు, కెంపులు, వజ్రాలు, పచ్చలు, పొదగబడిన రాగి ఆకు ఆకారం గల 205 వన్నెలు గల 30 అడ్డిగలు, 13. 276 వన్నెల అడ్డిగలు గల బంగారు తీగ ఉన్నాయి.

క్రీ.శ. 1513 జూన్ 13వ తేదీన మూడవసారి సందర్శించినపుడు దానంచేసిన వాటిలో 1. తన పేరున నిత్యాన్నదాన సేవ, 2. తన తల్లిదండ్రులు నరసనాయక, నాగలాదేవిల పేరున సమర్పించిన నవరత్న ఆభరణం, 3. తన తలిదండ్రుల పేరున ప్రతి ఏడాదీ జనవరి-ఫిబ్రవరి బ్రహ్మోత్సవం జరపడంకై అవసరమైన ఆదాయంకై పురమండలం, గొడగూర్‌నాడులో ఇవ్వబడిన చత్రవాడి (చత్రపాడి లేక సత్రపాడి), తురయ్యూర్ (తురూర్), పిరటికళత్తూర్ (పిరటం లేక పిరడం), కద్దెకుత్తన్ పాడి, తాళ్ళపాకకు, ముడియూర్, దారత్తూర్ మరియు కరికంబేడు (కరకంబాడి లేక కరకనం బేడు) గ్రామాలు, 4. కాళహస్తి ఆలయానికి ఇచ్చిన దానం ఉన్నాయి.

క్రీ.శ. 1514 జులై 16వ తేదీన నాల్గవసారి సందర్శించినప్పుడు దానంచేసిన వాటిలో (ఒరిస్సా ప్రతాప రుద్రగజపతిని ఓడించాక, నెల్లూరు ఉదయగిరిని ఆక్రమించి రాజధానికి తిరుగు ప్రయాణం చేసేప్పుడు) 1. 30,000 బంగారు వరహాలతో (చాకొర్పణ్) చేసిన కనకాభిషేకం, 2. బంగారుతీగ, బంగారు పిన్నులు, కెంపు, ముత్యాలు, ఇంద్రనీలం పొదగబడిన 250 వన్నెలు గల బన్నసరంత్రిసరం (మూడు తీగల ఆభరణం), 3. ఒక జత కడియం (బహువలయం), 4. పొత్తపి సీమలోని తాళ్ళపాకగ్రామ దానం, దాని ఆదాయంతో నిత్యసేవలు, 4. చిన్నాదేవి ఇచ్చిన వజ్రాలు, కెంపు, పచ్చ, ముత్యాలు పొదిగిన పతకం గల 200 వన్నెల కంఠమాల (నెక్లెస్), 5. చిన్నాదేవి ఇచ్చిన తొండై మండలంలోని గురయూర్ (ముడియూర్) గ్రామం, దాని ఆదాయంతో ఆమె పేరుమీదుగా నిత్యసేవలు, 6. తిరుమలదేవి ఇచ్చిన వజ్రాలు, కెంపు, పచ్చ, ముత్యాలు పొదిగిన 225 వన్నెల చక్రపతకం, 7. తిరుమలదేవి ఇచ్చిన పోలింగర్ పట్టులోని పిరట్ట కళత్తూర్ గ్రామం, దాని ఆదాయంలో నిత్యాన్నదానం ఉన్నాయి. బహుశా ఈ సందర్భంలోనే ఆలయప్రాకారంలోపల శ్రీవేంకటేశుని ఆరాధిస్తున్నట్లున్న తన రాణుల రాగిశిల్పాల్ని ప్రతిష్టించు కున్నాడు.

క్రీ.శ. 1515 అక్టోబర్ 25న కటకపురి (కళింగ / ఒరిస్సా) విజయం నుండి 1.25 కీర్తిముఖ తగళ్ళు (ఆకులు), 13,835 ఒమ్మెచ్చు గుండ్లు (పూసలు), 16 వన్నెల బంగారు తీగ, 7,978 వన్నెల బంగారం, మకరతోరణంపై వ్రేలాడు 5,474 వన్నెల గల 20 సిల్కు, బంగారు తీగలు గల 27,287 వన్నెల నవరత్న ప్రభావళి (మకరతోరణం) ఉండేది మకరతోరణంలో మొత్తం 10,994 ఎర్రరాళ్ళు, 754 పచ్చలు, 530 ఇంద్రనీలాలు, 40 పిల్లికళ్ళు, 45 అమూల్య రత్నాలు, 74తో పసుపుపచ్చ రాళ్ళు, 970 పాత వజ్రాలు, 3,933 ముత్యాలు, కళ్ళుగా పొదగబడిన 4 పెద్ద ఇంద్రనీలాలు, 6 పగడాలు (చిన్నప్రాణుల నుండి ఏర్పడు ఎరుపు, పింక్, తెలుపు పదార్థం), 30 గవ్వలు గలవు, మకరతోరణ ధనురాకారం మొత్తం బరువు 14,711 వన్నెలుకాగా, గ్రాండ్ టోటల్ 31,124 వన్నెలు ఉండేవి.

క్రీ.శ. 1517 జనవరి 2వ తేదీన ఐదవసారి (కళింగ ఆక్రమణ తరువాత సింహాద్రి పొట్నూరులో విజయస్తంభం స్థాపించి వచ్చాక) తిరుమలను సందర్శించినపుడు దానం చేసిన వాటిలో 1. కంఠమాల, 2. పతకం (పెండెంట్), 3. ఆలయ విమాన బంగారు పూతకు 30,000 వరహాలు, 4. వారం

వారం జరిగే పులుగుకప్పు (పులికాపు) అభిషేకం (అబ్లూషన్)కై గొడగూర్‌నాడులో ప్రభుత్వానికి వచ్చు సుంకంలో 1,000 వరహాలు, 5. నిత్యం ఉదయం జరిగే సేవలకై గొడగూర్ నాడులో ప్రభుత్వానికి వచ్చు నిత్యమూల విసన్నడు పన్ను (తలరికమ్మదరికం పన్ను)లో 500 వరహాలు ఉన్నాయి.

ఆలయ విమాన బంగారుపూతను క్రీ.శ. 1260లో జటావర్మన్ సుందరపాండ్యుడు చేయించినట్లు తెలుస్తోంది. శ్రీరంగం, చిదంబరం (చిత్రకుంటం)లలో కూడా ఈతడు ఇదే పని చేయించాడు. ఆ తరువాత క్రీ.శ. 1359 జూలై 6వ తేదీన విజయనగర కుమార కంపన కాలపు మహామండలేశ్వరుడు సాళువ మంగిదేవుడు విమాన బంగారుపూతతో బాటు, శిఖరంపై బంగారు కలశాన్ని (పిన్నకెల్) స్థాపించాడు. తరువాత సాళువ నరసుని కాలంలో అమాత్యశేఖర మల్లన అటు పిదప కృష్ణరాయలు విమానానికి బంగారు పూత వేయించారు. ఆ పిదప విజయనగర ఒకటవ వెంకట కాలంలో కంచికి చెందిన కోటి కన్యకదానం తాతాచార్య బంగారుపూత వేయించాడు. తరువాత క్రీ.శ 1909లో రామలక్ష్మణ్ దాస్ బావాజీ విమాన బంగారుపూత వేయించాడు. వేంకటపతి దేవరాయల ఆధ్యాత్మిక గురువు ఎత్తూర్ తిరుమలై కుమార తాతాచార్య కూడా బంగారుపూత వేయించినట్లు తెలుస్తున్నా, శాసన ఆధారాలు లేవు.

క్రీ.శ. 1518 అక్టోబర్ 16న ఆరవసారి తిరుమల సందర్శించినపుడు కృష్ణరాయలు దానం చేసిన వాటిలో ఏమేమి ఉండేవో స్పష్టంగా తెలియడం లేదు. దీర్ఘకాలం తరువాత తిరుమలదేవికి కుమారుడు జన్మించినందున గత సందర్శన జరిగిన ఐదువారాలకే కృష్ణరాయలు, తన పట్టపురాణి తిరుమల దేవి, కుమారుడు తిరుమలరాయ మహారాయలుతో కలిసి శ్రీవేంకటేశుని సందర్శించినట్లు తెలుస్తోంది. కాని దురదృష్టంకొద్దీ క్రీ.శ. 1524 లేక 1525 సం॥లో కుమారుడు మరణించాడు. ఆరవ సందర్శన గురించి బళ్ళారి జిల్లాలోని హంపి దగ్గరలోని కమలాపురంవద్ద గల శాసనం తెలుపుతోంది.

క్రీశ. 1521 ఫిబ్రవరి 17న ఏడవసారి (చివరిసారి) సందర్శించినపుడు దానంచేసిన వాటిలో 1. నవరత్న పీతాంబరం, 2. ముత్యాలు, రత్నాలు, పచ్చలు, ఇంద్రనీలాలు పొదగబడిన కుట్టవ (తలకట్టు లేక టోపీ, శిరోభరణం), 3. నవరత్నాలు పొదగబడిన రెండు చామరాలు, 4. పతకం (పెండెంట్), 5. 1,000 వరహాలు, 6. తిరుమలదేవి దానం చేసిన నవరత్న పతకం ఉన్నాయి.

ఇవిగాక క్రీ.శ. 1524 జనవరి 12వ తేదీన తిరుమల ఆలయ స్థానత్తర్ స్వాధీనంలో ఉన్న నంబి శిర్రయ్యప్పన్‌కు చెందిన రెండు గృహాలు, నివాస స్థలాలు మాధ్వ ఆధ్యాత్మిక గురువు శ్రీమత్ వ్యాసతీర్థ శ్రీపాద ఉదయర్‌కు మఠాల నిర్మాణంకై ఇవ్వడం జరిగింది. అంతేగాక ఉల్ మండలంలోని కడైకుత్తన్ పాడి గ్రామపు రెవెన్యూలో సగభాగం, పురమండలంలోని తాళ్ళపాకం, పిరటికళత్తూర్, దారత్తూరు, ముడియూర్, చత్రవాడి, తురయ్యూర్ అను గ్రామాల పూర్తి రెవెన్యూ శ్రీ వేంకటేశునికి దానంగా ఇవ్వడం జరిగింది. దారత్తూర్, చత్రవాడి, తురయ్యూర్‌లు క్రీ.శ. 1513 జూన్ 13న, తాళ్ళపాక క్రీ.శ. 1514 జూలై 6న, ఆ తరువాత ముడియూర్‌ను చిన్నాదేవి, పిరటి కళత్తూర్‌ను తిరుమలదేవి, ఆ పిమ్మట కరకనంబాడు (కరకనంబేడు / కరకంబాడి) గ్రామాలు దానం చేయబడ్డాయి.

కృష్ణరాయల కాలంలో తిరుమలేశునికి దానాలు చేసిన ఇతరుల్లో అపాపిళ్ళై (సర్వ సైన్యాధికారి, ఉత్తరమేరూర్ వాసి) వీరకంపు గ్రామాన్ని ఇచ్చాడు, పెరియ ఓబల నాయక రామనాయకర్ (మహానాయకాచార్య) కడలూర్ గ్రామం, వందలకొలది ఆవుల్ని ఇచ్చాడు, ప్రధాని సాళువ తిమ్మరుసు (ఈతని అల్లుడు నాదిండ్ల అప్ప చంద్రగిరిలో నివసించేవాడు), సాళువ గోవిందరాజ, రాయసం కొండమరాసయ్యర్, మన్నార్‌పిళ్ళై, తిరుపతివారైన ఎల్లప్పనాయకర్, తిరుమలై నాయకర్లు, తమ్మునాయకర్, తిరువేంకటయ్యర్, వసలం ఎల్లప్పనాయకర్, కరణిక బసవరాస, ఉడియం ఎల్లప్ప నాయకర్, ఎక్కాడి తిమ్మమ్మన్, అడిపన్, భయ్యప్ప నాయకర్, త్రియంభక దేవర్, బహుర్‌మల్లరాసర్, లక్కునాయకర్, సబుద్ధిరామదాసర్, అంబికముదిశిల వంటి మంత్రులు, అధికారులు, అరిసనాలయం నందవనం మఠజియ్యర్, పాన్ శఠగోప మఠజీయర్, వ్యాస మఠ జీయర్ శ్రీపాద ఉదయర్‌లు, ఏకాకి తిరువేంకటయ్యాన్, ఏకాకి పత్తర్‌పిరన్ అయ్యర్‌లు, తాళ్ళపాక పెద తిరుమల అయ్యంగార్, యగ్నునారాయణ దీక్షితర భట్టర్, దొడ్డయ్యంగార్ అప్పయ్, ఉదైవర్ కోయిల్ అన్న వంటి మేధావులు, ఆలయ గణికులు, వ్యాపారులు, పూతలపట్టు వాసి చిన్నప్పరెడ్డి వారు అనేకులు కూడా శ్రీ వేంకటేశునికి దానాలు చేశారు. మి



# పదకవిత - కథాకావ్యాలు

- అబ్బూరి గోపాలకృష్ణ

పదకవిత అంటే పాడుకోవడానికి వీలుగావున్న కవితలని అర్థం. 'పదం పాడటం' అన్న వ్యవహారం తెలుగులో నేటికీ నిలిచే ఉంది. ఆ అర్థాన్ని సంకుచితపరచుకొని కేవలం వాగ్గేయకార సాహిత్యాన్నే పదకవితా సాహిత్యంగా కొందరు పరిశోధకులు స్వీకరించడం విచారం కలిగించే విషయం. జానపద సాహిత్యంలో తుమ్మెద పదాలు, చిలకపదాలు, చందమామ పదాలు అంటూ వ్యవహరించే సాంప్రదాయం వున్నా ఆ వ్యవహారాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థంకాని విషయం.

తెలుగులో గేయకావ్యం అనే పదప్రయోగాన్ని అప్పుడప్పుడూ వింటూవుంటాం. ఈ గేయకావ్యం అనే పదబంధం ఈ శతాబ్దంలోనే ప్రభవించింది. కన్నడభాషలో 'హాడుగబ్బ' అనే ప్రయోగం వుంది. దాని అర్థం పాడే కావ్యమనే. అది ప్రాచీనమైన ప్రయోగం. అలాంటి ప్రాచీన పదం మనకులేదు. పదకవిత అన్నమాటను అందుకు సమానార్థకంగా వినియోగించుకోవచ్చు.

తెలుగు పరిశోధకులను దారి తప్పించిన విశేషాన్ని గురించి మనం చెప్పుకోవలసి వుంది. పదకవితను జానపద వాఙ్మయంలో భాగంగా గుర్తించారు. నిజమే జానపద సాహిత్యంలో పదకవిత ఒక భాగం కావచ్చుగాని అంతమాత్రాన పదకవితను ప్రామాణిక సాహిత్యలోకంలో స్థానం లేకుండా చేయడం చాలా బాధాకర విషయం. అదే పదకవితా మార్గాన్ని అనుసరించిన పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథుడు గుర్తింపు పొందగా పదుల సంఖ్యలో వున్న ఇతర కవులకు ప్రధాన సాహిత్య శ్రేణిలో స్థానాన్ని నిరాకరించడం కేవలం అన్యాయమని నా అభిప్రాయం. బాలనాగమ్మ కథ, కాటమరాజు కథ సర్వాయి పాపన్న కథలవంటి పదకవితా రూపకావ్యాలకు ఈనాటికీ గుర్తింపు దొరకకపోవడం విచారకరం.

ఈ గుర్తింపు దొరకకపోవడానికి ప్రధాన హేతువు వుంది. ఆయా కవులపేర్లు తెలియవని కొందరంటారు. మరికొందరు పేర్లు తెలిసినా కాలనిర్ణయం అసాధ్యమంటారు. అసలు జానపదసాహిత్యంలో ఒక రచయిత అనేవాడే వుండడనీ జానపద గాయకుడే పాడుతూ రచిస్తాడనీ, రచిస్తూ పాడతాడనీ పాడిన ప్రతిసారీ రచన మారిపోతూ వుంటుందనీ విపరీతవాదన చేసే పండితమ్మన్యులకు కూడా కొదవలేదు.

నిజానికి ఇవేవీ నిలిచే వాదనలు కావు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సాహిత్య కృషి చేస్తున్న రోజుల్లోనే మదరాసు నగరంలో పదిదాకా తెలుగు ముద్రణాలయాలు పనిచేస్తున్నట్లు సమాచారం వుంది. ఆనాటి రచయితల గ్రంథాలను ఆ ముద్రణాలయాల్లో ముద్రించేవారు. కాపీరైట్ చట్టం వలన ఆ తరువాత కాలంలో పుట్టుకొచ్చిన ప్రచురణకర్తలు రచయితల పేర్లను తొలగించి పుస్తకాలను అచ్చువేయడం ప్రారంభించారు. ఈ నాటికీ అచ్చులో దొరుకుతున్న అనేక కథాకావ్యాలలో గ్రంథకర్తనామం కనబడదు. తాళపత్ర గ్రంథాల రూపంలో ఈ కథాకావ్యాలకు మూలప్రతులు గ్రంథాలయాల్లో కనిపిస్తున్నాయి. అంతేకాక రచయితల పేర్లు మన పరిశోధకులు అందిస్తూనేవున్నారు. కాని కాల నిర్ణయం విషయంలో మాత్రం ఏ విధమైన కృషి ఇప్పటిదాకా జరిగినట్లు దాఖలాలు లేవు. అదీగాక సుపరిష్కృతంగా ఈ కావ్యాలను ప్రచురించే ప్రయత్నమూ పెద్దగా సాగడంలేదు. ఒక కావ్యాన్ని సాహిత్యపరంగా ఆమోదించి రసాస్వాదన చెయ్యాలంటే కవి జీవితకాలం తెలిసి వుండాలా అన్న ప్రశ్నను విజ్ఞులకే వదిలేస్తున్నాను.

ఈ సందర్భంగా మన పొరుగు రాష్ట్రమైన కర్నాటక రాష్ట్రంలో వున్న పరిస్థితిని చూస్తే ఆశ్చర్యం కలగకమానదు. బెంగుళూరు విశ్వవిద్యాలయం వారు 'సామాన్యనిగె సాహిత్య చరిత్రె' అంటూ పదిసంపుటాలను ప్రచురించారు. కొన్ని

డా. అబ్బూరి గోపాలకృష్ణ, ఫోన్ : 0891 - 2567268

సంపుటాల పేర్లు చూడండి 'షట్పది సాహిత్య', 'సాంగత్య కవిగళు', 'వచనసాహిత్య.' ఈ మూడు గ్రంథాల్లోనూ కలిపి దాదాపు ఎనభైమంది కవులను గురించి రాశారు. కొందరి కవులకాలం తెలుసు. మరికొందరి కాలం తెలియదు. అయినా ఆయాకవుల సాహిత్య పరిశీలనను కన్నడ పరిశోధకులూ సాహిత్యవేత్తలూ చక్కగా చేశారు. కనీసం వారి నుంచి మనం కొంతైనా నేర్చుకోవలసింది వుందిగదా!

కవుల పేర్లైనా తెలియవుగదా అన్న ప్రశ్న యెదురు కావచ్చు. కవిపేరు తెలుసుకోవడానికి మూలప్రతులను పరిశీలించాలి. ఆచార్య బి. రామరాజుగారు, ఆచార్య నాయని కృష్ణకుమారి గారు, డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారు కావ్యకర్తలను పేర్కొన్నారు. కాని కావ్యాలు ఇంకా పరిష్కృతమై ప్రచురితం కాలేదు. కవులూ, కావ్యాలూ పరిశోధకుల ఆర్ద్రస్పర్శకోసం ఇంకా నిరీక్షిస్తూనే వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిద్యాలయాలలో వున్న తెలుగుశాఖలన్నిటా ఈ కావ్యాలను వెలుగుకు తెచ్చే ఆకాంక్ష కలిగితే అనతికాలంలోనే తెలుగు సాహిత్యంలోని ఒక ప్రముఖశాఖకు పుష్టి చేకూరగలదని మనవి. కన్నడ భాషలో షట్పద, సాంగత్య ఛందాలలో రచితమైన కావ్యాలను ఆలంబనం చేసుకునే ఆధునిక కన్నడ సాహిత్యంలో రసవంతమైన కావ్య, నాటకసృష్టి జరిగింది. డాక్టర్ చంద్రశేఖర్ కంబార రచించిన జోకుమార స్వామి, సంగ్యాబళ్యా, గిరీష్‌కర్నాడ్ రాసిన నాగమండల మొదలైన జగత్ప్రసిద్ధి పొందిన నాటకాలు కన్నడ "హాడుగబ్బ" సంప్రదాయం వల్లనే ప్రభావితమైనాయని చెప్పక తప్పదు.

అతి విస్తృతంగా ఒకనాడు తెలుగునాట విస్తరించి వుండి, మనహ్రస్వదృష్టివలన కనుమరుగైన మహాకావ్యాలను మనం పునరుద్ధరించుకోవలసిన సమయం ఆసన్నమైంది. రాజాదరణతో సాగిన సాహిత్య కృషికి తెలుగునాట పట్టం కట్టారు. మరి ప్రజాదరణతో సాగిన సాహిత్యకృషిని ఇంకా మరుగున వుంచవలసిందేనా? పునరుద్ధరించి గౌరవస్థానం ఇవ్వడం మన ఆవశ్యకర్తవ్యమని మనవి. ఈ జానపద లేదా పదకవిత్వ గాథలూ, కావ్యాలూ పరిశోధితమై పరిష్కృతమై గ్రంథరూపాన వెలువడిన నాడే తెలుగుభాషలోని సృజనాత్మక సాహిత్యకృషిని సంపూర్ణంగా అర్థం చేసుకోగలం. ఆనాడే తెలుగు భాష విస్తృత రూపాన్ని ఆవిష్కరించుకోగలం. అందుకు మన పరిశోధకులు కృషి చెయ్యగలరని నా ఆకాంక్ష.

**ఆధార గ్రంథాలు :** 1. తెలుగు జానపదగేయ సాహిత్యం (బి. రామరాజు) 2. తెలుగు జానపదగేయ గాథలు (డా. నాయని కృష్ణకుమారి) 3. తెలుగు వీరగాథా కవిత్వము (డా. తంగిరాల వెంకట సుబ్బారావు) 4. పల్నాటి వీరచరిత్ర (పండిత అక్కిరాజు ఉమాకాన్త విద్యా శేఖరులు)

మి

---

# రంగుల గుడి....

నీ బొమ్మ రంగుల్లో వేద్దామని
కుంచె కాగితం మీద కెలుకుతున్నా....
ఆకలితో ఉన్న కాగితం రంగుల్ని మింగేస్తున్నది.
ఇపుడిపుడే నీ మోము రంగుల్లో నుంచి
పొంగివస్తున్న తీరు....

నా అంతరంగపు లోతుల్లో నీరూపు
నీ కనుపాపలు నావంక చూడగానే,
ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను...
ఆ చూపులోని వేల ఆహ్వానాలు అందుకోవాలని ఆరాటం
నీ పెదవులు అరనవ్వులో విడివడి
తడితడిగా – గులాబిరేకుల మీద
మంచు పడినట్లు – ఆరనేలేదు....

నా ఆలోచనలలాగా, ఇంకా చాలా
కాళీ, కాగితమంతా...
నీ కనుబొమల ముడి, ఇప్పటికి
ఇది నా జీవిత సమస్య!
వెచ్చని నీ ఊపిరి ఊసుల్తో నిశ్శబ్దంగా
ఈ రంగులన్ని కలగలిసి ఆరిపోతుంటే,
నీవు ఎప్పటికి పూర్తయ్యేవు?
ఈ చెదిరిన రంగుల గుడిలో
నిన్నెలా వెతికేను?...

– కవిత




# నా కళా జీవితం

*- నటరాజ రామకృష్ణ*

నెల్లూరులో చాలా మంది బాలికలకు నేను నాట్యం నేర్పాను. గూడూరు, వెంకటగిరి, కాళహస్తి, కార్వేటి నగరం, పుంగనూరు మొదలైన పట్నాలకు వెళ్లి నృత్య కళపైన పరిశోధనలు జరిపాను. నృత్య ప్రదర్శన లిచ్చి ప్రసంగించాను.

నాట్యాచార్యుల కుటుంబానికి చెందిన గురుస్వామి అనే ఒక మార్దాంగికుడు నాకు వేంకటగిరిలో తారస పడ్డాడు. ఆటపాటలు లేక అతడు ఆర్థిక యిబ్బందులకు లోనై ఉన్నాడు. అందువల్ల అతన్ని నా వద్ద శాశ్వతంగా ఉండమన్నాను. అతనికి మృదంగం వాయించడం వచ్చు. మాదల్, తబలా, ఖోలు, కంజీరా, డోల్‌చి మొదలైన వాయిద్యాలు కూడా వాయించడం నేర్చుకొనమన్నాను. మృదంగ వాయిద్యంలో మంచి లెక్క తెలిసినవాడు. నేను ప్రదర్శనా ఉపన్యాసాలకు వెళ్ళినప్పుడు అతన్ని నా వెంట తీసుకొని వెళ్ళేవాణ్ణి.

గుంటూరులో నృత్య కళా ప్రచారం చేయమని, అక్కడి బాలబాలికలు నృత్యం నేర్చుకొనడానికి ఉత్సాహపడుతున్నారు. గనుక వారికి నృత్యం నేర్పమని శ్రీ నార్ల వేంకటేశ్వరరావు గారి మేనమామగారు నన్ను ఆహ్వానిస్తూ నా కొక లేఖ రాశారు.

నెల్లూరులో నేను అనుకొన్న విధంగా నృత్యం గురించి ప్రచారం చేశాను. ఆ కాలంలో శ్రీ అలెగ్జాండర్ గారు అక్కడ కాలేజీలో లెక్చరర్‌గా ఉండేవారు. వారి శ్రీమతికి నృత్యకళ యెడల ప్రీతి ఉండేది. అందువల్ల వారి అమ్మాయికి నన్ను నృత్యం నేర్పమన్నారు. వారు మలయాళీలు. వారి అమ్మాయికి తెలుగు తెలియకపోయినా చాలా చురుకైన పిల్ల. ఏక సంతాగ్రహి. నేను ఏది చెప్పినా వెంటనే గ్రహించేది. నాట్యం బాగా నేర్చుకొంది. కొంతకాలం తర్వాత అలెగ్జాండర్‌గారు మదరాసు వెళ్ళిపోయారు. ఆ తర్వాత పెద్ద పెద్ద పదవులు అలంకరించి, శ్రీమతి ఇందిరా గాంధీ గారికి ప్రత్యేక కార్యదర్శి అయ్యారు. ఆయన ముంబాయి రాష్ట్ర గవర్నరుగా ఉన్నారు.

నెల్లూరు నుండి వెళ్ళిన తర్వాత ఆయన్ను నేను మళ్లా కలుసుకోలేదు. అటువంటివారి పరిచయం వల్ల వేరొకరైతే ఎన్నో విధాలుగా లాభం పొంది ఉండేవారు. కాని నేను ఇటువంటి విషయంలో వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక వారిని నేనేమి అడగలేదు.

నేను నెల్లూరులో ఉండగా శ్రీ కోట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు అక్కడికి వచ్చారు. వయస్సులో ఆయన నాకంటే చాలా పెద్దవారు. పలు విద్యలలో ప్రవేశం ఉన్నవారు. ఆయన రైలు యింజన్ డ్రైవర్‌గా ఉండేవారట! ఆయన ఆయుర్వేద వైద్యులు. దేవీ భక్తులు. జోతిషికులు, కవులు. వీటికి మించి ఆయన ఒక నాట్యాచార్యులు. అందువల్ల కొంతమంది కోరగా ఆయన నెల్లూరులో స్థిరపడ్డారు. ఆ సమయంలోనే నేను నెల్లూరు విడిచిపెట్టి గుంటూరు వెళ్ళాను. ఆయన యెడల నాకు పూజ్య భావ ముండేది.

నేను ఆంధ్రప్రదేశ్ నృత్య అకాడమీ ప్రెసిడెంట్‌గా వున్నప్పుడు ఆయన్ను ప్రత్యేకంగా హైదరాబాద్ ఆహ్వానించి, అకాడమీ తరపున ఘనంగా సన్మానించాను. ఆయన నెల్లూరులో స్థిరపడిన సమయంలో ఆయన అభిమానులు కొందరు నాకు ప్రతికూలంగా ప్రచారం చేసినా, నేను నృత్య అకాడమీ ప్రెసిడెంట్‌గా ఆయన్ను సన్మానించినందుకు ఆయన నన్ను ఆశీర్వదించారు. వీరూ, శ్రీమతి నాగమణమ్మగారు చనిపోయేవరకు నెల్లూరులో శాస్త్రీయ నృత్యకళను ప్రచారం చేస్తూ వచ్చారు. కావ్యాలలో, ప్రబంధాలలో నెల్లూరు నర్తకులు,

నట్టువరాంధ్ర గురించి ఎన్నో వర్ణనలున్నా, నేను నెల్లూరు వెళ్లేనాటికి అక్కడ నాట్యం శూన్యం అని చెప్పక తప్పదు. నా వల్ల ఎంతో మంది పెద్ద కుటుంబాలవారి పిల్లలు నాట్యం అభ్యసించారు. నాకెంతో ఆనందం కలిగింది.

నేను నెల్లూరులో ఉండగా దసరా ఉత్సవాలలో ఒక నాట్య ప్రదర్శన ఇమ్మనమని కాకినాడ సరస్వతీ గానసభ నుండి నాకు ఆహ్వానం వచ్చింది. ఎంతో పేరు ప్రఖ్యాతులున్న సభ అది. దాని ఆధ్వర్యంలో ప్రదర్శన ఇవ్వడం ఎంతో గొప్పగా అందరూ భావించేవారు. అందువల్ల నేను సంతోషంతో వారి ఆహ్వానం స్వీకరించాను. అప్పుడు శ్రీ కొమ్మారెడ్డి సూర్యనారాయణ నాయడుగారు దానికి అధ్యక్షులు. ఆయన ఏ ఉత్సవాన్నైనా గొప్పగా జరిపేవారు. మదరాసు మొదలైన ప్రాంతాల నుండి పెద్దపెద్ద విద్వాంసులను ఆయన ఈ సభలకు ఆహ్వానించేవారు. నేను కుమారి శ్యామా కౌండిన్యను తీసికొని కాకినాడ వెళ్ళాను. కుమారి కౌండిన్య అప్పటికి చాలా చిన్నది. అయినా తన తల్లి దండ్రుల ప్రోత్సాహంతో నాట్యం బాగా అభ్యసించింది. ఆమె ముఖంలో సాత్వికాభినయం చక్కగా ఒప్పేది. ఒక్కొక్క అభినయ విషయంలో పెద్ద వారికి కూడా సాధ్యపడనంత గొప్పగా చేసేది. ఆమె చేత భరతనాట్యం అంశాలనే కాక హిందూస్థానీ గీతాలు, ఎంకి పాటలు గూడా ఆడించాను. "నిత్య కల్యాణి నిగమాంత సంచారిణి" అనే శ్యామ శాస్త్రుల వారి అష్టరాగమాలిక, దేవీస్తోత్రం, "వనజాక్షిరో వాని సరసకు రమ్మనవే" అనే పదవర్ణం సుబ్రమణ్యేశ్వరునికి అంకితమైన "నెనరులేని చెలులు" అనే పరకీయ పదం, ''ఓ పరదేశ్ జయ్యోరాజా'' అనే విరహోత్కంఠిత హిందీ వర్ష ఋతువు గీతం, "నన్నివిడిచి పెట్టెల్లినాడే" అనే ప్రోషిత నాయిక నండూరి సుబ్బారావుగారి యెంకి పాట మొదలైనవి చాలా జాగ్రత్తగా ఎంపిక చేసి, కుమారి శ్యామ చేత నృత్త, అభినయనాలు చేయించాను. "వనజాక్షిరో" అన్న ఈ పద వర్ణాన్ని పూర్వం వేంకటగిరి, కాళహస్తి ప్రాంతాలకు చెందిన నర్తకీమణులు ఆడేవారు. తర్వాత మేము తప్ప వేరెవ్వరూ ఆడలేదు. ఎవరికీ రాదు. దక్షిణాది నర్తకులకు కూడా తెలియదు. ఈ కాలంలో ఎవరైనా ఈ పదవర్ణాన్ని ఆడితే వారు నా వద్దనో, నా శిష్యుల వద్దనో నేర్చుకొని యుండాలని ఎవరైనా గ్రహించవచ్చు.



ఆనాటి సభలో దక్షిణాదివారు ఎందరో వచ్చి కచ్చేరీలు చేసినా మా ప్రదర్శన కొత్తరకంగా ఉంది. అందర్నీ బాగా ఆకర్షించింది. ప్రతి నాట్యాంశానికి ముందు నేను ముచ్చటగా వ్యాఖ్యానం చెబుతూ వచ్చాను. ప్రేక్షకులకు నా వ్యాఖ్యానం ఇంకా చాలా బాగా ఆకర్షించింది. అయితే ఆనాడు కళా ప్రియులైన సూర్యనారాయణ నాయుడూ గారు అనారోగ్య కారణం వల్ల మా కచ్చేరికి రాలేదు. నా కా అదృష్టం లేకపోయింది. కాని ఆయన తన కార్యదర్శి ద్వారా మా ప్రదర్శన గురించి తెలుసుకొని మమ్మల్ని వారి ఇంటికి ఆహ్వానించి, అభినందించి, గౌరవించారు.

ఆనాడు మహా సంగీత విద్వాంసులు శ్రీ వై.వి. నారాయణ శర్మ గారి పరిచయం నాకు లభించింది. ఆయన గాత్రం మృదుమధురంగా లేకపోయినా వారి పాండిత్యం అమోఘమైంది. ఆయన నా కెన్నో ప్రాచీన నృత్య విశేషాలను తెలియజేశారు. ఆయన చనిపోయేవరకు మా మధ్య నృత్యకళ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతూ ఉండేవి.

ఆనాడు మా నృత్య కార్యక్రమం బాగా జరిగినా నా ప్రసంగం నాకు అసంతృప్తిగానే ఉంది. తెలుగులో ప్రసంగిస్తుంటే మధ్య, మధ్య ఆంగ్ల, హిందీ, మరాఠీ పదాలు దొర్లుతూ వచ్చాయి. అంత చిన్న వయస్సులో అన్ని భాషలు నేర్చుకొని, నృత్యకళలో ప్రావీణ్యం సంపాదించి నట్టువాంగం చేస్తూ పిల్లల చేత నాట్య కార్యక్రమాల నాడిస్తున్నందుకు కొందరు పెద్దలు నన్ను పొగడినా నాలో ఏదో ఒక వెలితి ఉన్నట్లు నా కనిపించింది. చక్కని తెలుగులో మృదుమధురంగా మాట్లాడగలగాలన్న పట్టుదల నాలో కలిగింది. కోనసీమ పండితుల వద్ద నేను నాగపూరులో తెలుగు అభ్యసించినా, వారి నుడికారం నాకు అబ్బినా తెలుగు భాష మీద పట్టు రాలేదు. ఎలాగైనా ఆ పట్టు సాధించాలన్న పట్టుదల నాలో కలిగింది. ఇంకా బాగా తెలుగు మాట్లాడి ప్రేక్షకుల్ని తన్మయుల్ని చేసి, నృత్య కళా ప్రచారం చేయాలన్న సంకల్పంతో నెల్లూరు తిరిగి వచ్చాను.

ఆటా పాటా అభినయాల్లో ఎంత ప్రావీణ్యం సంపాదించానో అంతకన్నా ఎక్కువగా తెలుగులో ప్రావీణ్యం సంపాదించకపోతే ప్రజల్లో నృత్యకళ చొచ్చుకొని పోయేటట్లు చేయలేనని నాకనిపించింది. మరికొన్నాళ్లకే నేను గుంటూరు మారవలసి వచ్చింది.

ఒక నెల రోజులు పూర్తిగా ఇంటి వద్దనే ఉండిపోయాను. సుమారు 20 వ్యాసాలు చక్కని తెలుగులో రాసాను. నే నుండే బంగళా కొరిటిపాడు వీధిలో ఉండేది. అది చాలా విశాలమైనది. దానికి ఒక ప్రక్క థియోసాఫికల్ సొసైటీ భవనం, రెండో ప్రక్క ఖాళీ స్థలం ఉండేవి. నా ఉపన్యాసాలను గట్టిగా చదివి, వశపరచుకొనడానికి ఎటువంటి ఇబ్బందులు లేవు. ఒక హాలులో అద్దం ముందు నిల్చుని, ప్రసంగించడం అభ్యసించాను. ఒక నెల్లాళ్లు రాత్రీ, పగలూ అభ్యసించాను. ఆకర్షణీయంగా, రమణీయంగా, కళాత్మకంగా ప్రసంగించడం అలవడింది. పెద్దల సమక్షంలో భావ యుక్తంగా, విద్యార్థుల ముందు ఆకర్షణీయంగా, స్త్రీల యెదుట నమ్రతతో ఎలా మాట్లాడాలో అలవాటు చేసుకొన్నాను. నాకు నే నే అద్దంలో ప్రేక్షకుణ్ణి. నన్ను నేనే మెచ్చుకొన్నాను. తృప్తి కలిగింది.

ఒకనాడు మహామహోపాధ్యాయ జమ్మలమడక మాధవరాయ శర్మగారు నే నున్న బంగ్లాకు వచ్చారు. ఆశ్చర్యపోయాను. సాదరంగా వారిని లోనికి ఆహ్వానించాను. ఏమిటి విషయమన్నట్లు వారివైపు చూశాను. "బాబూ! రామకృష్ణా! నీవు ప్రదర్శనాపూర్వక ఉపన్యాసాలు నాట్యకళపైన ఇస్తున్నావని విన్నాను. ఉపన్యాసం ఇవ్వడమేకాక ప్రతి అంశాన్ని అభినయించి చూపిస్తున్నావట. గుంటూరు పెద్దలు నీ ప్రసంగం వినాలని కతూహలపడుతున్నారు. వచ్చే శనివారం బ్రహ్మసమాజ మందిరంలో నీ కార్యక్రమం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నాను" అన్నారాయన.

ఆనాటి కార్యక్రమానికి శ్రీయుతులు విస్సా అప్పారావు, వేదాల తిరువెంగళాచార్యులు, కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, పర్వతనేని వీరయ్యచౌదరి, కాశీ కృష్ణమాచార్యులు మొదలైన తల నెరిసిన పండితులు, కవులు, విద్వాంసులు వస్తారని ఆయన నాకు చెప్పారు. నాలో ఉత్సాహం ఉప్పొంగింది. మనస్సు ఉరకలు వేసింది.



జంధ్యాల పాపయ్యశాస్త్రి

వారు చెప్పినట్లుగానే నా కార్యక్రమానికి చాలా మంది పెద్దలు వచ్చారు. నా భాషా జ్ఞానాన్ని నా మధుర సంగీత పాటవాన్ని, భావ వికాసాన్ని, నా అభినయ చాతుర్యాన్ని కలిపి, కలబోసి ఒక గంటపైగా ఉపన్యసించాను. ఆ పెద్ద లందరూ ముగ్ధులయ్యారు. నన్ను అభినందించారు. వారికి నా కృతజ్ఞతలు చెప్పుకొన్నాను. ఈనోటా, ఆనోటా పండిత లోకంలో అందరికీ నా ప్రదర్శన గురించి తెలిసింది. ఆనాడు నా కార్యక్రమానికి వచ్చిన పెద్దల ద్వారా నాకు మంచి ప్రచారం వచ్చింది. ఆదరణ లభించింది.

నా ఉపన్యాసం వల్ల విద్యార్థిలోకంలోను, మహిళా ప్రపంచంలోను నృత్య కళ యెడల ఎంతో ఆసక్తి పెరిగింది. చాలా మంది పెద్దలు ఈ కళను అభిమానించి, వారి పిల్లలకు ఈ విద్యను నేర్పమని కోరుతూ వచ్చారు. కొందరు వారింటికి వచ్చి, వారి పిల్లలకు నాట్యం నేర్పమని కోరారు. నేను సమ్మతించ లేదు. నేనున్న చోటుకు వస్తేనే నాట్యం నేర్పుతానని షరతు పెట్టాను.

ఒకనాడు నాట్యాచార్య శ్రీ ఎమ్.ఎస్. శైవ తెనాలి నుండి నన్ను చూడ్డానికి వచ్చాడు. కుమారి శ్యామా కౌండిన్యకు ఆమె తొలి నాట్య గురువు. త్వరలోనే మే మిద్దరం మంచి స్నేహితులమయ్యాం. అతడు గుంటూరు వచ్చినప్పుడల్లా నా కోసం ప్రత్యేక రకమైన బియ్యం తెచ్చేవాడు. అంత ఆత్మీయుడు. ఇక నాట్యం గురించి ఎన్నో విషయాలు చర్చించుకొనేవారం. అతడు బలమైనవాడు చాలా గట్టిగా పాడేవాడు. ధనధన మంటూ నాట్యంచేసేవాడు. నేను మెల్లగా పాడేవాణ్ణి. సున్నితంగా అభినయించే వాణ్ణి. నాట్యకళ విషయంలో మాకు భిన్నాభిప్రాయాలు కూడా ఉండేవి కాని అవి మా స్నేహానికి అవరోధాలు కాలేదు. మా తోటే ఆంధ్ర దేశంలో ఒక నూతన నాట్యశకం ప్రారంభమైంది. ఆ తర్వాత అతడు మదరాసులో స్థిరపడ్డాడు.



నీలం సంజీవరెడ్డి

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన కొత్త రోజుల్లో విశాఖపట్నంలో ప్రభుత్వం వేసవి సమావేశాలు నిర్వహించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రత్యేక ఓపెన్ థియేటర్‌లో ఒక సభ జరిగింది. గవర్నర్ త్రివేదిగారు, నీలం సంజీవరెడ్డిగారు మొదలైన పెద్దలు, విశాఖపుర ప్రముఖులు

ఆ సభకు వచ్చారు. ఆ సభలో నేను నాట్యం మీద ఉపన్యసించాను. ఏదో తమాషాగా కాసేపు వినిపోదా మనుకున్నారు, చాలా మంది. కాని వారంతా సుమారు రెండు గంటలు నా ఉపన్యాసం వింటూ మంత్రముగ్ధులై ఉండిపోయారు.

అది ఉపన్యాసమా? నృత్య ప్రదర్శనా? రెండూ కావు. అదొక నూతన ప్రక్రియ. అది ప్రదర్శనా ప్రసంగం. గవర్నర్ త్రివేదిగారు నన్ను పిలిచి ప్రత్యేకంగా అభినందించారు. ఆనాటి నుండి నీలం సంజీవరెడ్డి గారు నన్ను అత్యంత ఆత్మీయతతో చూస్తూ వచ్చారు. విశ్వవిద్యాలయ విద్యార్థులకు అదొక విజ్ఞాన వినోదమైంది. ఆనాటి నుంచి నా ప్రదర్శనా ప్రసంగం గురించి ఆంధ్ర దేశం నలుమూలలా అందరకూ తెలిసింది. ఎక్కడెక్కడి వారు నన్ను ఆహ్వానించడం మొదలుపెట్టారు. ఎన్ని ప్రసంగ ప్రదర్శనలు ఇచ్చానో చెప్పలేను. కాని కొన్ని ముఖ్య కార్యక్రమాలు నా మదిలో నిలిచిపోయాయి. వాటిలో కొన్నింటిని ఇక్కడ తెలియజేయాలి. ఆనాటి నుండి నా నాట్యకళా ప్రచారం నిర్విఘ్నంగా జరిగింది. నా ఉపన్యాసాలు విన్న ఆనాటి విద్యార్థులు ఈనాడు పెద్దవారైనా నా ప్రసంగాలను మరిచిపోలేదు. ఎప్పుడైనా వారు నన్ను కలిస్తే వారే నన్ను పలకరించి, నా ఉపన్యాసాల గురించి చెప్తూ ఉంటారు.

ఆ రోజుల్లో నెలకు మూడు వారాలు పర్యటించి, వివిధ పట్నాలలో ప్రసంగించిన సందర్భాలు ఉన్నాయి. అదొక ఉద్యమం, అదొక ఉత్సాహం, అదొక ఆనందం. నా ఆంధ్రదేశం విస్మరించిన నృత్యకళను నేను ప్రచారం చేసి, వెలుగులోకి తెస్తున్నానన్న తృప్తి నాకుండేది.

కొన్ని చోట్ల నా ఉపన్యాసం ముగిసిన తర్వాత నిర్వాహకులు నాకు కొంత డబ్బు ఇవ్వబోయేవారు. నాకు మొదట్లో ఆశ్చర్యం వేసింది. ఉపన్యాసాలకు డబ్బు యిస్తారా? అని. మర్యాద పూర్వకంగా డబ్బును నిరాకరించేవాణ్ణి.

ఒకసారి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొయ్యల గూడెం స్కూలువారు నన్ను ఆహ్వానించారు. అక్కడొక త్యాగమూర్తి మన్య ప్రాంతాల బాలబాలికలకు ఒక పాఠశాలను స్థాపించారు. ఆ పాఠశాలలో నా ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఆ రోజు సాయంత్రం నేను ఏలూరు నుండి కారులో ఆ వూరు వెళ్ళాను. శ్రీ బండి శ్రీహరిరావు నాయుడుగారు ఆనాటి సభకు అధ్యక్షత వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, ఊరి పెద్దలు ఆ సభకు వచ్చారు. నా ప్రదర్శనా ఉపన్యాసం చూసి, విని, అందరూ తన్మయులయ్యారు. శ్రీహరిరావు నాయుడుగారు నన్ను అభినందించి, "ఇది చాలా కష్టమైన విద్య! నీ ప్రచారంలో ఒంటరిగా ఎలా ప్రయాణిస్తావో. నీ లక్ష్యాన్ని ఎలా సాధిస్తావో, ఏటికి ఎదురీదుతున్నావు. నీకు ఆ భగవంతుడు తోడుగా ఉండాలని ఆశీర్వదిస్తున్నాను" అన్నారు.

తర్వాత వారి ఇంట్లో భోజనాలు చేశాం. తిరుగు ప్రయాణానికి కారు ఎక్కేముందు ఆ త్యాగమూర్తి నన్ను ఇంట్లోకి పిలిచి, "నాయనా! నీకు సమ్మానం ఎంత చేయాలో చెప్పావు కావు" అన్నారు. "అమ్మా! వేదిక మీద పూలదండ వేశారు గదా! అది నాకు చాలు" అన్నాను. 'అది కాదు నాయనా!...' అంటూ ఆగిపోయారు. 'అమ్మా! ఉపన్యాసాలను కూడా వెలకు అమ్ముకొంటారా?' 'నాయనా! కొద్ది రోజుల క్రితం ఒక ప్రఖ్యాత కళాకారుణ్ణి ఉపన్యాసం ఇమ్మని ఆహ్వానిస్తే, "ఇంత యిస్తే వస్తాను" అన్నాడు. అందుకే నిన్ను అడిగాను. ఏమీ అనుకోకు" అంటూ పట్టు శాలువ తెచ్చి నాకిచ్చి "మా పాఠశాల జ్ఞాపకార్థం ఇది ఉంచుకో" అన్నారు.

ఆంధ్ర నాటక కళాభివృద్ధి కోసం ఆంధ్ర నాటక కళా పరిషత్తు ఉండేది. ఆంధ్ర దేశంలోని పెద్దలు ఎందరో దానిలో సభ్యులుగా ఉండేవారు. ఆ పరిషత్తులో సమ్మానింపబడడం చాలా గొప్పగా నటులు భావించేవారు. నటీనటుల కళా సేవకు అదొక పెద్ద గుర్తింపు. ఒకసారి మచిలీపట్నంలో నాటక కళా పరిషత్తు సభలు జరిగాయి.

నా నృత్య కళా ప్రచారం, నా ఉపన్యాసాలు, పత్రికలలో నా వ్యాసాలు, ఆంధ్రలో నేను తీసికొని వస్తున్న కళా చైతన్యం గురించి తెలిసికొన్న కళాపరిషత్తు నిర్వాహకులు నన్ను ఆ సభలకు ఆహ్వానించారు. ఒకనాటి సాయంత్రం నా ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి సభ నాటక కళా వేత్తలు, కళాకారులు, రచయితలు, ఇతర ప్రేక్షకులతో నిండిపోయింది. మొదటి వరుసలో శ్రీయుతులు ఎం.ఆర్. అప్పారావు, పసల సూర్య చంద్రరావు, మాధవ పెద్ది వేంకటరామయ్య, స్థానం నరసింహారావు, డి.వి. సుబ్బారావు, పులిపాటి వేంకటేశ్వర్లు, శ్రీమతి పూర్ణిమ మొదలగువారు


స్థానం నరసింహారావు

కూర్చున్నారు. కార్యదర్శిగారు నన్ను వేదికపైకి ఆహ్వానించారు. నేను వెళ్ళాను. నన్ను చూసి, అందరూ ఆశ్చర్యపోయారు. "నటరాజ రామకృష్ణ అంటే ఎవరో పెద్దవారనుకొన్నాం. ఇంత చిన్నవానికి ఇంత పెద్ద సభలో సమ్మానమా?" అని కొందరు చెవులు కొరుకున్నారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన నాటక బృందాలవారు ఆ సభలో ఉన్నారు. వారిలో తెనాలి పురపాలక బృందం ఒకటి ఉంది. "ఎవరో ఈతనికి కావలసినవారు పరిషత్తులో ఉండి ఉంటారు. వారే ఈ సమ్మానం ఏర్పాటు చేసి ఉంటారు. లేకుంటే ఇంత చిన్నవాణ్ణి పరిషత్తు సమ్మానించడమా?" అంటూ చులకనగా, హేళనగా కొందరు అన్నారట, నన్ను ఎక్కువగా విమర్శించినవారు తెనాలి వారట!

నా ఉపన్యాసం మొదలు పెట్టాను. రెండు గంటల సేపు ఏకధాటిగా ఆడి, పాడి, అభినయించి, ఉపన్యసించాను. భరత విద్య గురించి వివరించాను. వివిధ వాయిద్యాలను నా బృందం వారి చేత వాయింపించి, ఏయే ప్రాంతాలలో, ఏయే వాయిద్యాలు వాడుకలో ఉన్నాయో చెప్పాను. వాటి ప్రాముఖ్యాన్ని వివరించాను. భౌగోళికంగా అవి రూపొందిన తీరు తెలియజేశాను. ఆంగికం, వాచికం, సాత్వికం వీటిని గురించి వివరిస్తూ తెలుగు, సంస్కృత గ్రంథాలలో నుండి ఉదాహరణ లిస్తూ భరత విద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రయోగికంగా వివిధ నాట్యాంశాలను ప్రదర్శించాను. అభినయించాను.



అదొక అద్భుతమైన సభ, నేను ఎన్నటికీ మరువలేని సభ. "మన ఆంధ్రదేశంలో ఇంత ఉత్తమోత్తమైన నృత్యకళ ఉందా! మరుగున పడిన కళను మనం గుర్తించలేక పోయామే! చిన్నవాడైనా ఇతడు మన కళ్ళు తెరిపించాడు" అంటూ చాలా మంది పెద్దలు ఆశ్చర్యపోయారు. ఆనందించారు. నన్ను అభినందించారు.

నా ప్రదర్శన ముగియగానే హరిశ్చంద్ర (డి.వి.) సుబ్బారావుగారు పరుగుపరుగున వేదికపైకి వచ్చి, నన్ను కౌగిలించుకొని, నా బుగ్గలు చిదిమి ముద్దు పెట్టుకొని, ఆనంద భాష్పాలు రాలుస్తూ, "ఇంత చిన్న వయస్సులో ఎంత గొప్ప కళను అభ్యసించావు బాబూ! నీ కళ సరస్వతీ వర ప్రసాదం. పవిత్రంగా ఆరాధించు," అంటూ ఆశీర్వదించారు.

తర్వాత తెనాలి బృందం వారు వచ్చి, నాకు క్షమాపణ చెప్పుకొనడమే కాక, నన్ను తెనాలి రమ్మని ఆహ్వానించారు.

ఒకప్పుడు తెనాలి నాటక నాట్య కళలకు ప్రసిద్ధి గన్న ఊరు. సిద్ధాబత్తుల రాఘవయ్య అనే గొప్ప నాట్య కళావేత్త తెనాలిలో ఉండేవారు. వారి శిష్యులే లంకా సూర్యనారాయణ శాస్త్రిగారు. ఈయనా మంచి కళా పండితుడు, నర్తకుడు, గురువు. నేను ఆంధ్రదేశం వచ్చే సరికి ఇక్కడి నాట్యకళా ప్రసిద్ధులు గతించారు. నాటక కళ మాత్రం బాగా అభివృద్ధి చెందింది.

ఒక ఆదివారం నాటి ఉదయం తెనాలిలో సభను ఏర్పాటు చేశారు. ఆ సభకు ఒక గొప్ప పండితుడు అధ్యక్షత వహించాడు. ఆయన అంధుడు. గుంటూరు, విజయవాడ, ఏలూరు మొదలైన ప్రాంతాల నుండి అనేక మంది నృత్య కళాకారులు వచ్చారు. సాత్వికాభినయం, వాచకం గురించి ప్రత్యేకంగా చెప్పమని నిర్వాహకులు నన్ను కోరారు. నా ప్రసంగమంతా విన్న అధ్యక్షులు, "బాబూ! ఇంత మధురంగా నీవు అభినయిస్తూంటే నా మనో నేత్రాలతో నీ కళను దర్శించగలిగానయ్యా! ఎంత గొప్పగా కళను సాధించావయ్యా!" అన్నాడు. ఇక మాధవపెద్ది వేంకట్రామయ్యగారు "భేష్! రామకృష్ణా! నా కన్నా చిన్నవాడివి గనుక నిన్ను నేను దీవించాలిగాని నీలోని కళా సరస్వతికి నేను చేతులు జోడిస్తున్నా" నయ్యా! అన్నారు. ఆయన తీరు, ఆయన హుందాతనమే వేరు. సభవారి జ్ఞాపకార్థం ఒక వెండి సమ్మాన పత్రం, నిత్యపూజకు పనికి వచ్చే, సరైన కొలతలు గల ఒక చిన్న నటరాజ విగ్రహం ఆ సభ వారు నాకు బహూకరించారు. ఆ విగ్రహాన్నే నేడు కూడా నేను ఆరాధిస్తున్నాను. ఇతర జ్ఞాపికలతోపాటు వారిచ్చిన సమ్మాన పత్రం శ్రీ పి.ఎస్. రెడ్డి గారు స్థాపించిన "సెంట్ డోమినిక్ నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం పేరిణీ రిసెర్చి సెంటర్", మలక్‌పేట, హైదరాబాద్‌లో ఉంది. ఈ నలభై సంవత్సరాలలో సమ్మాన పత్రాల భాషలో వచ్చిన మార్పులను ఎవరైనా అధ్యయనం చేస్తే పనికి వస్తాయని నాకు వచ్చిన ఆ సమ్మాన పత్రాలను అక్కడ భద్రపరిచాను.



# ఇతిహాసంలో కవలలు

- జొన్నలగడ్డ మార్కండేయులు

సంతానం విషయంలో 'ఒకరి తరువాత అసలు వద్దు' అనేది చైనా దేశ నినాదము. మనదేశము కూడ 'ఇద్దరు లేక ముగ్గురు' చాలు అని ప్రజలలోకి నినాదాన్ని ప్రవేశపెట్ట గలిగింది. అయితే సృష్టి చాల విచిత్రమైంది. మూడో సంతానంలో అరుదుగ ఒకే కాన్పుగా ఒకేసారి కవలలు జన్మించడం సంతాన నిరోధక నినాదానికి సృష్టి విసిరిన సవాలు అనలేము కాని, జరుగుతోందన్నది వాస్తవము.

ఇద్దరుకన్నా కూడా ఒకే కాన్పులో అధిక సంతానము జన్మిస్తే శాస్త్రీయ కారణాలు ఎన్ని చెప్పుకున్నా సృష్టి విచిత్రమే అనడం మానవ సహజము.

అసలు గర్భస్థ శిశువు ఊపిరి పోసుకొని భూమిమీదకు రావడము ఒక అద్భుతము. అలాంటిది ఇద్దరు శిశువులు ఒకేసారి జనాభా లెక్కలలోకి కవలలుగా ప్రవేశించడము మరింత ఆశ్చర్య, ఆనందహేతువవుతోంది. విచిత్రమేమిటంటే ఈ కవల పిల్లలు 1. ఒకేలా ఉంటారు. 2. వేరువేరు పోలికలలో ఉంటారు. 3. ఆడ, మగ లేదా ఒక ఆడ, ఒక మగ జంటగా పుడతారు. 4. అంటిపెట్టుకుని ఒక్కరిగా (Siamese) జీవితాంతము ఇద్దరూ లేదా శస్త్రచికిత్స ద్వారా వేరుచేయబడితే విడివిడిగా జీవించే కవల పిల్లలు – ప్రపంచ వ్యాప్తముగా వున్నారు.

ఒకే అండము రెండుగా ఫలదీకరణము వల్లగాని, వేర్వేరు అండాలు విడివిడిగ ఫలధీకరణము వల్లగాని, రెండు అసంపూర్తి అండఫలదీకరణ వల్లగాని మనము చూస్తున్న కవల శిశు జననానికి కారణమని శాస్త్రజ్ఞులు అంటారు. తొంభైమంది దంపతులలో ఒకజంట కవలపిల్లల తల్లిదండ్రులవుతున్నా రన్నది ప్రపంచ సర్వే. అందుచేత వంశపారంపర్యముగ లేదా ఇతర కారణాలవల్ల కవలలు ఎలా జన్మిస్తారన్నది, వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుందన్నది శాస్త్రవిజ్ఞాన పరిధిలోకి వచ్చింది.

ఆహార సమస్య అధికంగా ఉన్నరోజులలో కవల శిశువులు పుట్టడము అవాంఛనీయము. అనాదికాలంలో ఈ కారణముచేత కవల శిశు జననము అశుభము అని ప్రచారము చేశారు. అమెరికన్ సంచారజాతులలో కవలలో ఒకరికి దైవాంశ, రెండవవారికి పిశాచగుణాలు ఉంటాయని భావిస్తారు. మాంత్రికుల కథలలో సృష్టింపబడిన కవలలు అమానుషంగా ప్రవర్తిస్తారు. బైబిలులో జాకబ్, ఈసోలు కవల పిల్లలు. ఇసాక్, రెబెకా దంపతుల సంతానము. ఈ కవల సంతానము గర్భవాసము నుంచే ఆధిపత్య పోరుకు తలపడ్డారు. గ్రహరాశులలో 'మిధునరాశిలా' ప్రపంచ వ్యాప్తముగ ప్రసిద్ధికెక్కిన 'జెమిని' కవలలు ప్రేమకు చిహ్నాము.

ఈ విధంగ కవలలు కొన్ని ప్రత్యేక గుణాలు కలిగి ఉంటారన్నది ఇతిహాస కాలంనుంచీ వస్తున్న నమ్మకము. మన పురాణాలలో కవలలు కూడ ప్రత్యేక వ్యక్తిత్వము కలిగి ఉన్నారు. దేవతలలో అశ్వనీ దేవతలు (Siamese) కవలలు అని చెప్పడానికి అవకాశముంది. వారు మాద్రికి నకులసహదేవులను కన్నారు. వైద్యశాస్త్ర ప్రతిభులైన ఆ ఇద్దరూ విడివిడిగ ప్రవర్తించినట్లు కనిపించదు. నాసత్యుడు, దస్రుడు – అను పేర్లతో అశ్వినులుగ జంటగ ప్రత్యక్షమై ఏకవ్యక్తిగానే కర్తవ్యాన్ని నిర్వహించారు. నకుల, సహదేవులు వేరువేరుగానే జీవించారు.

రామాయణంలో వాలి, సుగ్రీవులు కవలలు. శ్రీరాముడంతటివాడే వారిరువురుని ఒకే పోలికనుబట్టి ఆనవాలు పట్టలేకపోయాడు. సోదర ప్రేమకన్న ఒకరిపై ఒకరు

డా॥ జొన్నలగడ్డ మార్కండేయులు, సెల్ : 94402 19338

ఆధిపత్యానికి ఈ కవలలు మొగ్గుచూపారు. తాత్కాలిక విజయమైనా, శాశ్వత విజయమైనా ఈ ఆధిపత్యపోరులో వారి భార్యలు విజయుడైనవారి పక్షానే సంసారము చేశారు తప్ప పాతివ్రత్య ధర్మాన్ని పాటించలేదు. ఈ ఆధిపత్యము కోసమే సుగ్రీవుడు రాముడినాశ్రయించి అన్న వాలిని చంపుకున్నాడు. వానరరాజై అన్న అపహరించిన భార్య రుమతో బాటు అన్న భార్య తారను కూడ స్వీకరించాడు.

ఇలా కవలల స్వభావానికి దోహదము చేసే శాస్త్రీయాంశ పరిశీలన దృక్పథము మెదడుకు మంచి పదును అవుతుంది. ఈ శాస్త్రీయ దృక్పథము విజ్ఞాన శాస్త్ర అండ ఫలదీకరణ సిద్ధాంతముననుసరించి ప్రయత్నిస్తే కష్టము కాదని రామాయణములోనే మనకు ఉదాహరణ లభిస్తుంది.

లక్షణుడు, శత్రుఘ్నుడు కవలలు. అయితే లక్ష్మణుడు రాముడిని, శత్రుఘ్నుడు భరతుని అంటిపెట్టుకుని తిరిగారు. యజ్ఞ పాయసమును కొంచెంసేపు ఆనాటి సంతాన ప్రాప్తవిజ్ఞాన శాస్త్రీయ అండ ఫలదీకరణ రసాయనముగ భావిద్దాము. లక్ష్మణ శత్రుఘ్నుల స్వభావానికి కారణము కనిపిస్తుంది.

యజ్ఞపాయసము కౌసల్య కైకేయిలకు రెండు భాగాలుగా ఇవ్వబడింది. వారిద్దరూ చెరిసగం లక్ష్మణ, శత్రుఘ్నుల తల్లి సుమిత్రకిచ్చారు. అంటే కౌసల్యభాగంలో కొంచెము, కైకేయి భాగములో కొంచెము వేర్వేరుగ తీయబడి సుమిత్ర గర్భంలో ప్రవేశించాయి. విజ్ఞానశాస్త్ర ఫలదీకరణ సిద్ధాంతము ననుసరించి పాయసములోని రెండు అండాలు నాలుగు అండాలుగ ఫలదీకరణమై శిశువులుగా అభివృద్ధిచెందాయి. కవలలుగా జన్మించినప్పటికీ లక్ష్మణ శత్రుఘ్నులుగా కాక రామలక్ష్మణుల, భరతశత్రుఘ్నులు అనే జంటగ ప్రసిద్ధికెక్కడము గమనార్హము.

రామలక్ష్మణులు, భరతశత్రుఘ్నులు ఏక గర్భవాసులు కానప్పటికీ, లక్ష్మణ–శత్రుఘ్నుల వేరే గర్భవాసాన ఊపిరి పోసుకున్నప్పటికి లక్ష్మణుడు రామునికి, శత్రుఘ్నుడు భరతునికి ఆకర్షితులయ్యారు. లక్ష్మణ శత్రుఘ్నులు ఒకే పోలికలో ఉన్నారో లేదో చెప్పబడలేదు కాని ఆ కవలలు పరస్పర స్నేహముకన్న తాము విడివడిన రామ, భరత జనన కారణ పాయస ప్రధాన భాగానికే ఆకర్షితులవడము వెనుక యజ్ఞపాయసము ఆనాటి శాస్త్రజ్ఞుల విజ్ఞానశాస్త్ర పాండిత్యము కలిగి ఉందని భావించవచ్చు.

పాయసము త్రాగితే పిల్లలు పుడతారా అని ప్రశ్నించే ఆకతాయి విద్యార్థికి సమాధానము చెప్పలేకపోతున్నామని వాపోయే ఉపాధ్యాయ వర్గము ఇతిహాస పాఠ్యాంశాలు బోధించరానివి అని భావించకూడదు. శాస్త్రీయ విజ్ఞాన పరిశీలన ప్రబోధముతో అభూత కల్పనలపై నిజానిజాల పరిశోధనాసక్తి కలిగించాలి. హైడ్రోజను, ఆక్సిజను విడివిడి మూలకాలుగా ఉంటే మండించే స్వభావాన్ని కలిగి ఉంటాయి. $H_20$ సంయుక్త మూలకముగ నీరు ఏర్పాటు చేయగలవేమో కాని నీటికి మండే గుణాన్ని సంక్రమింపజేయలేవు. మరి వాటి సహజగుణము సంయుక్త మూలకములు కోల్పోయిందన్న శాస్త్రీయ సమాధానము ఇతిహాస కవలలోనే కాదు అభూత కల్పనలలో కూడ దాగి ఉంటాయని ప్రబోధించడమే ఈ వ్యాస ఉద్దేశము.

## చురక



1915లో టంగుటూరి ప్రకాశం గారు మద్రాసులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న రోజుల్లో ఓనాడు వాదించవలసిన కేసుకు సంబంధించిన లా పుస్తకాలు బంట్రోతు చేత మోయించుకుని ఆయన కోర్టుకు వచ్చారు.

కోర్టులో ఎదురైన ఒక ఆంగ్ల వకీలు "ఏం ప్రకాశం నువ్వు కూడా లా పుస్తకాలు తీసుకెళుతున్నావు – నువ్వు బార్–ఎట్ – లా అని ఇన్నాళ్ళుగా నేను అనుకుంటున్నానే" అని ఎత్తిపొడుపుగా అన్నాడు.

అందుకు ప్రకాశం గారు 'అవి నా కోసం కాదు, జడ్జిగారి కోసం' అని వెళ్ళిపోయారు. ఆంగ్ల వకీలు తలదించుకు వెళ్ళిపోయాడు. అప్పట్లో న్యాయమూర్తులు ఎక్కువమంది ఆంగ్లేయులే ఉండేవారు.

# ఎరుకల బ్రతుకులు

- కోడావత్ బానునాయక్

*"ఎరుక సెబుతానమ్మా ఎరుక సెబుతాను...*
*మనసులోని మాట సెబుతాను తల్లీ...*
*ఉన్నది ఉన్నట్లు సెబుతాను*
*లేనిది లేనట్లు సెబుతాను తల్లీ...*
*నీ ఎదలో ఏవుందో తెలుసుకొని, ఐదు సెరులు బియ్యం,*
*పదిరూపాయలు అక్కడపెట్టు తల్లీ...*
*అంబ పలుకు జగదంబ పలుకు*
*బెజవాడ కనకదుర్గమ్మ పలుకు*
*కంచి కామాచ్ఛమ్మా పలుకు*
*నా నోట నిలిచి నా వాక్కునే నిలిచి*
*సత్తమే పలికించవే తల్లీ...*



అని పాడుకుంటూ వీధుల్లో తిరిగే స్త్రీలు మనకు అక్కడక్కడా కనిపించేవాళ్లు. ఈ విధంగా పాడే ఎరుకల స్త్రీలు, స్త్రీ దేవతలేకాక, పురుష దేవతలను కూడా ప్రార్థిస్తారు. ఈ ప్రార్థన వలన సోదె (ఎరుక) చెప్పే స్త్రీ వాక్ చాతుర్యం, సోదె చెప్పించుకున్న వారికి మనోధైర్యాన్నిస్తుంది.

ఎరుకల వారికి 'సోదె' ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. 'సోదె' అనే తెలుగు పదాన్ని ఎరుకల భాషలో 'కోరో' లేక 'కోరతి' అంటారు. సోదెను ఎరుకల స్త్రీలు మాత్రమే చెబుతారు. పురుషులు చెప్పరు. సోదెచెప్పే స్త్రీలను మన రాష్ట్రంలో "ఎరుకలసాని" అని, కర్ణాటకంలో – 'కురవంజి' అని అంటారు. ఎరుకలవాళ్ళు కుటుంబపోషణ కోసం, 'సోదెను అనాదిగా వృత్తిధర్మంగా స్వీకరించారు.'

ఎరుకలకు స్థిరనివాసం ఉండదు. ఎందుకంటే వీరు 'సంచారజాతివారు.' వీళ్ళు ఎక్కువగా 'నీటి పరీవాహక ప్రాంతాలలోను, చెరువుగట్టు మీద, వాగులు, వంకలు దగ్గర జీవనం కొనసాగిస్తూ ఉంటారు. వీరు పుట్టుకతోనే "మాంసాహారులు." జంతువులను, పక్షులను వేటాడి పచ్చి మాంసాన్ని మంటల్లో కాల్చి తినడమూ, ఎప్పటికప్పుడు ఆహారాన్ని సంపాదించుకుంటూ, జీవనం సాగిస్తారు.

ఎరుకల వారికి పందుల పెంపకం ప్రధానవృత్తిగా స్థిరపడింది. ఇంకా బాతుల పెంపకం, బుట్టలు అల్లడం, చాప అల్లకం, చీపుళ్ళు తయారుచేయడం మొదలైన వృత్తులపై ఆధారపడి జీవిస్తూ ఉంటారు. కాని నేడు వీరి జీవన విధానం పూర్తిగా మారిపోయి, నాగరిక జీవనానికి అలవాటుపడినారు. అయినా ఇంకా ఎరుకలలో తమ సాంప్రదాయాలను వీడకుండా జీవిస్తూ, దుర్భర దారిద్ర్యానికి, నాగరికతా లేమికి, సంకేతాలుగా మిగిలిపోయి 21వ శతాబ్దం సిగ్గుపడే విధంగా జీవించే వారు కోకొల్లలు. ప్రస్తుత సంస్కరణలు, నిధులు వీరికి అందడం లేదనేది కఠోర వాస్తవం.

ఈ పందుల పెంపకం వలన అనారోగ్య వాతావరణంలో జీవిస్తూ, ఎదుగుదల లేని మేధతో, సమాజం చేత చిన్నచూపు

కోడావత్ భానునాయక్ సెల్ : 99514 59841

చూడబడడం జరుగుతుంది. ఈ పందుల పెంపకాన్ని శాస్త్రీయ దృక్పథంతో అభివృద్ధిచేసిన ఈ క్షేత్రాలను ఊళ్ళకు, నగరాలకు దూరంగా ఏర్పరచడం అవసరమైవుంది. ఈ ఎరుకల తెగ దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మొదలైన ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నారు. ఎరుకల వారిని ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో - ఎరుకలు,తమిళనాడు - కొరవన్/ కొరచ, కర్ణాటక - కొరమ / కోరచ, మహారాష్ట్ర - కైకాడ, కేరళ - సిద్ధనార్, పాండిచ్చేరి - కట్టునాయకర్, మధ్యప్రదేశ్ - కుర్రు. ఎరుకలను ఏ రాష్ట్రంలో ఏ పేరుతో పిలిచినా, వీరి బ్రతుకుల్లో మాత్రం మార్పురాలేదు.

ఎరుకల వారి జీవన విధానం, ఆహార సంప్రదాయాలు, సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే కొన్ని విశ్వాసాలను, కులకట్టుబాట్లను, ఇంటిపేర్లను, గోత్రాలను, వివాహ పద్ధతులను తెలుసుకొనవలసిన ఆవశ్యకత వుంది. వీరు ఉపయోగించే మౌఖిక భాషనుబట్టి తమిళం-కన్నడం -మరాఠీ భాషల సంకరంగా కన్పిస్తుంది. ఉదాహరణకు “రూపాయిని” ఉచ్ఛరించే తీరును తీసుకొంటే అవగతం కాగలదు.

| **తెలుగు** | **ఎరుకల భాష** |
|---|---|
| ఒక రూపాయి | ఒందు |
| ఐదురూపాయలు | అంజురూపాయి |
| ఎనిమిది రూపాయలు | ఎట్ |
| తొమ్మిది రూపాయలు | ఒంబిడి రూపాయి |
| పదిరూపాయలు | పత్తురూపాయి |
| పన్నెండు రూపాయలు | పొదునెండు రూపాయి |
| పదిహేను రూపాయలు | పొదునెంజ్ రూపాయి |
| పదిహేడు రూపాయలు | పొదునేగ్ రూపాయి |
| ఇరవై రూపాయలు | ఇడ్డి రూపాయి |
| ఇరవైఐదు రూపాయలు | ఇరవత్ అంజ్ రూపాయి |
| యాభై రూపాయలు | అంజర్ పొత్తు రూపాయి |
| పద్దెనిమిది రూపాయలు | ఒమ్మిది మాడలు. |

ప్రథమంగా వీరి ఆహారపు అలవాట్లు, కొంత భిన్నంగా ఉంటాయనే విషయం మరిచిపోకూడదు. ఈ విషయాన్ని తరచిచూస్తే హృదయ విదారకమైన విషయాలు బహిర్గతంమౌతాయి. వీరు ఎలుకలను, పిల్లులను, పందులను ముంగిసలను వేటాడి తినడం వలన వీరి ఆహారపు అలవాట్లు ఆదిమ మానవుని ఆహారపు అలవాట్లకన్నా భిన్నంగా లేవన్నవిషయం వ్యక్తమౌతుంది. మనతో వున్న సామాజికుడు అటవిక సంప్రదాయాల్ని అనుసరించడానికి గల కారణం మనం వారిని సభ్యసమాజానికి దూరంగా వుంచడమే!

ఎరుకల సంస్కృతిలో భాగంగా వారి భాషను పరిశీలిస్తే అది ‘ఎరుకల భాష’, ‘కులవాద’, ‘కుర్రుభాష’ అని అంటారు. ఇది ద్రవిడియన్ భాషా కుటుంబానికి చెందినదని భాషాపండితుల అభిప్రాయం - ఎరుకలకు సాహిత్యం లేదు. గ్రంథాలులేవు. అయితే ‘లిపి’ కనిపెట్టే దిశలో పండితు లున్నారని తెలుస్తుంది. వీరి కులదేవతలు ఉప్పలమ్మ, ఎల్లమ్మ లాంటి వారు. హిందువుల పండుగలను జరుపుకొంటారు.

వివాహ పద్ధతులు కూడా గిరిజనుల పద్ధతిలోనే వుంటాయి. కల్లు, సారాయి తప్పనిసరి. వివాహ ఒప్పందాలు రద్దయితే కులపెద్దలు తప్పువేసి జరిమానా విధిస్తారు. వీరిలో స్త్రీ ఏడుసార్లు వివాహం చేసుకోవడానికి అర్హత కలిగి వుంటుంది. ఇది స్త్రీ స్వేచ్ఛను సూచిస్తుంది. కానీ నేడు ఆధునిక ప్రభావం వలన కొంత వెనుకబడి, హిందూ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. కుల కట్టుబాట్లు చాలా కఠినంగా వుంటాయి. ఈ కుల కట్టుబాట్లను పరిష్కరించడానికి అయిదుగురు సభ్యులుగల “బెరోమనుసమ” అనే కుల పంచాయితీ పనిచేస్తుంది. దీనికి ముఖ్యాధికారాలు ఉంటాయి. ‘దొంగతనాలు, వ్యభిచార ఆరోపణలు, భూమి తగాదాలు, ఆస్తివివాదాలు మొదలైన విషయాలను ‘బెరోమనుసమ’ అనే వ్యవస్థ పరిష్కరిస్తుంది. అంతేకాకుండా “ఎర్రగా కాల్చిన గునపాన్ని పట్టుకోవటం, ‘మరుగుతున్న నూనెలో చేయిపెట్టడం, ‘నిప్పులపై నడవడం’ ‘చుక్కనీరు కింద పడకుండ నిండుకుండతో నడవడం మొదలైన శిక్షలు అమలులో ఉండేవి. వీరి కులబహిష్కరణ అతి పెద్దశిక్ష. వీరి ఇంటిపేర్లు పాలపర్తి, పల్లకొండ, పురిశారి, మాదెగాని, తిరుపతి, మానుపాటి, కొతాటి, దేవరకొండ, గరికపాటి, వనం, చేట, కేతిరేని, సాదుపాటి, మల్లెల, బండి, తోకల మొదలైనవి. వీరి గోత్రాలు కూడా రెండు రకాలు. 1 కావాడి. 2. పాతుపడి. కావాడి నుంచి మేంద్రగుత్తి వస్తే రెండోదైన పాతుపడి నుంచి ‘మానుపడి’ అని రెండు ఉపగోత్రాలు వచ్చాయి. పాతుపడి, కావాడి గోత్రాలను ఉన్నతమైనవిగా భావిస్తారు.

కర్మకాండ పూర్తిగా హిందూ పద్ధతినే అనుసరిస్తారు.

దళిత కులాల్లో, మిగతా హైందవ కులాల్లో మాదిరిగానే ఎరుకుల్లో కూడా ఉప కులాలు వున్నవి. ఉపకులం వుండటం ఒక కులానికి గౌరవ చిహ్నంగా భావిస్తారు. ఈ ఎరుకల్లో ఇన్ని ఉపకులాలు భిన్నవృత్తులు వున్నవనే విషయం సభ్యసమాజానికి తెలియని విషయం. ఈ ఉపకులాలు 1. ఈతపుల్లి ఎరుకలు 2. దబ్బ ఎరుకలు 3. ఉప్పు ఎరుకలు 4. కరివేపాకు ఎరుకలు 5. కుంచపురి ఎరుకలు 6. పరిగముగ్గల ఎరుకలు 7. ఊరు ఎరుకలు 8. కావలి ఎరుకలు 9. కూటు ఎరుకలు 10. నార ఎరుకలు. ఈ కుల విభాగాన్ని చూసినప్పుడు అగ్రకులాల నుంచి 'నిమ్నకులాల వరకు, ఈ కుల వ్యవస్థ ఇన్ని చీలికలు వారికలుగా వుండటాన్ని బట్టి, ఈ కులవ్యవస్థ యొక్క భయంకర క్షుద్రస్వభావం అవగతం ఔతుంది.

ఎరుకలు, చారిత్రిక నేపథ్యాన్ని పరిశీలిస్తే క్రీ.శ. 950 నుండి క్రీ.శ. 1000 సం॥ మధ్య దాదాపు 50 సం॥రాలు "ఎరుకల దేవరాజు, అనుమకొండను పరిపాలించినట్లు తెలుస్తుంది. ఎరుకల దేవరాజు 'పంది' లేక 'వరాహ' ముద్రగల నాణాలను ముద్రించి చెలామణి చేయించినట్లు తెలుస్తుంది. ఎరుకల దేవరాజు చారిత్రక మూలపురుషుడని ఎరుకలవారు భావిస్తారు.

ఎరుకలు సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనం నుంచి ఇంకా విముక్తిపొందలేదని స్పష్టంగా చెప్పవచ్చును. మి

---

# గోపీచంద్

"ఆయన (శ్రీ గోపీచంద్) 1932వ సంవత్సరము "కొంచెం చదువు సంస్కారం గల అమ్మాయి కావాలి" అని పదునారు సంవత్సరముల ప్రాయం గల నన్ను వివాహం చేసుకున్నారు. వివాహం అయింది మొదలు సామాన్యురాలనైన నన్ను తమ అర్థశరీరంగా భావించుకున్నారు. శివుడు గంగను జటాఝూటంలో ధరించినట్లు ఎంతో గౌరవించారు. అటువంటి వారికి ఆత్మార్పణ గావించుకున్నాను. తమనర్థం చేసుకున్నందుకు చాలా సంతుష్టులయ్యారు. నాకు తెలిసిన దగ్గర నుంచి "దేవుడున్నాడా, లేడా?" అనే జిజ్ఞాసతోనే ఉండేవారు. ఈ సమస్యను గురించి చాలా మందితో వాదోపవాదాలు జరుపుతూ ఉండేవారు. నిరంతరం పూజలు సలిపే మాతృదేవికి ఉద్భవించడం వల్ల పూర్తిగా తండ్రిగారిని అనుసరించలేక పోయారేమో!



పితృదేవుల జ్ఞానాన్ని, సిద్ధాంతాలను సంతరించుకొని, జీవితం మొదట్లోనే హేతువాదిగా పైమెట్టుకు ఆరోహణ చేశారు కాని, అక్కడే తిష్ట వేయడానికి మనస్కరించక, ఇంకా పైకి ఆరోహణ చేయడానికి ఆరాటపడ్డారు. ఉన్నవ దంపతుల దగ్గర ఎనిమిది సంవత్సరముల శిక్షణ పొందిన నేను, మాష్టారు గారు ప్రార్థన చేస్తూ వుంటే, చూచి, వారు కూడా చెయ్యాలని దృఢ నిశ్చయులయ్యారు. భిన్న దృక్పథాలు కలవారైనా ఒకే గమ్యాన్ని సాధించిన మా మామగారు శ్రీ రామస్వామి చౌదరిగారూ, పితృతుల్యులు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు ఆప్తమిత్రులు. పంతులుగారు తెనాలి వచ్చినప్పుడు సూతాశ్రమములో దిగుతూ ఉండేవారు. ఒకసారి వచ్చినప్పుడు వారు (గోపీచంద్) పంతులుగారిని 'మాస్టరు గారి ప్రార్థనమూ, మంత్రమూ ఉపదేశం చేయమని' కోరారు. అడిగినదే తడవుగా ఎంతో ఆనందంతో పంతులుగారు వారికి మంత్రోపదేశం చేశారు. భారత భాగవత రామాయణములు కూడా చదవమని సలహా ఇచ్చారు.

ఆనాటి నుండి వారు పంతులుగారిని దీక్షనిచ్చిన గురువుగా భావించుకున్నారు. చివరి వరకు అవకాశాన్ని పురస్కరించుకొని తమ గురువుగారి ఔన్నత్యాన్ని శక్తివంచన లేకుండా చాటుతూ ఉండేవారు. 'చీకటి గదులు'లో కూడా శివకామయ్య పాత్రను పంతులుగారి నుద్దేశించి చాలా విశాలంగా వ్రాశారు.

1953వ సంవత్సరంలో ప్రచారశాఖ డైరెక్టరుగా గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశించారు. పెద్దవారితో స్నేహాలు, పరిచయాలు విరివిగా ఆరంభించారు. వారి పాదధూళితో మా గృహం పావనం కావటం మొదలు పెట్టింది. మజిలీ మజిలీకి ఎందరెందరితోనో స్నేహాలు చేస్తూ వుండేవారు. అవన్నీ ఒక ఎత్తు. మొదటి నుండి చివరి వరకు సోదరులు శ్రీ ఆవుల సాంబశివరావు గారితో చేసిన స్నేహం ఒక ఎత్తు. వారిద్దరు నరనారాయణులను మరిపించేటంత మైత్రితో ఉండేవారంటే అతిశయోక్తి కాదేమో!"

**– శకుంతలా గోపీచంద్**



# హేతువాదాన్ని ప్రస్తుతించిన
# తెలుగు కవులు



**- కోరు సుమతీ కిరణ్**

Rationalism అనే ఆంగ్ల పదం 'Ratio' 'Reason' అనే లాటిన్ పదాలనుండి వచ్చింది. దీన్నే తెలుగులో 'హేతువాదం' అంటున్నాం. హేతువు అనేది విశ్వక్రమంలో లయ, హేతుత్వం విశ్వక్రమం యొక్క ప్రతిధ్వని. భౌతిక ప్రకృతి అంతా నియమబద్ధమైంది. ప్రకృతి నుండి పుట్టిన మానవుడిలో ప్రతిధ్వనించడం వల్ల అతడు ప్రస్తుతం హేతువంతుడవు తున్నాడు. ఆలోచనలోని క్రమపద్ధతినే మనం హేతుత్వ మంటున్నాం. హేతువంటే కారణం. ఏ కారణంలేకుండా కార్యం జరుగదు. ప్రతి కార్యానికి కారణముండి తీరుతుంది. ఈ కార్యకారణసంబంధాన్ని గూర్చి ఆలోచించేదే హేతువాదం.

బ్రిటీషు రేషనలిస్టు ప్రెస్ అసోసియేషన్ వారు హేతువాదానికిచ్చిన నిర్వచనం దాని ఉనికిని పరిధిని చూపిస్తుంది. 'Rationalism may be defined as the mental attitude which unreservedly accept the supermacy of reason and aims at established system of philosophy and ethic verifiable by experience and independent of all arbitrary assumptions or authority.' హేతువాదమంటే హేతువునే ప్రధానంగా అంగీకరించే మానసిక వైఖరి. అహేతుకమైన భావాలకు, ప్రమాణాలకు తావు లేకుండా ప్రయోగాత్మకంగా రుజువు చేయడానికి వీలైన దర్శనాల్ని, నీతి శాస్త్రాల్ని నిర్మించుకోవడమే దాని లక్ష్యం. విజ్ఞానం హేతువికాసానికి, హేతుత్వం జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుంది. జ్ఞానం సత్యాన్ని తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది.

ఏ విషయాన్నైనా తెలుసుకున్నంతవరకే సత్యమౌతుంది. కాబట్టి తెల్సిన విషయాల్నే సత్యంగా భావించాలి. సత్య పరిజ్ఞానంవల్లే స్వేచ్ఛా ప్రవృత్తి వస్తుంది. స్వేచ్ఛా ప్రవృత్తి వల్ల వున్న అవరోధాల్ని తొలగించుకుంటాం. వెనుకటి సత్యంకంటే సమగ్రమైన సత్యాన్ని మానవుడు తెలుసుకుంటూనే వుంటాడు. కావున హేతుత్వం, జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ అనేవికూడా ఒక క్రమంలో వుండి నీతికి మార్గం చూపడానికి ఉపకరిస్తాయి.

హేతువాద ఆలోచనావిధానం కర్మల్ని, పునర్జన్మల్ని, మూఢనమ్మకాల్ని బద్దలుగొట్టే స్వతంత్ర్యమైన ఒక ఆలోచనా విధానం. శాస్త్రబద్ధమైన నిర్ణయాలకు దారితీసే ఒక గొప్ప సాధనం. ఇది నాస్తికత్వానికి కొంత భిన్నంగా వుంటుంది. దీనికి నిర్ధిష్టమైన అభిప్రాయాలుండవు. ఎప్పుడైతే ఒక విషయం శాస్త్రీయంగా తప్పు అని తెల్సిందో దాన్ని దిద్దుకోవడానికి, మార్చుకోవడానికి సిద్ధంగా వుంటుంది.

1895 సంవత్సరంలో లండన్ రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్ హేతువాదానికి సంబంధించిన ఒక నియమావళిని తయారుచేసింది. మానవ సమస్యల్ని హేతువాద దృక్పథంతో చూడడం, మతపరమైన జీవితానికి బదులు నిర్ధిష్టమైన మార్గాల్ని చూపడం, సాధ్యమైనంత వరకు శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రజాక్షేమం కోసం వినియోగించడం, మానవ స్వేచ్ఛని స్వతంత్ర్య భావాల్ని రక్షించడం ఈ సిద్ధాంతాల్ని పుస్తకాల ద్వారా, పత్రికల ద్వారా ప్రచారం చేయడం ఈ నియమావళిలోని ప్రధానాంశాలు. ఈ అసోసియేషన్ హేతువాదాన్ని ఒక ఉద్యమంగా నడిపించడానికి పూనుకుంది.

భారత హేతువాద సంఘాన్ని 1949 సంవత్సరంలో మద్రాసులో నెలకొల్పారు. అయితే అంతకుముందే 1930 సంవత్సరంలో పురోహితవర్గ వ్యతిరేక సంస్థ పేరుతో

కోరు సుమతీ కిరణ్, సెల్ : 9949478251

బొంబాయిలో ఏర్పడిన సంస్థ ఆధ్వర్యంలో Reason అనే పత్రిక వెలువడడం కారణంగా అదే మొదట హేదువాద ఉద్యమంగా భావించేవారూ వున్నారు. 1972 సంవత్సరం నుండి 74 సంవత్సరం వరకు గోరా భారత హేతువాద సంఘానికి అధ్యక్షులుగా వున్నారు. ఆ కాలంలోనే 1973 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ హేతువాదసంఘం ఏర్పడింది. గోరాగారి కుమారుడైన లవణంగారు ఆ రాష్ట్రశాఖకు అధ్యక్షులుగా వున్నారు. ప్రారంభం నుండి హేతువాద ఉద్యమంలో తెలుగువారు ప్రముఖపాత్రనే పోషించారు.

కవి, రచయిత, సంఘసంస్కర్త అయిన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి తెలుగుసాహిత్యంలో మొట్టమొదట హేతువాద దృక్పథంతో రచనా వ్యాసాంగం చేశారు. కర్మ, పునర్జన్మ లాంటి మూఢనమ్మకాలకు, కులం గోత్రం అస్పృశ్యతల వంటి సాంఘిక అసమానతలకు కారణం వేదవాఙ్మయం కాబట్టి వేదాల్ని, వాటిని సృష్టించిన వేదఋషుల్ని సహేతుకంగా విమర్శించారు. వీరు చారిత్రక దృష్టితో, శాస్త్రీయ దృక్పథంతో పురాణాల్ని పరిశీలించి "పిట్టకథలకు నివియెల్ల పుట్టినిళ్ళు" అని పురాణాన్ని పురాణ పురుషుల్ని కొట్టిపారేశారు. వేదసాహిత్యంపై ఘాటైన విమర్శచేశారు.

కవిరాజు సృష్టించిన హేతువాద దృక్పథం అనేకమంది అనంతర కవులపై పడింది. ఈ ప్రభావం కొంతమందిపై ప్రత్యక్షంగాను, మరికొంతమందిపై పరోక్షంగాను కన్పిస్తుంది. వీరి ప్రభావంతో రచనలు చేసిన వారంతా పౌరాణిక ఇతివృత్తాల్నే తీసుకుని అదే ప్రక్రియలో, అదే ఫక్కీలో రచనలు చేశారు. ఈ విధంగా కవిరాజు ప్రభావంతో రచనలు చేసినవారిలో జి.వి. కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు, సామినేని ముద్దుకృష్ణ, అమంచర్ల గోపాలరావు, చలం, బోయి భీమన్న, బి. రామకృష్ణ మొదలైనవారు ఎంతోమంది వున్నారు. ఇంచుమించు వీరంతా స్వీయ పీఠికల్ని పొందుపర్చడం విశేషం.

ఈ విధంగా సృజనాత్మక రచనల్లో హేతువాద దృక్పథాల్ని వ్యక్తీకరించిన వారేగాక హేతువాద సిద్ధాంత స్వరూప స్వభావాల్ని, లక్షణ లక్ష్యాల్ని తెలియజేసే రచనల్ని చేసినవారుకూడా అనేకమంది వున్నారు. వీరిలో గోరా, తాపీ ధర్మారావు, సి.వి., రావిపూడి వెంకటాద్రి, యం.వి. రామ్మూర్తి, డా॥ యన్. ఇన్నయ్య, యలమంచిలి వెంకటప్పయ్య, కత్తి పద్మారావు, జయగోపాల్ మొదలైనవారు పేర్కొనదగినవారు.

హేతువాద సాహిత్య ఉద్యమానికి సాంఘిక ఉద్యమానికి చెందని అనేకమంది తెలుగుకవులు కూడా ఆయా సందర్భాల్లో హేతువాదాన్ని ప్రస్తుతించడం, ప్రశంసించడం కన్పిస్తుంది. ఆ ప్రశంసల్ని పరిశీలించడమే ఈ వ్యాసప్రధానోద్దేశం.

నాల్గో ఖండకావ్య సంపుటిలో జాషువ 'నవభారతం' అనే శీర్షికలో –

**"అకలంకంబగు హేతువాదమును సత్యాన్వేషణాసక్తి సాం**
**ఘిక కల్యాణ పిపాస పాక్షిక దావాగ్నిన్నెట్టు దుర్దాంత శా**
**బ్దిక పాండిత్యము నాదరింప నిలసద్విజ్ఞాన మింటింట పా**
**దుకొనుంగాత విశాల భారతమునందున్ లోక విఖ్యాతమై"**

అంటూ హేతువాదం సత్యాన్వేషణాభిరుచి, లోకకళ్యాణ తపన, సద్విజ్ఞానం ప్రతి యింటా ప్రసరింపజేయాలని ఆకాంక్షించారు. క్రీస్తు చరిత్ర రాసి కేంద్ర సాహిత్య అవార్డు పొంది, మత అనుయాయిగా కన్పించే జాషువా సైతం హేతువాదాన్ని మెచ్చుకోవడం విశేషం.

సీతజోస్యం, జాబాలి, నరకంలో హరిశ్చంద్రుడు, హిరణ్యకశిపుని హత్య మొదలైన రచనల ద్వారా హేతువాద భావాలను ఎంతో ప్రతిభతో వ్యక్తీకరించిన నార్ల వెంకటేశ్వరరావు గారు 'నవయుగాల మాట'లో –

**"భూతజాలమందు హేతువాదము సేయు**
**ప్రతినరునిలోను ప్రభవమందె**
**హేతువాదితోనే హిస్టరీ పుట్టెరా**
**నవయుగాల బాట నార్లమాట"**

అని ఏ కాలంలోనైనా హేతుత్వ ఆలోచనా వైఖరి వున్న మానవులే జీవన ప్రమాణాలు పెరగడానికి కారణ భూతులయ్యారని, హేతువాదుల కృషి ఫలితంగానే సకలశాస్త్ర, చరిత్రలు పుట్టాయని పేర్కొన్నారు.

పద్మశ్రీ బోయి భీమన్న 'రాగవాసిష్టం', 'గుడిసెలు కాలిపోతున్నాయి' మొదలైన రచనలను హేతుధోరణిలో రాశారు. వీరు అంబేద్కరిజం అనే గ్రంథంలో సామాజిక ప్రగతిని కాంక్షించే ప్రతివాడికి హేతుబద్ధమైన ఆలోచనా వైఖరి అవసరమని, అవి అంబేద్కర్‌కు పుష్కలంగా వుందని

వివరించారు. మానవులంతా హేతువుకు నిలబడినవాడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోగలమంటూ–

**"హేతువుకు నిలబడకపోతే హేతినే ఝళిపించాలి**
**తామసగుణం తామర గజ్జిలాంటిది**
**ఉడుకునీళ్ళు పోసి ఉద్రేకపరచటం కాదు**
**మండినా మాన్పగల మందునే వాడాలి"**

అని అన్నారు. ఇక్కడ అహేతుకమైన ఆచార సంప్రదాయాలు, విశ్వాసాలు తామస గుణాన్ని పెంచి సామాజిక ఉపశమనాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మంటపుట్టినా పుండు తగ్గేమందు ఎలా వాడతామో, అలాగే కష్టపెట్టి అయినా హేతుత్వ భావాల అవసరాన్ని నేర్పాలని ఉద్బోధించారు.

రావిపూడి వెంకటాద్రిగారి ప్రభావంతో హేతువాద ఉద్యమంలో వుంటూ ఆ తరహా సాన్నిహిత్యాన్ని కూడా చేగిరెడ్డి చంద్రశేఖర్ సృష్టించారు.

వీరు వినూత్న రీతిలో విలక్షణంగా హేతువాద శతకాన్ని రాసి ప్రముఖుల మన్నల్ని పొందారు. అందులో –

**"హేతువాదమన్న ఇంగిత జ్ఞానమ్ము**
**శాస్త్రవిజ్ఞతకది సాధనమ్ము**
**మనిషి లక్షణమెన్న మానవ వాదమ్ము**
**హేతుబద్ధమైన హితము గనుము"**

అంటూ రాసిన పద్యాల్లో హేతువాద భావాల ఔన్నత్యాన్ని పేర్కొన్నారు.

హేతువాద ఉద్యమంలో తన కలాన్ని, గళాన్ని బలంగా వాడి, కుగ్రామాలకు సైతం హేతువాదాన్ని ఆర్తితో ఆవేశపూరితంగా అందించి ఆ ఉద్యమానికి ఊపునూ, గుర్తింపునూ తెచ్చినవారు కత్తి పద్మారావు. రాష్ట్రహేతువాద సంఘకార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా పనిచేసి ఎంతో విలువైన సాహిత్యాన్ని వీరు సృష్టించారు.

*'కులం పునాదులు' అనే గ్రంథంలో –*

**"వెట్టి వేదాంత చర్చల విసిగియుండ**
**హేతువాదము జాతికి హితవు జేసే**
**ప్రజకు ప్రశ్నింప నేర్పిన పరమగురుడు**
**వేమన వచియించినది సత్యవేదమన్న"**

అని నిరుపయోగమైన వేదాంత విషయాలతో కాలయాపన చేస్తూ మానవ ప్రగతిని పట్టించుకోక పోవడం విచారకరం. ప్రశ్నించే సామర్థ్యాన్ని అందించిన హేతువాదాన్ని వేమనను కూడా కత్తి పద్మారావుగారు ప్రస్తుతించారు.

బహు గ్రంథకర్త, వక్త విజయవాడ లయోలా కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు డా॥ గుమ్మా సాంబశివరావు గారు హేతువాద ఔన్నత్యాన్ని గూర్చి––

**"గుడ్డినమ్మకమ్ము గొర్రె దాటు విధము**
**ప్రశ్న వేయలేని పందతనము**
**ప్రగతి బందకములు ప్రతికూల శూలాలు**
**హేతువెపుడు ప్రగతి హేతువగును"**

అంటూ గుడ్డి నమ్మకాన్ని రూపుమాపి ప్రశ్నద్వారా వుత్పన్నమయ్యే ప్రగతికి పాటుపడాలని ఉద్బోధించారు.

కవిరాజు ప్రభావంతో హేతువాదంపై మక్కువ పెంచుకున్న ప్రముఖ రచయిత రావెల సాంబశివరావు గారు. త్రిపురనేని శతజయంతి సందర్భంగా 'వీరుడెవ్వడు?' అనే శీర్షికతో కవిరాజును, హేతువాదాన్ని ప్రస్తుతిస్తూ కవిత్వం రాశారు. అందులో––

**"రంభ కొరకని అంగలార్చిన**
**ఆర్య ఋషులను వారి శిష్యులు**
**హేతువాదపు నీడుశక్తికి**
**తెల్లబోయిరి తల్లడిల్లిరి"**

అని కవిరాజు రగిల్చిన హేతువాద భావాలు ఆర్యఋషుల ఛాందస భావాల్ని కొనసాగించేవారికి నోటిమాట రాకుండా చేశాయని వివరించారు.

'వీరగంధము తెచ్చినారము వీరెడెవ్వడు తెల్పుడి' అనే ప్రాచుర్యం పొందిన కవి రాజుగీతం బాణీలోనే రావెల ఈ కవిత రాసి మెప్పించగలిగారు.

హేతువాద ఉద్యమంలోనూ, హేతువాద సాహిత్య ఉద్యమంలోనూ చురుకైన భూమికను నిర్వర్తిస్తూ వచ్చిన సున్నపురాళ్ళపల్లె జయరామరెడ్డి (సుజరె) గారు అనేక రచనల్ని చేశారు.

*సుజరె జ్ఞానదీపిక అనే గ్రంథంలో–*

**"సుజరె హేతు ప్రబోధనల భవ్యసారం**
**జగతి జన ప్రగతికి నవ్యమార్గం**
**అంధాను కరణలు అంటవు జనాలకు**
**సమతా హక్కులు చేకూర్చు సర్వులకు"**

అని హేతువాద ప్రయోజనాన్ని ప్రస్తావించారు.

సామ్యవాద, హేతువాద భావాల వ్యాప్తికి అనేక గీతాల్ని రాసిన గణేశ్వరం బాబూరావుగారు హేతువాద బావుటా అనే శీర్షికతో మంచిపాట రాశారు.

**"హేతువాద బావుటా ఎత్తినదవర తమ్ముడా**
**హేతుబుద్ధి పెంచినీవు ఖ్యాతిజెందు తమ్ముడా**
**సత్యశోధన లేని బ్రతుకున సౌఖ్యమన్నది లేదురా**
**సత్యశోధన జేసి / బ్రతుకున సౌఖ్య భరితము చేయరా"**

అంటూ సాగే గీతంలో హేతువాద జెండా సౌఖ్యాన్ని, ఖ్యాతిని యిస్తుందని వివరించారు.

వల్లంపట్ల నాగేశ్వరరావుగారు 'హేతువాద మహోద్యమం' అనే శీర్షికలో

**"రగిలిందీ కదిలిందీ – హేతువాద మహోద్యమం**
**ప్రగతి పథం క్రాంతి రథం – సమరాజ్యం మాధ్యేయం**
**గతవాద మతవాదం – శృతి తప్పిన మృతవాదం**
**హేతువాద హోరులోన – భృతి లేక మృతి చెందగ"**

అని గత మత వాదాన్ని తుదముట్టించి ప్రగతికోసం, సమతా రాజ్య స్థాపన కోసం హేతువాద ఉద్యమం అవసరమని వెలుగెత్తి చాటారు.

నల్లి ధర్మారావుగారు 'గురువు అజ్ఞానం – శిష్యుడి విజ్ఞానం' అనే శీర్షికతో రాసిన కవితలో –

**"హేతువాదము మనకు వేదము**
**తెలుసుకొందము పూర్తిగాను**
**పోదాము నేర్పు గాను**
**హేతువాదము తెలుసుకొనుటకు"**

అంటూ ఇందులో హేతువాద భావాలు పాతభావాల్ని మార్చేవిగా వుంటాయని కాబట్టి అందరూ హేతువాదాన్ని అభ్యసించాల్సిన అవసరం వుందని హితవు పలికారు.

*క్రాంతిగారు 'హేతువాద జ్యోతి' అనే కవితలో –*

**"అజ్ఞాన తమస్సుకు నిత్యజ్యోతి హేతువాదం**
**మడిగట్టిన వేద పిడివాదులకు**
**శాస్త్రీయపు సమాధానం –హేతువాదం**
**కులమతాల కుట్రల కుళ్ళుకు**
**మహిన మానవతా సౌధం – హేతువాదం**
**మత గ్రంథాల – మంత్రాల మైకపు**
**మత్తును చిత్తు చేసేది – హేతువాదం"**

అంటూ అజ్ఞాన అంధకారాన్ని, కులమతాల కుళ్ళును మత గ్రంథాల మత్తును పారదోలి హేతువాద జ్యోతి మానవాభ్యుదయానికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు. జి. శ్రీమన్నారాయణగారు 'హేతువాదమంటే' అనే కవితలో–

**"హేతువాదం అంటే కాదు వివాదం**
**సత్యాన్వేషణకు సదా సాగిస్తుంది సమరం**
**మూఢ విన్యాసాల వలయాన్ని మెదలంటూ తుడిచి వేసి**
**దోపిడి దారుల దౌష్ట్యాన్ని తుదముట్టించే ఆయుధం**
**గ్రహ బలాల కట్టు కథల జాతకాల బ్రతుకులతో**
**చెలగాటాలాడే వారికి సింహస్వప్నం హేతువాదం"**

అంటూ గ్రహబలాన్ని జాతకాల్ని, దొంగస్వాముల వేషాల్ని, మూఢ విశ్వాసాల్ని రూపుమాపి సత్యాన్వేషణకు హేతువాదం దోహదపడుతుందని వివరించారు.

హేతువాద, దళితవాద ఉద్యమాల్లో ప్రముఖంగా పాల్గొనే వ్యక్తి, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ అధ్యక్షులైన దేవరపల్లి మస్తాన్‌రావుగారు 'హేతువాద మిత్రులం' అనే కవితను రాశారు. ఆ కవితలో –

**"హేతువాద మిత్రులం – సహేతువాద సభ్యులం**
**ఘాతక మత సిద్ధాంతపు రోతకు వ్యతిరేకులం"**

అంటూ మత సిద్ధాంతాల్లో వుండే అహేతుకాంశాల్ని ఖండిస్తూ హేతువాద మిత్రులంతా సంఘటితమై దేశ ప్రగతికి పాటుపడాలని పిలుపు నిచ్చారు.

ఈ విధంగా తెలుగు ఆధునిక కవిత్వంలో హేతువాదాన్ని, దాని అవసరాన్ని, ఔన్నత్యాన్ని గూర్చి విశదీకరించిన వారు, సత్య శోధనకు, శాస్త్రీయ పరిశోధనతో సాంఘిక జీవన ప్రగతి దోహద పడే హేతువాద సాహిత్యాన్ని అందించిన రచయితలు అభినందనీయులు.



# చిలకమర్తి వారి చిలిపి రచనలు

*- ముక్తేవి భారతి*

చిలకమర్తి అనగానే వెంటనే గుర్తొచ్చేది గయోపాఖ్యాన నాటకం. ఆ తర్వాత గణపతి నవల. జాతీయ కవితగా 'భరత ఖండంబు చక్కని పాడియావు' – ఇవేకాక చిలకమర్తి వారి ప్రహసనాలు – చిలకమర్తి స్వీయచరిత్రలో చెప్పారు. చిలకమర్తి మెట్రిక్యులేషన్ తరగతిలో చేరినపుడు, కందుకూరి వీరేశలింగం గారు, సహాయాంధ్రోపాధ్యాయుడుగా వుండి తెలుగు చెప్పేవారు. "విశేషముగ వారి వద్ద సంఘ సంస్కరణ మొదలయిన విషయములు ఎక్కువగా వచ్చుచుండెను. దీనిని బట్టి పాఠములు చెప్పుచుండుట లేదని అభిప్రాయపడకూడదు" (స్వీయ చరిత్ర–94 పుట–కాలచక్రం ప్రచురణలు – 1968).

చిలకమర్తి వారిపై కందుకూరి వారి ప్రభావం చాలా వుంది. సంఘ సంస్కరణకు సాహిత్య రచన చేపట్టిన తెలుగు సాహితీ చైతన్యమూర్తి చిలకమర్తి పేరడీలు అని అనకపోయినా, ప్రహసనాలతోపాటు, చిలకమర్తి వారు పేరడీ రచనా చేశారు. పేరడీ అంటే అధిక్షేపాత్మక వికటానుకరణమని స్థూలంగా అర్థం చెప్పుకోవచ్చు. కందుకూరి వారి అభాగ్యోపాఖ్యానం ప్రబంధ శృంగార రచనలపై పేరడీ రచన. చిలకమర్తివారు పేరడీలు రాయటానికి మూలం అధిక్షేపమే. అధిక్షేపానికి హాస్యం ఎప్పుడూ జతగానే వుంటుంది.

పురాణాలు, వ్రతాలు, నోములు మొదలైనవన్నీ తెలుగువారి జీవన విధానంలో పెనవేసుకుపోయినవే. పురాణమనగానే నైమిశారణ్యం, శౌనకాదిమునులు, శుక మహర్షి కళ్ళముందు కదలక తప్పదు. అంతేకాక పురాణ కథను ఎవరికి ఎవరు వినిపించారో కూడా చెప్పడం వుంటుంది. చిలకమర్తివారు హాస్య వాఙ్మయ బ్రహ్మగా ప్రసిద్ధులు. చిలకమర్తి రాసినవి ప్రహసనాలే అయినా, వాటిల్లో కొన్నిటిని పేరడీలాగ రచించారనేది ప్రహసనాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

తెలుగిళ్ళల్లో సత్యనారాయణ వ్రతం, వరలక్ష్మి వ్రతం మొదలైనవి నేటికీ చేస్తూనే వున్నారు. చిలకమర్తి ఇలాంటి వ్రతాలను దృష్టిలోపెట్టుకొని, ఒక విచిత్రమైన వ్రతాన్ని చమత్కారంగా రచించారు. నారదుడు బ్రహ్మదేవుని దర్శించి, భూలోకంలో చాలామంది ధనం లేక కష్టాలు పడుతున్నారు. వారందరూ ధనవంతులై భోగభాగ్యాలతో తులతూగేందుకు ఏదైనా గొప్ప వ్రతాన్ని తెలియజేయండి అని కోరాడు.

బ్రహ్మ చాలా సంతోషించాడు. అయితే ఈ వ్రతాన్ని కొందరికి చెప్పకూడదనే నియమముందని నారదునికి తెల్పాడు. మితంగా ధనం వాడుకొనేవారికి, గౌరవంగా జీవించేవారికి, జాలి కలవారికి ఈ వ్రతం చెప్పకూడదు అన్నాడు బ్రహ్మ. నారదుడు తల ఊపాడు. ఈ వ్రతం పేరు దివాలాదేవి వ్రతం. ఈ దేవతని భక్తి శ్రద్ధలతో సేవిస్తే, లక్ష్మీదేవి వారి వారి ఇళ్ళల్లో తాండవ మాడుతుంది. వ్రత విధానం చెప్పమని కోరాడు నారదుడు. ఈ వ్రతం చేయటం చాలా తేలిక. మడీ, స్నానం అక్కరలేదు. మంత్రాలు చెప్పక్కర్లేదు. బ్రాహ్మణుడు సంకల్పం చెప్పించక్కర్లేదు. ఈ వ్రతం మాత్రం పరమ రహస్యంగా చేయాలి. ఈ మాటలు వింటూనే నారదుడు ఆశ్చర్య పోతున్నాడు. బ్రహ్మ మళ్ళీ చెప్పాడు.

దివాలాదేవి కలిపురుషుని మూడో కూతురు. ఈ దేవికి లోభుడు, ద్రోహుడు అనే అన్నలున్నారు. ఈ వ్రతం మనసులోనే సంకల్పించుకోవాలి. భార్యకి కూడా చెప్ప కూడదు. దేవీ ప్రసన్నమైనపుడు చెప్పవచ్చు. ఈ వ్రతమాచరించేవాడు చాలా ప్రత్యేకతలు కలిగి వుండే వాడుకావాలి. ఎలాగంటే వాడు కష్టపడి పని చేయని వాడై వుండాలి. ఎవరి దగ్గర నౌకరి చేయకూడదు. కానీ డాబు,

డా. ముక్తేవి భారతి, ఫోన్ : 040-27508487

దర్పము ఎంత ఎక్కువగా వుంటే ఈ దేవతకి అంత యిష్టం. అయితే ఉద్యోగం చేయకూడదు. కానీ వ్యాపారం చేయాలి – అప్పులు తెచ్చి, ఎక్కువ వడ్డీలు యివ్వాలి. ఈ విధంగా ఎక్కువ వడ్డీలు ఇస్తుంటే, దురాశతో చాలా మంది చాలా ధనం అప్పుగా ఇస్తారు. కొద్ది కాలం వడ్డీలు సరిగ్గా ఇచ్చి, నమ్మకం కుదిరాక, వడ్డీ ఎగ్గొట్టాలి... ఈ వ్రతం ఆచరించే వాడు, అప్పులు తెచ్చిన ధనంతో భూములు, ఇళ్ళూ కొనాలి. భార్య, అత్తమామల పేర్ల కొనాలి.

వ్యాపారం క్షీణిస్తోందని తెలిసినపుడు వీరు గొప్పలను మానుకోవాలి. దేవతకి నాణాలు, నగలు నైవేద్యం పెట్టాలి. అయితే, అప్పుల వాళ్ళు చుట్టుముట్టినపుడేం చేయాలీ అంటే గొల్లున ఏడ్చి, 'నేననుకున్నానా ఇలా జరుగుతుందని కొట్లో వున్న సరుకులు పంచుకోండి" అనాలి. ఆ మాట వారికి చెప్పి, ఇసాల్వెన్సీ పిటీషన్ (దివాలా) కోర్టులో వేయాలి. దివాలాదేవి చాలా సంతృప్తి చెందుతుంది. ఈ వ్రతం చేసే వారు సిగ్గు, లజ్జ ముందే వదలివేయాలి. దొంగ ఏడ్పులు, ఏడ్వాలి.. ఇది చేయలేనివాడు ఈ వ్రతం చేయకూడదు" అన్నాడు బ్రహ్మ.

చిలకమర్తి 'దివాలా దేవీ వ్రత సంకల్పం' రచించటంలో ఉద్దేశ మేమిటో అర్థమైంది కదా! నేడు చిట్ ఫండ్సు, లాటరీలు మొదలైన వాటి వెనుక వున్న మోసం ఆనాడే వుందా, క్రాంతిదర్శికవి కనుక, చిలకమర్తి భవిష్యత్తును దర్శించారా! 'బోర్డు తిప్పేవారు' అనేకులు నేడు మనం వింటూన్నట్టిదే ఈ దివాలాదేవి వ్రతం. సమాజంలో మోసపోయే వాళ్ళున్నంత వరకు మోసగించే వాళ్ళూ ఉంటారనేది వాస్తవం. చిలకమర్తి దీన్ని ప్రహసనంగానే రచించినా, దీనిలో పేరడీ లక్షణం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటు హాస్యం, అటు అధిక్షేపం రెండూ కూడా ఇందులో జోడించటం, ప్రహసన లక్షణంగా పేరడీ లక్షణంగా స్పష్టంగా తెలుస్తుంది. ఈ దివాలా దేవీ వ్రతంలో దేవత పేరులో, ఆమె సోదరుల పేర్లలో, వ్రత విధానంలో, అన్నిటా ప్రత్యేకత వుంది. మోసగాళ్ళు, అమాయకుల్ని ఎన్ని విధాల దోచుకుంటారో అనే విషయమే కాక, ఎక్కువ వడ్డీలు కోరే దురాశాపరులు ఎలా నష్టపోతారో అనే నీతి కూడా పరోక్షంగా తెల్పారు చిలకమర్తి.

భగవద్గీతను పవిత్ర గ్రంథంగా అందరూ ఆరాధిస్తారు. భగవద్గీతలోని ధర్మోపదేశం అన్ని పరిస్థితుల్లోనూ అందరూ గ్రహించేటువంటిది. భగవద్గీతోపదేశం, కేవలం



కృష్ణార్జునులకు మాత్రమే సంబంధించింది కాదని, విశ్వమానవ శ్రేయస్సును కోరి చెప్పటం జరిగిందనేది విశ్వసిస్తున్నారందరూ. ఇంత సుప్రసిద్ధమైన భగవద్గీతను పేరడీ చేయటం చిలకమర్తి విజ్ఞత. భగవద్గీతను పేరడీగా కవిగీత రచించారు. భారత కథకు ఒకే విధంగా ఇది పేరడీ కూడా.

ఇందులో నాయకుడు కాలపురుషుడు అనే రాజు అతనికి ఇద్దరు భార్యలు. జ్ఞానదేవి, మాయాదేవి. జ్ఞానదేవికి ఐదుగురు కొడుకులు – వారి పేర్లు వివేకుడు, సత్యుడు, ధర్ముడు, దృపుడు, శౌచుడు. మాయాదేవికి అవివేకుడు, క్రూరుడు. అహంకారుడు మొదలైన వందమంది కుమారులు. ఇక్కడే భారత కథ మొదలైంది కదా! పాండవులు, కౌరవుల మధ్య జరిగిన కథ అంతా వుంది. మాయాదేవి కొడుకులు దుర్మార్గులై జ్ఞానదేవి ఐదుగురు కొడుకుల్ని అరణ్యాలకు పంపారు. అయితే కాలపురుషుడు మాయాదేవి సంతానంపైనే ప్రేమ చూపాడు. మాయాదేవి సంతానానికి, జ్ఞానదేవి సంతానానికి యుద్ధం జరుగుతుంటే, చివరకు అహంకారుడు వివేకాదులపై యుద్ధానికి వచ్చి, నిలబడలేక కూలబడతాడు. అప్పుడు, అహంకారునికి కవి చేసిన బోధ "కవిగీత"గా పేరడీ చేశారు. చిలకమర్తి, భగవద్గీతలో పద్దెనిమిది అధ్యాయాలుంటే, కవిగీతలో పదిహేను అధ్యాయాలున్నాయి.

కాలపురుషుడు 'మారుతుడు' అనే సేవకుని అడిగాడు, "యుద్ధ రంగంలో ఏం జరుగుతోంది, నా నూర్గురు కుమారులు ఎలా వున్నారురా'' అని. వివేకుడు ధర్ముడనువాడిని సేనాధిపతిగా చేసుకొంటే, అవివేకుడనేవాడు అహంకారుని సేనాధిపతిగా చేసుకొన్నాడు. కలిపురుషుడు అహంకారుని రథసారథి. అక్కడ అర్జునుడు కౌరవ సేనను చూస్తూ గురువులను, తాతలను, బంధువులను చంపలేను అన్నాడు.

ఇక్కడ అహంకారుడు వివేకుడు మొదలైన మంచివారిని నాశనం చేయలేను కానీ వారికి తినడానికి తిండి, వుండడానికి స్థలము లేక వారే మరణిస్తారు అంటాడు అహంకారుడు. కనుక నా రథం దూరంగా తీసుకు వెళ్ళు అని చెప్పేది అహంకారుని విషాద యోగం అన్నారు చిలకమర్తి.

కవిపురుషుడు అహంకారానికి ధైర్యాన్ని బోధించి, శత్రువును సంహరించాల్సిందే జాలి పనికి రాదు అని చెప్పి, "లోకములో పాపమన్నది లేదు. గొంతులు కోసియైనా సరే, మోసముచేసియైనాసరే, విషము పెట్టి యైనా సరే, శత్రువులను నాశనము చేసి గొప్ప వాడైన వాడే ప్రయోజకుడు. వానికే లోకులు గౌరవింతురు" అంటూ *'ధనమూల మిదమ్ జగత్'* అనే విషయం మరవకు. ధనము అధికారము సర్వవిధాల పొందాలి – అంటూ లోకాయిత యోగం చెప్పాడు.

సాయిజ్యోయోగం చెప్తూ, కవిపురుషుడంటాడు. "మనుషులు దేవతలకు చేసే పూజలన్నీ నాకు చేరుతాయి. నేనే గ్రామ దేవతను. బలికోసం మేకల్ని తెచ్చినపుడు నాకు చాలా సంతోషం. మరణభీతితో మేక అరుస్తుంటే నాకు చెవుల పండువుగా వుంటుంది. నేలమీద పడిన రక్తము నా కళ్ళకి వసంతంలా అనిపిస్తుంది. నిజమైన దైవభక్తులకు అపకారములు చేయటం, సత్ప్రవర్తన కలవారిని బాధించటం, అసత్యం పల్కటం, వక్రబుద్ధి, జారత్వం, చోరత్వం అందు ప్రజ్ఞ – ఇలా నన్ను మెప్పించిన వారు సాయుజ్యము పొందుదురు" అన్నాడు కలిపురుషుడు. ఇలాగ, కవిగీతలో మొత్తం అధర్మ వర్తనలే ప్రాధాన్య మివ్వటం కనిపిస్తుంది. చిలకమర్తి కవిగీత రచించటంలో ఉద్దేశం, సాంఘిక సంస్కరణమే. దుర్మార్గులు, దుష్టులు అయిన జనం రోజు రోజుకీ అవినీతి వర్తనతో జీవిస్తున్నారనేది అధిక్షేపం. కవిగీత చదువుతుంటే భగవద్గీత విశిష్టత పరోక్షంగా అందిస్తున్నట్టే.

చిలకమర్తివారు చాకలిపురాణం, మారీచస్మృతి పంచాంగ ఫలితాలు అనే ఎన్నో పేరడీ రచనలు కూడా చేశారు. చిలకమర్తి వారి రచనలన్నీ బాగా ప్రచారం పొందినా, పేరడీ రచనలుగా కొన్నిటిని పాఠకుల దృష్టికి తేవాల్సిన అవసరం ఉంది. ప్రహసనాలు, పేరడీలు అని విభజించకుండా అన్ని ప్రహసనాలుగానే రచించిన చిలకమర్తి ప్రహసనాలు ఆనాటి సమాజమనేకాదు. ఏ సమాజానికైనా అనువర్తితాలే! దొంగ సన్యాసులు, అపూర్వ యాచకులు, ఆకాశ రామన్నలు, కైలాస దూతలు – ఇలాంటి వారు వీధి వీధిన కనిపిస్తూనే వుంటారు. వివాహ ప్రహసనాలు నేటికీ అక్షర సత్యాలే మూఢత్వం, ఛాదస్తం, అహంకారం, దర్పం – ఇలాంటివన్నీ నేటికీ ఎందరిలోనో కనిపిస్తున్నాయి.

ఇలా చిలకమర్తి వారి రచనలన్నీ సామాజిక శ్రేయస్సు దృష్ట్యా రచింపబడినవే. తెలుగు సాహితీ చైతన్యమూర్తిగా చిలకమర్తిని స్మరించుకుందాం.

## బట్టతల – వెనుక జన్మ


ముట్నూరు కృష్ణారావు

**ఒ**కసారి ముట్నూరి కృష్ణారావుగారూ, నేనూ మరి కొందరం కూచిపూడి వద్ద ఒక గ్రామానికి వెళ్ళాం. ఆ ఊళ్ళో ఒక పెద్ద శాస్త్రిగారి ఇంటికి వెళ్ళాం. ఆయన అప్పుడే దేవతార్చన గావించాడు. అక్కడ నిలబడ్డ మా తలల మీద పూజా జలం చల్లారు. కృష్ణారావుగారి తలమీద మరికొంతసేపు దివ్యోదకం చల్లారు. తరువాత ఇవతలకి వచ్చాక, మాతో కృష్ణారావుగారన్నారూ "ఆయన నా మీద తీర్థం ఎక్కువగా ఎందుకు అభిషేకించారో తెలుసునా? నా శిరస్సు సాలగ్రామం లాగున ఉండటం వల్ల" అనగా అందరమూ గొల్లున నవ్వాం. మా గురువుగారిది బట్టతల కదా!

కృష్ణారావుగారు, చెరుకువాడ నరసింహారావుగారు, నేనూ మరో ఊరు వెళ్ళాం. అక్కడ ముసురు పట్టింది. మేం కారులో కూర్చుంటే, చెరుకువాడ వారు ఒక ఆసామిని పిలుచుకు రావటానికి వెళ్ళారు, తలమీద తెల్ల ముసుగేసుకుని. త్రోవలో, మరో తొందరలో ఉన్న ఒక ఆబోతు నిలబడి వుంది. వానజల్లుల తెరలో తిన్నగా చూపు ఆనక అది ఆయనను వెంబడించింది. ఆయన తొందరగా నడిచి ఒక అరుగు ఎక్కారు. "మన నరసింహారావుగారు వెనుక జన్మలో ఆవు సుమండీ" అన్నారు కృష్ణారావుగారు.

– గొట్టిపాటి బ్రహ్మయ్య




## దేశీయ నవలా రూపం

# 'ఊరు వాడ బతుకు'

- జయధీర్ తిరుమల రావు

ప్రాచీన కాలంలో కావ్యేతివృత్తం ఇలా ఉండాలని నిర్ధారింపబడింది. పౌరాణికం లేదా పౌరాణికాధార ప్రామాణిక వస్తువు మాత్రమే కవి స్వీకరించాలి. కావ్య ప్రబంధాల స్వరూపం ఇలా ఉండాలని నియమం ఉండేది. నన్నయ వంటి అనువాదకవుల వరవడి ఈ ధోరణిలోనే కొనసాగింది. సంస్కృత సాహిత్య మార్గంలోనే అడుగులో అడుగేసింది. ఐతే పాలకురికి సోమనాథుడి వంటి విప్లవ సాహిత్యకారులు వేలాది ఏళ్ళ వరకు అంటరానివాళ్ళయిన సామాన్య ప్రజల నుండి వచ్చిన భక్తులు, గురువుల కథలను మొదటిసారి సాహితీకరించారు. ఇతివృత్తం, రూపంలోనే కాదు ఛందస్సు, భాష, నుడికారాల్లో ఎంతో మార్పు తెచ్చారు. మొట్టమొదటిసారిగా తెలుగులో స్వతంత్ర్య కావ్యాలను రాశారు. రూపసారాల్లో విప్లవం తెచ్చారు. ఆ తదుపరి చాలాకాలానికి లిఖిత సాహిత్యంలో పెద్దగా ఇలాంటి మార్పులు రాలేదు. ఆధునిక విప్లవాల సందర్భంలో కూడా రూపసారాల్లో, భాషలో గణనీయమైన మార్పులు లేవు. ఆధునిక ప్రక్రియా రూపంలో, స్వభావంలో మార్పు తేలేదు. భాష కూడా ప్రజాస్వామికరించ బడలేదు. ఆనాడు సంస్కృతీకరించిన కవిత్వ భాషే ఆధునిక కవిత్వానికీ ఆలంబన అయింది.

ఐతే ఇతివృత్తంలో కొంత మార్పు వచ్చినా గత సంప్రదాయమే సగం భాగమైంది. గురజాడ, వీరేశలింగం, శ్రీశ్రీ ఇందుకు అపవాదు కాదు. 'మహాప్రస్థానం'లో చాలా కవితల్లో శ్రీశ్రీ కవిత్వభాష ఎక్కువగా సంస్కృతమే. అందుకే ఆదికవి నన్నయ్యకి ఇచ్చిన గౌరవం, అభ్యుదయ కవి, విప్లవ కవి అయిన శ్రీశ్రీని సంప్రదాయవాదులు కూడా గౌరవించారు. కవి నన్నయ్య పాదుకే మొలిచిన కవులకే అధిక గుర్తింపు, గౌరవం లభించింది. ఇతర పాదులు ఈ సమాజంలో మొలవలేని పరిస్థితులు ఉన్నాయి. మొలిచినా వాటిని గుర్తించడం జరగలేదు. జరిగినా అలా మళ్ళీ అజ్ఞాతం కావలసిందే. ఇది ఒక కనబడని కట్టుబాటు. దీన్ని అధిగమించడానికి వీల్లేని చట్రం ఏర్పడింది. పాలకురికి సోమన, వేమనలు మార్గ సాహిత్యం నుండి కొంతకాలం అదృశ్యమై మత తాత్విక చింతన బలంతో ఒకరు, విదేశీయుడైన పరిపాలనాధికారి ఊతం వల్ల మరొకరు సాహిత్యలోకంలో నిలబడగలిగారు. ఒకరు ద్విపద, మరొకరు ఆటవెలది అనే తెలుగు సులభ ఛందస్సుతో తెలుగు సాహిత్యంలో చెరగని స్వతంత్ర ముద్రని వేశారు. ఈ ఇద్దరికీ ప్రబలమైన ప్రజల పునాది ఉంది. అందుకే సంప్రదాయ చట్రాన్ని ఢీకొని నిలిచారు.

వచన ప్రక్రియ అయిన తొలి నవల అని చెప్పబడుతున్న వీరేశలింగం రచన రాజశేఖర చరిత్ర నవల కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనే రచించారు. ఆంగ్ల ప్రక్రియను తెలుగులో ప్రవేశపెట్టగా అది అలాగే కొనసాగుతున్నది. చైతన్య స్రవంతి, సామాజిక వాస్తవికత, అజ్ఞాత సామాజికాంశాలు ఇతివృత్తాలుగా తీసుకున్నా ఇలాంటి నవలా రచనలకు చాలావరకు ఇతర భాషల్లో నమూనాలు కనుపిస్తాయి.

ఆరోగ్యకరమైన ప్రయోగాలు కళాసాహిత్యాలకు పుష్టి చేకూర్చుతాయి. తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ కొన్ని ప్రయోగాలు చేశారు. కాని అవి పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో చేసినవే అని తేలిపోయింది. కవిత్వంలో దేశీపునాది కంటే పాశ్చాత్య ప్రభావమే ఆయనపై ఎక్కువ. అనేకమైన దేశీ నాటక సాహిత్య ప్రక్రియలు ఉండగా వాటిని గుర్తించలేక, ఉపయోగించుకోలేని బేలతనం మనం అనుకునే యుగపురుషులని ఆవరించింది. దీనికి కారణం ఏమంటే దేశీయమైన సాహిత్యంపై చిన్నిచూపు. ప్రతి పాశ్చాత్యమైనది గొప్పదనే భావన. గీర్వాణ భాషా

జయధీర్ తిరుమలరావు, సెల్ : 9951942242

ఛందస్సులని వాడుకుని తెలుగు పునాదిని పక్కన పెట్టి, ఆంగ్ల సాహిత్యాన్ని ఇష్టపడి దాని వ్యామోహంలో చాలామంది పడిపోయారు. అందువల్ల గీర్వాణ భాషని, ఆంగ్ల భాషని కవిత్వంలో విరివిగా ఉపయోగించుకున్నారు.

ఆంగ్ల సాహిత్యంలో లేదా సంస్కృత సాహిత్యం లోంచో ప్రయోగాలను పునఃసృష్టించే సులభ విధానం మన రచయితలకి వెన్నతో పెట్టిన ఆలోచన. భాసుడు రాసిన అలనాటి 'మృచ్ఛకటికం' నాటకం ఆధునిక, అత్యాధునిక నాటక కర్తలకు ఇంకా ప్రయోగశాల అవుతున్నందుకు సంతోషించాలో, బాధపడాలో తెలియదు. అప్పట్లో కర్ణాటకలో గిరీశ్ కర్నాడ్ తదితరులు, మహారాష్ట్రలో విజయ్‌తెండూల్కర్ వంటివారు నాటకాలలో ఉపయోగించిన జానపద ప్రదర్శన విధానాలను మనం ఆధునిక నాటికాలకి ఉపయోగించుకొని ఇప్పుడే మనం కొత్తగా వాటిని ప్రవేశపెట్టినట్లు చంకలు గుద్దుకోవడం విచిత్రం.

ఇతివృత్తం సాహిత్య రూపాన్ని ఎన్నుకుంటుందని చర్వితచరణంగా చెప్పుకుంటాం. అసలు ఇతివృత్తంలో మార్పులేకుండా చాలా రాస్తున్నామని తెలుసుకోలేం. ఏ ఇతివృత్తమైనా చివరకు యాంత్రికంగా ముందే నిశ్చయించుకున్న ముగింపు ఇవ్వాలనుకునే మనస్తత్వం కారణంగా ప్రయోగభావన పరారవుతుంది. అందువల్ల శైలిలో నవ్యత కూడా సాధించలేకపోతాం. అలాంటి ప్రయత్నాలు చేసినవాళ్ళని ప్రగతిశీల రచయితలు కాదని ముద్ర వేస్తారు. అందుకు విలవిల్లాడిపోయే రచయితలు అనేకులు ఉన్నారు. మరి కొంతమంది సరేలే అని మరింత జోరుగా రచనలు చేస్తారు. నిజమైన సృజనాత్మకత ఉన్నవాళ్ళు కొత్త రూపం, ఇతివృత్తాలతో రచనలు సాగిస్తారు. సాహిత్యలోకంలో తమదైన ముద్ర వేస్తారు. రచయితలు సమాజానికి నిబద్ధులు కావాలే గాని పవర్‌సెంటర్‌లు, వ్యక్తుల చుట్టూ తిరగాడే మరమనుషులు కాకూడదు.

ఇటీవల వెలువడిన "ఊరు వాడ బతుకు" నవల 'బతుకు' పైనే కేంద్రీకృతమైంది. అందుకే పుస్తకం నిండా సహజమైన జానపద బాణీలు ఉన్నాయి. అవి ఎంత భావస్ఫోరకంగా ఉన్నాయో తెలంగాణా రైతాంగ పోరాటంలో పాడుకున్న పాటలు అంతే ప్రేరణగా ఉటంకించబడినాయి. ఐతే 'బతుకు'ని అధిగమించకుండా గొప్పలకు పోయి రచనని ఎక్కడా అగౌరవపరచలేదీ పుస్తకం.

**మోటాకాడా వుంటా వాని / నీళ్లకంటూ నేనూ వస్తే**
**మోటలేదూ నీవూలేవూ / కంటి నీరే కడువా నిండెరా...**

గొప్ప జీవితం గొప్ప నవలని సృష్టిస్తుందని చాలామంది అనుకుంటారు. కాకపోతే ఈ తప్పుడు అవగాహనకి ప్రగతిశీల రచయితలు కూడా జతచేరడం బాధాకరం. ఇరవయ్యో శతాబ్దం కన్నా ముందరి వరకు ఇలాంటి భావన ఉండవచ్చు. కాని రష్యన్ నవలలు, కథలు ఈ భావం తప్పు అని తేల్చేశారు. వస్తువు కాదు వాస్తవికత (జీవిత వాస్తవికత, సామాజిక వాస్తవికత) ముఖ్యం అని నిరూపించారు. జీవితం సమాజంలో ఒక భాగం. అది కుటుంబం వరకే పరిమితం కాదు. అలా అయితే వ్యక్తిగత ధోరణి దగ్గర ఆగిపోతాడు రచయిత. అలాంటి రచయితలు తెలుగులో చాలామంది ఉన్నారు. వీళ్ళని పొగిడే అభ్యుదయవాదులు, విమర్శకులకి కొదువలేదు. వీళ్ళంతా అసలు సమాజాన్ని విస్మరించి లేదా దాచి ఊహా సమాజాన్ని బలపరుస్తారు. ఎందుకంటే ఈ దేశంలోని కులం, కులసంబంధాలు, శ్రమజీవుల ఉత్పత్తి సంబంధాలే వాస్తవికత, భారతీయ సామాజిక సంబంధాలను ఇవి నిర్దేశిస్తాయనడంలో సందేహం లేదు. సాధారణ మానవ సంబంధాలను సైతం ఇవి ప్రభావితం చేస్తాయి. ఇంతటి ప్రధానమైన విషయాన్ని తడమని తెలుగు నవల ఎంత గొప్పదైనా అది భారతీయ సందర్భంలో అవాస్తవ రచనే అవుతుంది. అవాస్తవ మనుషులు, వారి నడవడి, వాళ్ళ సమాజం అంతా అభూత కల్పనే. అందువల్ల కాల్పనిక రచనల వల్ల సమాజానికి పెద్దగా ఒరిగేదేమీ లేదు. ప్రగతిశీల కాల్పనికత కూడా పెద్దగా రాణించదు. చిరునామా లేని మనుషులు పాత్రధారులుగా రాయడం భావదారిద్ర్యానికి నిదర్శనం. దానివల్ల పాఠకులు నేర్చుకునేదేదీ లేదు. అలాంటి రచనలని రాసి సొమ్ము చేసుకోవడమే రచయిత ఉద్దేశం. పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని పబ్బం గడవడం తప్ప ఆ సాహిత్యం ప్రజలను చైతన్యపరచలేదు. పాఠకుడు తనని తాను చూసుకోలేని, పోల్చుకోలేని రచన సామాజికం కాదు. అంటే ఆ రచన స్వాభావికంగా, సహజంగా, పాఠకుడికి దగ్గరగా ఉండదు. రచయితల సంఘాలు భారతదేశంలో 'వాస్తవికత – రచయిత – రచన – ప్రభావం' అనే అంశాల గురించి ఎక్కడా చర్చించవు. బాధ్యతతో విశ్లేషణ చేయవలసిన వారు సైతం అనవసర అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనించాలి. దేశీయ పునాదికి ప్రతిబింబంగా సాహిత్యం ఎలా ఉండాలో

చర్చించరు. అందువల్ల ఆ సంఘాలు కేవలం రాజకీయ భావాలకు ప్రాతినిధ్యం వహించేవిగానే ఉంటాయి. అంతేకాని ప్రజా సాహిత్యం, సంస్కృతులకు ప్రాతినిధ్యం వహించే వాటిగా ఉండవు. ఒకరిద్దరు దబాయింపుదారులు పత్రికా యాజమాన్యంతో సన్నిహిత సంబంధాలు నెరపడం వల్ల పై విషయాన్ని తప్పని చెప్పడానికి ప్రయత్నిస్తారు. ఐనా వారు, వారి తాబేదారులు సాహిత్యంలో కొత్తదనం తీసుకురాలేరు. సమాజ జీవితాన్ని ప్రతిబింబించలేరు. ఏది ఏమైనా మత కుల శ్రామికవర్గాల జీవిత కథనం లేదా అలాంటి దృక్పథమే రచనకి కొత్త రూపాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఈ విషయం "ఊరు వాడ బతుకు" నవల మరోసారి స్పష్టం చేసింది.

ఇలాంటి రచనలలో ఈ మధ్య వచ్చిన 'కక్క', 'అంటరాని వసంతం', 'ఊరు వాడ బతుకు' వంటి రచనలు ముఖ్యం. ఇవి నవలలు కాని నవలలు. యాంత్రిక నవలా నిర్మాణానికి దూరం. వీటిలో ముఖ్యం 'ఊరు వాడ బతుకు'. దీన్ని ఏ ప్రక్రియగా చూడాలో ఆయా పాఠకులే నిర్ణయించుకుంటారు. విమర్శకులు తమకి నచ్చిన పద్ధతిలో భావించారు. ఈ ప్రక్రియని ఇదీ అని ఇదమిత్థంగా చెప్పడం ఇక్కడ నా ఉద్దేశ్యం కాదు. సమాజ జీవిత వాస్తవికతని లోతుల్లోంచి అనుభవించి చెప్పిన రచన ఏదైనా తన విలక్షణతని కాపాడుకుంటుంది. ఇంకా చెప్పాలంటే తన రచనా రూపాన్ని తాను వెదుక్కుంటుంది. ఫలానా ప్రక్రియలో ఫలానా ఇతివృత్తంతో రచన చేస్తున్నామని ధీమాగా చెప్పుకోవడం ముందే నిర్ణయించడం ఎంతవరకు సబబు? అట్లని ప్రణాళికా రహితంగా రచన చేయాలని అనడం లేదు. ఫలానా విషయం, అంశం చెప్పడానికోసమే రచన చేయడం, కథని అల్లడం, అందుకు అణుగుణంగా పాత్రల్ని సృష్టించడం సరైంది కాదు. దీనివల్ల కృత్రిమత ఎక్కువగా చేరుతుంది. సామాజిక రచనకి Magic realism కన్నా Social realism ఎక్కువ పుష్టినిస్తుంది.

దేవులపల్లి కృష్ణమూర్తి శ్రమజీవి వర్గం ప్రతినిధి. అలాంటి జీవితాలను నమోదుచేసే అక్షర శిల్పి. అందుకే అతనికి తెలియకుండానే ఒక గొప్ప రూపాన్ని సాధించాడు. లోగడ ఉన్న నవల ప్రక్రియా రూపాన్ని నిరాకరించి తనదైన ఒక సాహిత్య రూపాన్ని రచనగా పొందుపరిచాడు. మగ్గం నేస్తూ నేస్తూ గొప్ప అందమైన నమూనాలతో, రంగులతో, వెలువరించిన అద్భుత సౌందర్యవంతమైన చీరలా ఒక రచనని సృష్టించాడు. అది స్వీయరచనలకి, స్వీయ నవలా రచనకి నాంది పలికింది. ఏది ఏదైతేనేం అది ఒక ఉదాత్త ప్రక్రియా రూపంగా రూపొందింది. 'స్వీయ నవల' అనే కొత్త రూపం ఏర్పడింది.

**చందమామకు గంధమేలా / సంసారికి వన్నెలేలా**

జీవితం పాతదే కావచ్చు. తన రచనతో ఆ జీవితాన్ని స్వీయ నవలా ప్రక్రియకు నాంది చేశాడు. అది బాగా నప్పిన విధానం. అందుకే సాహిత్యాభిమానులు, పాఠకులు చాలామంది స్పందించారు. ఈ స్వీయ నవలా ప్రక్రియలో మొత్తం 65 జానపద గీతాలు (చరణాలు) ఉన్నాయి. ఇందులో 20 దాకా పోరాట గీతాలు. ప్రజలు ఉపయోగించే సామెతలు, జాతీయాలకు కొదువ లేదు. ఆలె లక్ష్మణ్ వేసిన పది రేఖా చిత్రాలు అక్షరాలు చెప్పలేని బతుకుల్ని విప్పి చెప్పుతాయి.

వినాయక చవితి, కృష్ణాష్టమి, ముత్యాలమ్మ పండగ, బోనాలు, వన భోజనాల వంటి పండగలు, పండగ సందర్భాలు ప్రజా దృక్పథంతో చూడ్డం రచయిత అవగాహనకి నిదర్శనంగా ఉన్నాయి. ఈ పుస్తకం నిండా ప్రజల జానపద కళారూపాలను ఎన్నింటినో ఉటంకించాడు. కోలాటాలు, చెక్క భజనలు, శ్రామిక గేయాలు, తత్వగీతాలు, రేల పాటలు, చుట్టుకాముదుపాటలు, శారద కథలు, బుర్రకథలు, భాగోతాలు, గంగిరెద్దులు, బుర్రకథల వంటి ఎన్నో కళారూపాలను అవసరానుగుణంగా ప్రస్తావించాడు.

ఇలాంటి ప్రస్తావనలు ఈ దశాబ్ద కాలంలో ఎవరూ చేయలేదు. ప్రజల గురించి రాస్తున్నామని ఢంకా బజయించి చెప్పుకునే రచయితలు ఎవరూ ఇంత మొత్తంలో ప్రజల సంబంధమైన నోటి సాహిత్యాన్ని పేర్కొనలేదు. ఇవన్నీ కోల్పోతున్న కాలంలో అనివార్యంగా వాటిని గుర్తు చేసుకున్నాడేమో రచయిత. అనంతారం, సూర్యాపేట, జగ్గయ్యపేట వంటి ఊళ్ళు కూడా పాత్రలుగా కనిపించేట్లు రచించడం ఈ నవల ప్రత్యేకత.

'ఊరు వాడ బతుకు'. రచన పేరులోనే ఉన్నట్లు గ్రామీణ బతుకు చిత్రం కాన్వాసు విశాలమైనది. ఇంత పెద్ద చిత్రాన్ని మలచడానికి కృష్ణమూర్తి ధైర్యంగా ముందుకొచ్చాడు. ఈ రచనలో "రచయిత" కావాలని ఎక్కడా కనుపించడు. అందుకే ఆ రచనకి విలువ ఏర్పడింది. నలుగురు మాట్లాడ్డానికి వీలు ఏర్పడింది. నిర్దిష్ట స్థల కాలంలో రూపొంది, చీమూ నెత్తురున్న ప్రజల గురించి ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతుంది. మి

# ఎంతవారికైనా..ఇంతిపోరు ...

'మీకూ, మీ భార్యకూ అభిప్రాయ భేదాలు రావా? వస్తే పోట్లాటలు లేకుండా ఏ విధంగా జరుపుకొని వస్తున్నారు!' అని నా స్నేహితులైన ఇంద్రగంటి వారిని అడిగాను. ఆయన మంచి పండితుడు, సాహితీపరుడు, మనస్తత్వ శాస్త్రము బాగా తెలిసినవాడు. ఆయన చెప్పింది :

"నాకూ, నా భార్యకూ అభిప్రాయ భేదాలు రాకుండా వుండవు. వస్తూనే ఉంటవి. ఆవిడ అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయం కలిగి వున్నపుడే మేము భిన్నాభిప్రాయులము అవుతాము. భిన్న తత్వాలు గల అభిమతాలకు సంఘర్షణ ఏర్పడి తగవుగా పరిణమిస్తుంది. కాబట్టి అభిప్రాయభేదం వచ్చినపుడు నా అభిప్రాయం నేను ఆవిడతో చస్తే చెప్పను. ఇంక ఆవిడ ఏం జేస్తుంది? నోరు మూసుకొని ఊరుకొంటుంది. ఇదే నేను అవలంబిస్తూ ఉన్న మార్గం పోట్లాటలు లేకుండా వుండటానికి" అన్నారు. "అభిప్రాయ భేదాలు వచ్చినపుడు నేనే నోరుమూసుకొని ఊరుకుంటాను" అని చాలా చమత్కారంగా చెప్పినారుగదా అని సంతోషించాను.



ఆ తరువాత కాటూరి వారిని అడిగాను "ఏమండీ అన్నగారూ! మీ ఇంట్లో పోట్లాటలు లేవా?" అని. ఆయన "లేవు. మేము ఎప్పుడూ పోట్లాడుకోలేదు" అన్నారు. నాకు వళ్ళు మండింది. "అది ఎట్లాగ సంభవం అయిందండీ? మీ ఆవిడ అంత సుగుణవంతురాలా? వినయ సంపత్తి గలదా? మీరు చెప్పినట్లు వింటుందా?" అని అడిగాను. ఆయన ముఖం చిట్లించి విసుగుతో "నేను చెప్పినట్లు ఆవిడ వింటుందని ఎవరన్నారయ్యా! ఆవిడ చెప్పినట్లు నేనే వింటాను. ఏదైనా మాటా మాటా వచ్చి ఆవిడకు కోపం వస్తే, నేను వెంటనే "దోషముగల్గె, నా వలన దోసిలి యొగ్గితి నేలుకొమ్ము నీ దాసుడ" అని "ముట్టెద తత్పదద్వయిన్" అని గబగబా నడచి వెళ్ళిపోయినారు.

నేను నిర్ఘాంత పోయినాను. "ఇంకా నయం; మా ఇంటి వ్యవహారం, ఇంకా అందాకా రాలేదు కదా!" అనుకొన్నాను.

దేవులపల్లి వారిని అడిగాను "ఏమండీ! మీ ఇంట్లో సంగతి ఏమిటి?" అని, "మీ ఆలుమగల మధ్య పొరుపుగాని, పోట్లాటగాని, ఉంటుందా లేదా" అని. "అమ్మో! నా ప్రియురాలితో పోట్లాట నేను భరించలేను! ఒకవేళ వచ్చిందో నాకు దుఃఖం వస్తుంది. ఆ దుస్సహగాధ దుఃఖం ఆపుకోలేను. ఏడుపు వస్తుంది. నా సంగతి నీకు యీ మాత్రం తెలియదేం! మృదుల కరుణా మధురము నా హృదయము. ఈ సంగతి ఎవ్వరికీ తెలియకపోయె! ఎవ్వరెరుగ జాలరు ఏమని ఏడ్తునెపుడు" అని చీత్కారము చేసి వెళ్ళిపోయినాడు.

వేదుల వారిని అడిగాను "నీ సంగతి ఏమిటయ్యా? నీకూ, మీ ఆవిడకూ పోట్లాటలు ఏమన్నా ఉన్నాయా? ఉంటే ఏమి చేస్తున్నావూ?" అని.

"పోట్లాటలు లేకేమయ్యా! నేనెంత బాధపడుతున్నానో నీ కేమి తెలుస్తుంది! నా బాధ ఎవ్వరికి చెప్పను. నేనే నాలోన మూల్గుకొందు. కనికరపు జూపు, చిరునవ్వు తునకయై కంటికి కరవయ్యె పాడు లోకాన నాకు" అన్నాడు.

"దేవులపల్లి వారు భార్యతో పోట్లాట వస్తే రోదనము చేస్తారట! మరి నీకు ఏడ్పురాదా?" అని అడిగాను.

"రాకేమయ్యా, చచ్చేట్లు వస్తుంది. కాని కనుల రానీనొక బాష్పకణమునైన" అన్నాడు. జాలివేసింది. ఇట్లాంటి బాధలు ఆయనకూ ఉన్నాయి కదా! అని.

అందుకనే, 'మహాసాగర గాథ హృదయ బడబానల జ్వాల యెవ్వరికి తెలియు?" అని గోలపెట్టాడు కదా అని అనుకొన్నాను.

మొక్కపాటి వారిని అడిగాను "ఏమండీ! మీరూ మీ ఆవిడా ఎప్పుడైనా పోట్లాడుకొన్నారా?" అని.

ఆయన ఒక నిమిషం ఆలోచించి "చిన్నతనంలో సంగతి బాగా జ్ఞాపకం లేదు. కాని ప్రస్తుతం ఏమీ పోట్లాటలు లేవు. శాంతంగా వెళ్ళిపోతున్నవి రోజులు" అన్నాడు. నేను ఆశ్యర్యపడి, "ఎలా సాధించారు? ఎప్పటి నుంచీ ఈ పోట్లాటలు లేకపోవటం?" అన్నాను.

ఆయన చిరునవ్వు నవ్వి "ఏమీ లేదు. నేను ఇప్పుడు మద్రాసులో ఉంటున్నాను, మా ఆవిడ రాజమండ్రిలో ఉంటున్నది. ఎప్పుడైనా టెలిఫోన్‌లో మాట్లాడుకొంటున్నాము. టెలిఫోన్ మీద పోట్లాడుకోటానికి తగిన వ్యవధి దొరకడం లేదు. అదీగాక చాలా డబ్బు ఖర్చు పెడితే గాని ఆ సరదా తీరదు. టెలిఫోన్ వారికి వ్రాసి కనుక్కోవాలి. ఏమైనా తక్కువ రేట్లకు అలాంటి అవకాశం ఇస్తారేమో"అన్నాడు.

గిడుగు వారిని అడిగాను: "మీ సంగతి ఏమిటండీ"? అని. ఆయన ఇంట్లోనూ పోట్లాటలు లేవట! పోట్లాటలే కాదు, అసలు మాట్లాటలే లేవు. ఎందుకంటే, ఆయన ఒక ప్రతిజ్ఞ చేశారు – ఇంట్లో సవర భాషలో మాత్రమే మాట్లాడతానని, బైట సవరభాషను గురించి మాత్రమే మాట్లాడతానని. ఈ ఏర్పాటు వల్ల ఆయన ఏమంటున్నదీ ఆమెకు తెలియదు. అందుకని భార్యాభర్తల మధ్య పోట్లాటలు లేకుండా పోయినవి.

***ఇక మిగతావాళ్ళ విషయము, ఒక్కొక్కరు ఈ విషయంలో ఏమి చెప్పిందీ వ్రాస్తున్నాను.***

*వేలూరి వారు:* ఇంటావిడకు మన మాటలు ఏవీ వినపడనంతటి దూరంలో ఒక కుటీరం నిర్మించుకొని, ప్రొద్దస్తమానమూ అక్కడే కాలం గడపడం వల్ల చాలా వరకు భార్యాభర్తల మధ్య పోట్లాటలు ఉండవు.

*ధనికొండవారు:* సన్నని వేప బెత్తంతో వీపు చిట్లగొడితే మళ్ళీ మాట్లాడదు. ఒకటి రెండుసార్లు ఇల్లాగ జరిగిన తర్వాత మా ఆవిడకూ, నాకూ అభిప్రాయభేదాలంటూ లేకుండా పోయినాయి.

*బుచ్చిబాబుగారు :* తెలిసినవాళ్ళ మాట తెలియనివాళ్ళు వినడం ధర్మం. మా అవిడ ఎప్పుడూ "మీకేమీ తెలియదండీ. మీకేమాత్రం తెలియదండీ!" అంటూ వుంటుంది. ఇల్లాగ ప్రతిరోజూ చెవిలో నూరిపోయటం మూలాన నాకు ఏమీ తెలియదు అన్న నమ్మకం బాగా కుదిరింది. అన్నీ తెలిసిన విజ్ఞాన సర్వస్వము మా ఆవిడ. ఆవిడమాట మెదలకుండా వినడమే నా పని. ఇక పోట్లాటలు ఎల్లాగుంటవి?

*జమ్మలమడకవారు :* భార్యాభర్తల మధ్య పోట్లాటలు లేకుండా ఉండాలంటే భర్త సంస్కృతం నేర్చుకోవాలి. నీవు సంస్కృతంలో మాట్లాడు. ఆవిడకు అర్థం కాదు. దాంతో గప్‌చిప్‌గా ఊరుకొంటుంది ఆవిడ. నేను అలాగే చేస్తున్నాను.

*అభ్యుదయకవి :* అభ్యుదయ మార్గాన నడిచి నేను ముందుకు వచ్చేశాను. ఆవిడ అక్కడే ఉండిపోయింది. మా యిద్దరి మధ్య దూరం ఎక్కువ అయింది. ఆవిడ మాటలు నాకు వినపడవు. నా మాటలు ఆవిడకు వినపడవు.

*నారాయణబాబు :* భార్య అంటే ఏమిటో నాకు తెలియదు. నా అభిప్రాయం కావాలని మీకు గట్టి కోరిక ఉంటే, నాకొక పెళ్ళికూతురును చూడండి, పెళ్ళిచేసుకొని కొన్నాళ్లు ఆ జీవితం ఎల్లాంటిదో చవిచూచి తర్వాత అభిప్రాయం చెబుతాను.



*– మునిమాణిక్యం నరసింహారావు*

*(1898–1973)*

మి




# ఘన నిఘంటువు

**- రవిచంద్ర**

సంస్కృతభాష ప్రాచుర్యంలో వున్నప్పుడు అది పండితులకే పరిమితమైనది. తెలుగులో పద్యకావ్యాలు వచ్చినప్పుడు ప్రబంధ కవులు, వారి పాఠకులకే పరిమితం అయినారు. ఆ తరువాత వచ్చిన రచనలు, కావ్యాలు ఎక్కువ మంది చదువుకోవడానికి ఆస్కారం కలిగించాయి. వాడుక భాష రచనా భాషగా మార్పు చెందినప్పుడు విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భములోనే మనకు కొన్ని నిఘంటువులు అందుబాటులోకి వచ్చాయి. అవి ఇంగ్లీషు – తెలుగు, తెలుగు–తెలుగు, సంస్కృతం–తెలుగు. నిఘంటువుల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు సరియైన పదాలు. వాటి అర్థాలు అందించటమే. అలాగే క్రొత్తగా తెలుగు భాష నేర్చుకొనేవారికి దారి చూపేదిగా వుండటం. ఈ నిఘంటువు పని ఏ ఒక్క వ్యక్తీ చేసేది కాదు. భాషా అకాడమీలు, విశ్వవిద్యాలయాలు చేయవలసినది. కాని మన దురదృష్టం ఇటువంటి ఏ వ్యవస్థ ఈ పనికి సమగ్రంగా పూనుకోలేదు. ఇప్పటివరకు మనకు అందుబాటులో వున్న నిఘంటువులు బ్రౌన్ (1853). ఇంగ్లీషు – తెలుగు. శంకరనారాయణ (1974). ఇటీవల తెలుగు అకాడమి వారు ప్రచురించినది (1978).

మొదటి రెండు ఆ కాలం నాటి వాడుక పదాలు, గ్రాంధిక పదాలను ఆంగ్లపదాలకు అర్థాలుగా ఇచ్చేవి. ఇప్పటి విద్యార్థులకు అవి కొంత వరకే ఉపయోగకరము.

ఈ సందర్భములో ఈ నిఘంటువులన్నింటిని నేటి విద్యార్థులకు అవసరము, అర్థమయ్యే విధముగా తిరిగి వ్రాయవలసిన పని ఎంతైనా వున్నది. సరిగ్గా అటువంటి ప్రయత్నమే విక్రమ్ పబ్లిషర్స్‌వారు డా॥ పి. హరిపద్మ, శ్రీ పెద్ది సాంబశివరావు గార్ల కృషితో వెలువరించారు.

ఈ నిఘంటువు పరిశీలిస్తే దీని రూపకల్పన, కూర్పుల వెనుక చాలా కృషి, ప్రతిభ వున్నట్లు తెలుస్తుంది. ఆంగ్ల పదాల ఉచ్చారణ, అర్థాన్ని విశదీకరించటం, అందుకు అవసరమైన బొమ్మలను జోడించడంతో పాటు చాలా చోట్ల సూక్తులను కూడా జతచేశారు. ఇది నేటి విద్యార్థులకు, తెలుగు నేర్చుకొనేవారికి చాలా ఉపయోగకరముగా వుంటుంది. ముప్పై వేల ఆంగ్ల పదాలతో తొమ్మిది వందల ఎనభైనాలుగు పుటలే కాక మూడు వందల అరవై అనుబంధ పుటలతో సమగ్రంగా వుంది. అయితే ఈ క్రింది ఉదహరించిన లోపాలను వారు తప్పనిసరిగా తదుపరి ప్రచురణలో సరి చేసుకోవలసి వుంటుంది. పుట నంబరు 119, child : దీనికి ఇంగ్లీషు అమ్మాయి బొమ్మ వేశారు. పుటలు 14 (Actor), 9 (Accident), 11 (Ache) వీటిల్లో వేసిన బొమ్మలు కూడా సరిచేయవలసిన అవసరం ఉంది. అట్లానే 133 (Combine), 173 (decorate), 184 (device), 191 (diseased), 227 (erotic), 242(expose), 283(Gatekeeper), 356 (indoor), 817 (straighten) మొదలగు వాటికి వేసిన బొమ్మలు సరిచూసుకోవాలి. ఇవి కొన్ని మాత్రమే ఉదా॥ ఇచ్చాము. ఈనాడు వాడుకలో లేని పదాలు చాలా వరకు తీసివేసినట్లుంది. కాని వాటిని వుంచవలసిన అవసరం ఎంతైనా వుంది.

పదకోశం అంటే తెలియని పదాలకు అర్థం తెలియజేయటమే కాదు, మన భాషా నైపుణ్యాన్ని, ఉచ్చారణను మెరుగు పరిచేవిగా వుండాలి. అందుకు తప్పనిసరిగా **'శంకర నారాయణ'** పదకోశం దోహదం చేస్తుంది. అందుకు కృషిచేసిన డా॥ హరిపద్మ, పెద్ది సాంబశివరావుగార్లు అభినందనీయులు.

ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి.
వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

### I. మిసిమి ప్రచురణలు

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 5. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 99.00 |
| 6. | అమాహ | " " | 60.00 |
| 7. | అంతర్వీక్షణం | " " | 60.00 |
| 8. | సిద్ధార్థ | " " | 100.00 |

### II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

### III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 3. | మిళింద పన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 4. | మహా పరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 5. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |

### IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? | 40.00 |

---

**మిసిమి** *పూర్వ సంచికలు కావాలంటే సం॥, నెల తెలుపుతూ ఒక కార్డు రాయండి*

---

మిసిమి
మాసపత్రిక


**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/–తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/– కలపండి.

**1. పేరు :** ........................................

**2. చిరునామా :**

ఇం.నెం. ........................................

వీథి ........................................

పేట ........................................

ఊరు ........................................

పిన్ ........................................

**3. సంతకం :** ........................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



పల్లె జీవులు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



కష్ట జీవులు